తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
గురువారం 09.10.2025 | సంపుటి :12 సంచిక : 79 | పేజీలు :12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



## మాకొద్దీ అమెరికా

తగ్గిన విద్యార్థి వీసాల జారీ

- అగ్రరాజ్యానికి వెళ్లేందుకు జంకు
- ట్రంప్ చర్యలతో చాలామంది వెనకడుగు
- ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేషన్ నివేదిక

**వాషింగ్టన్,అక్టోబర్8(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విద్యార్థి వీసాలపై విధించిన కఠిన ఆంక్షలతో.. వీసాల తగ్గుదలలో భారతీయ విద్యార్థులే అగ్రస్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. బెదిరింపు విధానాలు, ఆంక్షల మధ్య అమెరికా వెళ్లేందుకు భారతీయ విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఈయేడు అమెరికా వెళ్లాలనుకున్న వారు తగ్గారు. ఆగస్టులో అమెరికా సుమారు ఐదోవంతు తక్కువ విద్యార్థి వీసాలు జారీ చేసిందని, దీంతో భారతీయ విద్యార్థుల సంఖ్య పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేషన్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అమెరికా యూనివర్సిటీల్లో విద్యాసంవత్సర ప్రారంభ నెల అయిన ఆగస్టులో 3,13,138 విద్యార్థి వీసాలను జారీ చేసింది. ఇది 2024 ఆగస్టుతో పోలిస్తే 19.1శాతం తగ్గినట్లు వెల్లడించింది. గతేడాది అమెరికాకు వెళ్లిన విద్యార్థుల్లో

మిగతా 3లో..

## భారత్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలదు



- ఎవరితో సంబంధాలు కొనసాగించాలనేది పూర్తిగా వారి ఇష్టం
- ఆ దేశ నిర్ణయాలను శాసించలేం
- రష్యా చమురు కొనుగోళ్లు భారత్ ఆర్థిక వృద్ధికి కారణం కాదు
- ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ వెల్లడి

3లో..

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి..

## నవీన్ యాదవ్

ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం



**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ అభ్యర్థిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. వి.నవీన్ యాదవ్ పేరును ఏఐసీసీ బుధవారం రాత్రి అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. నవంబరు 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. గత ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసి గెలిచిన మాగంటి గోపీనాథ్ (62) మృతితో ఈ ఎన్నిక అనివార్యమైంది. నవీన్‌యాదవ్ ఆ ఎన్నికల్లో ఎంఐఎం తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి, తాజాగా టికెట్ దక్కించుకున్నారు.

## గెలుపు మాదే

- ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

2లో..



## బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ

విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):**

బీసీ రిజర్వేషన్ బిల్లుపై హైకోర్టులో వాదప్రతివాదనలు సాగాయి. ఇరు పక్షాలు తమ వాదనలను ధర్మాసనం ముందు బలంగా వినిపించాయి. ఇప్పటికే స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చినందున ప్రభుత్వం జీవో ఇవ్వాల్సి వచ్చిన ఆవశ్యకతను ప్రభుత్వం కోర్టు ముందు ఉంచింది. వాదనలు విన్న ధర్మాసనం బీసీ రిజర్వేషన్ బిల్లుపై హైకోర్టు తీర్పును నేటికి వాయిదా వేసింది. తిరిగి నేటి మధ్యాహ్నం 2.15గంటలకు విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. బీసీ రిజర్వేషన్లపై మొత్తం 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. అన్ని పిటిషన్లను

మిగతా 2లో..

- హైకోర్టులో వాదనలు బలంగా వినిపిస్తున్న రాష్ట్ర సర్కారు
- సమగ్ర కులగణన..బీసీ రిజర్వేషన్లపై ధర్మాసనానికి వివరణ
- జీవోను కొట్టేయాలని పిటిషనర్ తరఫు లాయర్ వాదన
- తిరస్కరించిన ధర్మాసనం...ట్రిపుల్ టెస్ట్ విధానంపై ప్రశ్న
- గవర్నర్ దగ్గర పెండింగ్ బిల్లు..అసెంబ్లీ తీర్మానాలపై ఆరా

## మమ్మల్ని ప్రతివాదులుగా చేర్చండి

బీసీ రిజర్వేషన్లపై ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన కూనంనేని, ఆర్ కృష్ణయ్య, ఇందిరా శోభన్

2లో..

## యథాతథంగా స్థానిక సంస్థల ఎన్నికలు

- నేటి నుంచి నామినేషన్ల జాతర
- జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు స్వీకరణ



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నేడు ఉదయం 10.30 గంటల నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో నేటి ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. అయితే, పిటిషనర్ విజ్ఞప్తిని హైకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో రేపటి నుంచి ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూలు ప్రకారం తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు.. ఆ తర్వాత సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈనెల 9న ప్రారంభమై నవంబరు 11న ముగుస్తుంది. రెండు విడతల్లో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 9న (గురువారం).. మూడు విడతల్లో జరిగే సర్పంచి, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించిన

మిగతా 2లో..



మొబైల్ నుంచి చిప్ వరకు..

## 'మేక్ ఇన్ ఇండియా'పై దృష్టిపెట్టాలి

పెట్టుబడులకు ఇదే సరైన సమయం

పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మొబైల్‌ఫోన్ల నుంచి సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ వరకు అన్ని రంగాల్లో 'మేక్ ఇన్ ఇండియా'పై దృష్టిపెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తమ ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేసిందని, భారత్‌లో పెట్టుబడులకు ఇదే అత్యుత్తమ సమయమని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ సభలో బుధవారం ఆయన మాట్లాడారు. పెట్టుబడులకు భారత్ అత్యంత అనుకూల గమ్యస్థానంగా అవతరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారులను ఆహ్వానించే ప్రభుత్వ విధానాలు, సులభతర వ్యాపార పద్ధతులు ఇందుక్కారణం అని తెలిపారు. వస్తు, సేవల పన్ను రేట్లను సవరించడం ద్వారా

మిగతా 2లో..

## ముంబైలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం

- అత్యాధునిక ఎయిర్‌పోర్టుకు ప్రారంభోత్సవం చేసిన ప్రధాని
- రూ.19,650 కోట్లతో అదానీ ఎయిర్‌పోర్ట్స్, సిడ్కో నిర్మాణం

ఉగ్రదాడులు జరిగినా

## కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉంది?

- 2008 దాడులకు దీటుగా ఎందుకు ప్రతిస్పందించలేదు?
- విదేశీ ఒత్తిళ్ల వల్లే వెనక్కు తగ్గింది : ప్రధాని మోదీ

2లో..

## మాకు 15 సీట్లు కావాలి

లేకుంటే ఎన్నికల్లో పోటీ చేయం

మా పార్టీకి బీహార్‌లో గుర్తింపు అవసరం

భాజపాకు మిత్రపక్షం హిందుస్థానీ అవామ్ మోర్చా వార్నింగ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో బిహార్ రాజకీయాలు వేడెక్కాయి అధికార ఎన్డీయే, విపక్ష మహాగఠ్‌బంధన్ కూటముల్లోని పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భాజపా మిత్రపక్షం హిందుస్థానీ అవామ్ మోర్చా 15 సీట్లు డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్

మిగతా 2లో..

## అడ్లూరికి క్షమాపణలు చెప్పిన పొన్నం



ముగిసిన వివాదం

- టీపీసీసీ చీఫ్ నివాసంలో ఇరువురు మంత్రుల భేటీ
- కలిసి పనిచేయాలని మహేశ్ గౌడ్ సూచన

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల ఏర్పడిన అంతర్గత విభేదాలు సర్దుబాటు అయ్యాయి. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య చెలరేగిన వివాదానికి తెరపడింది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చొరవ తీసుకుని ఇరు నేతలకు సర్దిచెప్పడం తో సమస్య పరిష్కారమైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ భేషరతుగా క్షమాపణ తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణలు చెబుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నివాసంలో ఈ మంత్రులిద్దరూ భేటీ అయ్యారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నివాసంలో ఇరువురు మంత్రుల మధ్య సయోధ్య కుదిరింది. బుధవారం ఉదయం పీసీసీ చీఫ్ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పారు. దీంతో ఇరువురి

మిగతా 2లో..



## పర్యావరణ పరిరక్షణ ఆవిష్కరణల్లో విశేష కృషి

- కెమిస్ట్రీలో ముగ్గురికి నోబెల్
- కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ యూఘికిలకు పురస్కారం

**స్టాక్‌హోం(జనంసాక్షి):**మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ ఏడాది రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి వరించింది. సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ యాఘి ఈ పురస్కారం దక్కించుకున్నారు. కొత్త రకం పరమాణు నిర్మాణాన్ని వీరు అభివృద్ధి చేశారు.మెటల్-ఆర్గానిక్

మిగతా 2లో..



## బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

ఆరుగురు దుర్మరణం

- పలువురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చోటు చేసుకున్న ప్రమాదం
- ఘటనపై పీఎం మోదీ, సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
- తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

**కోనసీమ(జనంసాక్షి):**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారిని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు

మిగతా 2లో..

## ఆ దగ్గుమందులు వాడొద్దు



- రెండు రకాల ఔషధాలపై నిషేధం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):**రెండు దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పీఫ్రెష్-టీఆర్‌ను విక్రయించొద్దంటూ అందులో పేర్కొంది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు గుర్తించారు. వీటిని గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీల ఔషధాలుగా పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ

మిగతా 2లో..

ఆ దగ్గుమందును ఇతర దేశాలకు


## ఎగుమతి చేశారా?

భారత్‌ను ప్రశ్నించిన డబ్ల్యూహెచ్‌వో

2లో

## ఈసారి యుద్ధం వస్తే మాదే పైచేయి

భారత్‌తో ముప్పు తొలగిపోలేదు: పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



**లాహోర్(జనంసాక్షి):**ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. పాక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు.ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ..

మిగతా 9లో..

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం హామీ..

## దీపావళి వరకు బంద్ వాయిదా

ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య నిర్ణయం

**హైదరాబాద్(జనంసాక్షి):**ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రభుత్వం ఇచ్చిన హామీతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసుకుంది. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సమాఖ్య ప్రతినిధులు కలిసి తమ సమస్యలను వివరించారు. అనంతరం వారు సమావేశమై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వం దీపావళి లోపల రూ.300 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని హామీ

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
09.10.2025

## మమ్మల్ని ప్రతివాదులుగా చేర్చండి

**బీసీ రిజర్వేషన్లపై ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన కూనంనేని, ఆర్ కృష్ణయ్య, ఇందిరా శోభన్**

**హైదరాబాద్(జనంసాక్షి):**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. రిజర్వేషన్ల పెంపు జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. అన్ని పిటిషన్లను కలిపి ఒకేసారి విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే విషయమై సుప్రీంకోర్టులో కేసు వివరాలను సీజే అడిగి తెలుసుకున్నారు. రిజర్వేషన్ల అంశాన్ని హైకోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు పిటిషన్లను డిస్మిస్ చేసిందని ఏజీ గుర్తుచేశారు. ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను సవాలు చేస్తూ బి. మాధవరెడ్డి, సముద్రాల రమేశ్‌లు పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. జీవోను సమర్థిస్తూ తమను ప్రతివాదులుగా చేర్చాలంటూ.. సోమ, మంగళవారాల్లో పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. మంగళవారం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, ఇందిరా శోభన్ తదితరులు ఈ పిటిషన్‌లు వేశారు.

## పర్యావరణ పరిరక్షణ ఆవిష్కరణల్లో విశేష కృషి

ఫ్రేమ్‌వర్క్‌ల అభివృద్ధి అనేది రసాయన శాస్త్రవేత్తలకు సమాజంలోని పలు సవాళ్లను పరిష్కరించడానికి కొత్త అవకాశాలను అందించింది. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన విషపూరిత వాయువులను నిల్వ చేయడానికి ఎంఓఎఫ్ పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఫ్యాక్టరీలు, విద్యుత్ కేంద్రాల నుంచి కార్బన్ డై ఆక్సైడ్‌ను సంగ్రహించి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి అనేక కంపెనీలు ఎంఓఎఫ్ పదార్థాలను పరీక్షిస్తున్నాయి. ఈ ముగ్గురు శాస్త్రవేత్తల ఆవిష్కరణలు పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమలలో సురక్షితమైన, సమర్థవంతమైన పరిష్కారాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చారంటే?**

1901-2024 మధ్యకాలంలో 116 సార్లు రసాయన శాస్త్రంలో నోబెల్‌ను ప్రకటించారు. ఇప్పటి వరకు 195 మంది ఈ అవార్డును అందుకున్నారు. వీరిలో కేవలం 35 ఏళ్ల అతిపిన్న వయస్సులో ఫ్రెడెరిక్ జొలియట్ నోబెల్ అందుకోగా, 97 ఏళ్ల వయస్సులో జాన్ బీ గూడ్‌ఎనఫ్ దీనిని అందుకున్నారు. ఇక ఫ్రెడెరిక్ సాంగెర్, బ్యారీ షార్ప్‌లెస్‌లు రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకోవడం విశేషం. ఫిజిక్స్?లో నోబెల్ అందుకున్న మేడం క్యూరీ రసాయన శాస్త్రంలో కూడా అవార్డు పొందడం గమనార్హం. కాగా గతేడాది ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ అవార్డు దక్కింది. ప్రొటీన్లపై విశేష పరిశోధనలు చేసిన డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లు నోబెల్ అందుకున్నారు.

వైద్యశాస్త్రంలో నోబెల్ విజేతలు

ఈ ఏడాది మేరీ ఇ.బ్రుంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచి అనే ముగ్గురు శాస్త్రవేత్తలు వైద్య శాస్త్రంలో నోబెల్ పురస్కారానికి ఎంపిక అయ్యారు. రోగనిరోధక వ్యవస్థపై చేసిన పరిశోధనలకు గాను వీరిని ఎంపిక చేసినట్లు నోబెల్ కమిటీ తెలిపింది.

భౌతిక శాస్త్రంలో నోబెల్ విజేతలు

ఈ ఏడాది భౌతిక శాస్త్రంలో జాన్ క్లార్క్, మైఖేల్ హెచ. డెవోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లు నోబెల్ పురస్కారానికి ఎంపిక అయ్యారు. క్వాంటం మెకానికల్ టన్నెలింగ్‌లో చేసిన పరిశోధనలకు గాను నోబెల్ కమిటీ వారిని ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేసింది. ఇక అక్టోబర్ 9, 10, 13 తేదీల్లో వరుసగా సాహిత్యం, శాంతి, ఆర్థిక శాస్త్రం విభాగాలకు సంబంధించిన నోబెల్ పురస్కారాలను ప్రకటించనున్నారు. వాస్తవానికి సైన్స్ విభాగంలో నోబెల్ పొందాలంటే, శాస్త్రవేత్తలు చాలా ఏళ్లు నిరీక్షించాల్సి ఉంటుంది. అంతేకాదు వారి పరిశోధన కాల పరీక్షకు నిలబడుతుందని నిరూపించాల్సి ఉంటుంది. స్వీడెన్‌కు చెందిన దిగ్గజ రసాయన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త అయిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ గుర్తుగా ఏటా డిసెంబర్ 10న ఈ పురస్కారాలు అందిస్తారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని నోబెల్ కమిటీ ఇందుకు ఎంపిక చేస్తుంది. నోబెల్ విజేతలకు డిప్లొమా, బంగారం పతకంతో సహా 11 మిలియన్ స్వీడిష్ క్రోనార్‌లు (సుమారు రూ.10.38 కోట్లు) అందిస్తారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం హామీ

ఇచ్చింది. దీంతో అక్టోబర్ 13వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మెను, కళాశాలల బంద్ కార్యక్రమాన్ని అక్టోబర్ 23వ తేదీ వరకు (దీపావళి మరుసటి రోజు వరకు) వాయిదా వేయాలని నిర్ణయించారు. అయితే, దీపావళి నాటికి బకాయిలు విడుదల కాకపోతే.. అక్టోబర్ 23న మళ్లీ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని సమాఖ్య స్పష్టం చేసింది. ఇక, దసరా ముందు విడుదల చేసిన రూ.200 కోట్ల బకాయిల్లో సుమారు 70 మైనారిటీ, జనరల్ కళాశాలలకు ఒక్క రూపాయి కూడా అందలేదని సమాఖ్య పేర్కొంది. ప్రభుత్వం వెంటనే నిధుల విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## మాకు 15 సీట్లు కావాలి

జీతన్ రామ్ మాంఝీ కీలక వ్యాఖ్యలు చేశారు."మాకంటూ ఒక గుర్తింపు ఉండాలంటే.. గౌరవప్రదమైన సీట్లు కావాలి. మేం 15 సీట్లు డిమాండ్ చేస్తున్నాం. ఆ సీట్లు ఇవ్వకపోతే ఎన్నికల్లో పోటీ చేయబోం. కానీ ఎన్డీయేలోనే కొనసాగుతాం. నేనేమీ ముఖ్యమంత్రిని కావాలని కోరుకోవడం లేదు. మా పార్టీకి గుర్తింపు కావాలని మాత్రమే ఆరాటపడుతున్నాం" అని జీతన్ రామ్ అన్నారు. దీనిపై భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా ఆయనతో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఆయన బుజ్జగించే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. ఎన్డీయే కూటమిలో జేడీయూ, భాజపా జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా , చిరాగ్ పాసవాన్ ఆధ్వర్యంలోని లోక్‌జనశక్తి పార్టీ ఉపేంద్ర కుశ్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ భాగం. హెచ్ఏఎంకు ఏడు, ఆర్ఎల్ఎంకు ఆరు సీట్లు ఇచ్చేందుకు భాజపా సిద్ధమైనట్లు తెలుస్తోంది. కూటమిలో కీలక పార్టీలైన జేడీయూ, భాజపా సమానంగా సీట్లు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. చెరో 100 స్థానాల్లో పోటీ చేయొచ్చని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతలుగా బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి అదే నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబరు 22వ తేదీతో ముగియనుంది.

## బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాణసంచా పరిశ్రమ యజమాని సత్తిబాబు కూడా ఉన్నట్లు సమాచారం. సమాచరం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 40 మంది కార్మికులు అందులో పనిచేస్తున్నారు. భారీ పేలుడు ధాటికి బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు గోడ కూలింది. శిథిలాల కింద మరికొందరు ఉండొచ్చని సమాచారం. ఘటనాస్థలిని రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు.

**కోనసీమ ప్రమాదంలో ప్రాణనష్టం బాధాకరం: మోదీ**

దిల్లీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణనష్టం చోటుచేసుకోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, కుటుంబాలకు ప్రధాని మోదీ సానుభూతి తెలియజేశారని ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు తెలిపింది.రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. దీంతో పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు.

# బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ

కలిపి హైకోర్టు.. బుధవారం మధ్యాహ్నం లంచ్ బ్రేక్ తర్వాత విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు పలు ప్రశ్నలు వేసింది. గవర్నర్ దగ్గర బిల్లు ఎప్పటినుంచి పెండింగ్‌లో ఉంది?, ట్రిపుల్ టెస్టు విధానం అమలు చేశారా, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా నిర్వహించారు, కమిషన్ రిపోర్ట్ పబ్లికేషన్ చేశారా, ప్రజల అభ్యంతరాలను స్వీకరించారా.. అంటూ హైకోర్టు ప్రశ్నించింది. షెడ్యూల్ నోటిఫై అయ్యిందా అని ఏజీని ప్రశ్నించించింది. వాదనలు ఇంకా వినిపించాల్సి ఉన్నందున విచారణ రేపటికి వాయిదా వేయాలని ఏజీ కోరారు. ఇదిలాఉండగా, నామినేషన్లు వేయకుండా స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. అయితే స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం.. జీవో 9ని జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ జీవోను సవాల చేస్తూ సముద్రాల రమేశ్, బు÷-టటెంబారి మాధవరెడ్డి.. పిటిషన్ దాఖలు చేశారు. జీవోను సమర్థిస్తూ తమను ప్రతివాదులుగా చేర్చాలంటూ.. సోమ, మంగళవారాల్లో పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, ఇందిరా శోభన్ తదితరులు మంగళవారం ఈ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఇదిలాఉండగా, బీసీ రిజర్వేషన్ బిల్లుపై హైకోర్టు విచారణలో ట్రిపుల్ టెస్ట్ అంశం కీలకంగా మారింది. ట్రిపుల్ టెస్ట్‌ను పాటించకుండా రిజర్వేషన్లపై చట్టం చేయలేరంటూ పిటిషనర్ తరఫు లాయర్ వాదించారు. 50 శాతం రిజర్వేషన్ల పరిధి దాటడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఉన్న రిజర్వేషన్ల ప్రకారం..2021 డిసెంబర్‌లో ట్రిపుల్ టెస్ట్‌పై మార్గదర్శకాలు ఉన్నాయంటూ గుర్తు చేశారు. బీసీ జనగణన కోసం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు.. రిజర్వేషన్ల శాతం తేల్చాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నట్లు పిటిషనర్ తరఫు లాయర్ గుర్తు చేశారు. అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదని, బీసీ కులగణన చేశారు కానీ బహిర్గతం చేయలేదన్నారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు అంటున్నారని, ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 2011 జానాభా ఆధారం అంటున్నారని, ఎస్టీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? ఆ లెక్కలు లేవని, ఎస్టీ, ఎస్టీల జనాభా తేలకుండా బీసీ రిజర్వేషన్ల పెంపు ఎలా అంటూ ప్రశ్నించారు. 2018లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ఇదే కోర్టు కొట్టివేసిందంటూ పిటిషనర్ తరఫు లాయర్ ప్రస్తావించారు. బిసి రిజర్వేషన్ల ఆవశ్యకతను ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ సింగ్ మన్వి వాదించారు. ఈ క్రమంలో విచారణ అనంతరం నేటి మధ్యాహ్నం 2.15 గంటలకు వాదనలు వింటామని సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. స్థానిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీపై స్టే ఇవ్వాలని పిటిషన్ కోరారు. పిటిషనర్ విజ్ఞప్తిని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 9 జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మాధవరెడ్డి, సముద్రాల రమేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావుతో పాటు పలువురు బీసీ నేతలు ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. అన్ని పిటిషన్లను కలిపి సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా 50 శాతానికి మించరాదన్నారు. విద్య, ఉద్యోగాల్లో 50శాతం దాటినా రాజకీయ రిజర్వేషన్లు పెంచరాదని చెప్పారు. ఏజెన్సీల్లో ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ల సీలింగ్ వర్తించదన్నారు. 42శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదు. బీసీ కుల గణన చేశారు.. కానీ బహిర్గతం చేయలేదు. బీసీ కులగణన ఆధారంగా 42శాతం రిజర్వేషన్లు అంటున్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు మాత్రం 2011 జనాభా ఆధారమని చెబుతున్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ఎలా నిర్వహిస్తారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. రాజకీయాలకు అతీతంగా మద్దతు లభించింది. జీవో నంబర్ 9పై స్టే ఇవ్వాలని కోరడం సరికాదు. సమగ్ర కులగణన ద్వారానే ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రజాసంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. బీసీ ప్రత్యేక కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచొచ్చు. శాసనవ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. సవరణ చేసినా, చట్టం చేసినా శాసనవ్యవస్థదే నిర్ణయం. చట్టసభలు చేసిన చట్టాలను కొంతమంది గవర్నర్లు త్రిశంకు స్వర్గంలో ఉంచుతున్నారు. నెలలపాటు ఏ నిర్ణయమూ చెప్పడం లేదు. బిల్లును ఆమోదించడం లేదు, తిరస్కరించడం లేదు, తిప్పిపంపడం లేదు. తమిళనాడులో ఒక బిల్లు ఏళ్లతరబడి గవర్నర్ వద్దే ఉంది. ప్రజల ద్వారా ఎన్నికైన సభలు చేసే చట్టాలను ఆమోదించకపోతే ఎలా? ఆర్టికల్ 200ను గవర్నర్లు దుర్వినియోగం చేస్తున్నారు. వారు నిర్ణయం తీసుకోకపోవడంతో వ్యవస్థ స్తంభించిపోతోంది. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ గవర్నర్ ఇలాగే వ్యవహరించారు. వారి చర్యల వల్ల ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేకపోతున్నాయి. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దనే తీర్పులున్నాయని అభిషేక్ సింగ్ వాదించారు. ఈ సమయంలో స్టే ఇవ్వడం కూడా సరికాదు. సమగ్ర అధ్యయనం తర్వాతే బీసీ బిల్లు చేశారు, జీవో తెచ్చారు. పూర్తి వాదనలు విన్న తర్వాతే జీవో నెంబరు 9పై నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వం తరఫున పూర్తి స్థాయి వాదనలు సమర్పిస్తాం అని సింఘ్వీ కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది.

మా ఓపికను పరీక్షించవద్దు

పిటిషనర్లను ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇదే చివరి విచారణ కాదని.. అన్ని అంశాలనూ ప్రస్తావించొద్దని సూచించింది. తమ ఓపికను పరీక్షించకండంటూ పిటిషనర్లను ఉద్దేశించి సున్నితంగా హెచ్చరించింది. గంటలకొద్దీ ఒకే అంశం ప్రస్తావించి, తమ సమయాన్ని వృథా చేయొద్దని చెప్పింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు లాయర్ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల పై అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించాయని చెప్పారు. జీఓ పై స్టే ఇవ్వాలని కోరడం సరైంది కాదని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. పిటిషనర్ లాయర్లు ఇన్నిగంటలు వాదనలు వినిపిస్తే.. మాకు అవకాశం వస్తుందా.. అంటూ ప్రశ్నించారు. కులగణన లెక్కలు ఫోర్జరీ అనుకుంటున్నారా.. వాస్తవాలు తెలియకుండా

## యథాతథంగా స్థానిక సంస్థల ఎన్నికలు

విషయం తెలిసిందే. కాగా వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపీటీసీ, 27 సర్పంచి, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపీటీసీ, 25 సర్పంచి, 230 వార్డులుండగా.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రెండు సర్పంచి, 16 వార్డు స్థానాలకూ ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంది.

## గెలుపు మాదే

**హైదరాబాద్(జనంసాక్షి):**

బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. విచారణ రేపటికి వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. గురువారం ఉదయం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు.బీసీ రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దాదాపు 90 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కుల సర్వే జరిగిందని, బీసీల నోటి ముద్దను భాజపా లాగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీల బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

పిటిషనర్లు ఎలా మాట్లాడుతారని అన్నారు.

లంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టులో బుధవారం కీలక విచారణ సాగింది. బీసీల్లో వర్గాల వారీగా రిజర్వేషన్ల కేటాయింపు జరగలేదని పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో, విచారణ వాడివేడిగా కొనసాగింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున లాయర్ సుదర్శన్ వాదనలు వినిపించారు. అయితే, నిరంతరం అదే అంశాలను పునరావృతం చేస్తూ కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని హైకోర్టు హెచ్చరించింది. ఇది చివరి విచారణ కాదు. అన్ని అంశాలను ఒకేసారి ప్రస్తావించవద్దు. మా ఓపికను పరీక్షించకండని కోర్టు స్పష్టం చేసింది.

**ఏజీతో మంత్రుల సమావేశం**

అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ సమావేశమయ్యారు. ఏజీతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే శంకర్, ఇతర నేతల భేటీ అయ్యారు. హైకోర్టులో ఇవాళ జరిగిన సుదీర్ఘ వాదనలపై ఏజీతో బీసీ నేతల చర్చించారు.

## ఆ దగ్గుమందులు వాడొద్దు

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే 'కోల్డ్ రిఫ్'ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం డీసీఏ ప్రకటించింది. చిన్నారులలో తీవ్రమైన రోగాల్ని, మరణాలను కలిగిస్తున్న ప్రమాదకర దగ్గు మందులను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిస్తూ చర్య తీసుకుంది. రీలైఫ్, రెస్పిఫ్రెష్-టీఆర్ అనే రెండు సిరప్‌లను విక్రయించరాదు అని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం పిల్లల భద్రతను ముఖ్యంగా పరిగణించి తీసుకోవడం విశేషం. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కోల్డ్‌రిఫ్ సిరప్ కారణంగా 16 చిన్నారుల మరణాలు చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా ఎడపెడా పిల్లలకు దగ్గు, జలుబు సిరప్‌లు ఇవ్వకూడదని అధికారిక సూచనలు కూడా జారీ అయ్యాయి. కాంచీపురంలో తయారు చేసిన కోల్డ్‌రిఫ్ సిరప్‌పై ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తనిఖీలు నిర్వహించింది. ఈ సిరప్‌ను తక్షణం తెలంగాణలో విక్రయించరాదని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని హాస్పిటళ్లు, ఫార్మసీలు ఈ నిషేధాన్ని వెంటనే అమలు చేయాల్సినట్లు సూచించబడింది.

## ఆ దగ్గుమందును ఇతర దేశాలకు ఎగుమతి చేశారా?

**భారత్‌ను ప్రశ్నించిన డబ్ల్యూహెచ్‌వో**

**న్యూయార్క్(జనంసాక్షి):**దగ్గు మందుతో చిన్నారుల మరణాల ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. మధ్యప్రదేశ్‌లో 'కోల్డ్‌రిఫ్' దగ్గుమందు కారణంగా పలువురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందించింది. ఈ ఔషధం ఎగుమతులపై భారత్‌ను ఆరా తీసినట్లు తెలుస్తోంది."చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్‌రిఫ్ దగ్గు మందును (%జశీబస్త్రప్త్ర రాఎతీబజూ%) ఇతర దేశాలకు ఎగుమతి చేశారా అని డబ్ల్యూహెచ్ఓ భారత్‌ను అడిగింది. సంబంధిత అధికారుల నుంచి వివరణ వచ్చిన తర్వాత ఈ ఔషధంపై గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్స్ అలర్ట్ జారీ చేయాలా? వద్దా? అనే దానిపై అంచనా వేయనుంది" అని ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.

20కి పెరిగిన మృతులు

ఈ దగ్గుమందు కారణంగా చిన్నారుల మరణాలు పెరుగుతుండటం కలవరపెడుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో మృతుల సంఖ్య 20కి చేరింది. ఒక్క చింద్వాడాలోనే 17 మంది ప్రాణాలు కోల్పోయినట్లు మధ్యప్రదేశ్ ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా బుధవారం వెల్లడించారు. మరో ఐదుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇలాంటి కల్తీ దగ్గుమందు తాగి రాజస్థాన్‌లోనూ కొందరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.కోల్డ్‌రిఫ్ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రీసన్ ఫార్మా యూనిట్ తయారు చేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మరోవైపు, ఈ సిరప్‌పై ఇప్పటికే పలు రాష్ట్రాలు నిషేధం విధించాయి.

## అడ్లూరికి క్షమాపణలు చెప్పిన పొన్నం

మధ్య వివాదం ముగిసింది. దీనిపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మరో మంత్రి లక్ష్మణ్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజిక వర్గానికి పీసీసీ చీఫ్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సహచర మంత్రివర్గానికి కూడా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా.. కానీ ఆయన వాఖ్యల పట్ల మాదిగ జాతి బాధపడింద న్నారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. జెండా మోసిన తనకు మంత్రిగా అవకాశం ఇచ్చారని... పార్టీ లైన్ దాటే వ్యక్తిని కానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నేను ఆ మాట అనకపోయినా క్షమాపణలు చెబుతున్నా. పత్రికా కథనాలతో మంత్రి అడ్లూరి మనస్తాపం చెందారు. అందుకే ఆయనకు క్షమాపణలు చెబుతున్నా. మంత్రి అడ్లూరికి, నాకు పార్టీ సంక్షేమం తప్ప మరో ఉద్దేశం లేదు. కాంగ్రెస్ నేతలమంతా సామాజిక న్యాయం కోసం పని చేస్తాం అని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి పొన్నం మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నట్లుగా వ్యాఖ్యలు సోషల్‌మీడియా లో రావడం.. వాటిపై లక్ష్మణ్‌కుమార్ ఓ వీడియో విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. తనపై పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేశారని, మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని అందులో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు మంత్రుల మధ్య ఉన్న విభేదాలు.. ఇప్పుడు బహిర్గతమయ్యాయన్న చర్చ జరిగింది. తాజాగా బుధవారం మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్య నేతల చొరవతో పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య వివాదం ముగిసింది. దీంతో పార్టీలో ఐక్యతను రక్షించేందుకు సంకేతం ఇచ్చారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అడ్లూరి లక్ష్మణ్ ఇబ్బంది పడ్డారు. అందుకే భేషరతుగా క్షమాపణ చెప్పడం జరిగింది. అన్ని విషయాలు కుటుంబ సంబంధ సమస్య లుగా మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు ఈ సమస్యను ఇంతటితో ముగించాలనే కోరుతున్నాను అని స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుంది. ప్రతి కార్యకర్త, నాయకుడు ఐక్యంగా పని చేయాలని కోరుకుంటున్నాం అని చెప్పారు.

## 'మేక్ ఇన్ ఇండియా'పై దృష్టిపెట్టాలి

షాంపూ నుంచి టెలివిజన్ వరకు చాలా వస్తువులు చవకగా మారాయని చెప్పారు. భారత్‌లో సెమీ కండక్టర్లు, మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు ముందుకురావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. గత దశాబ్దంలో మన దేశం డిజిటల్ రంగంలో సాధించిన విశేష ప్రగతిని ప్రస్తావిస్తూ.. భారత్‌లో ఒక జీబీ వైర్‌లెస్ డేటా ధర, ఒక కప్పు టీ ధర కంటే తక్కువని మోదీ వ్యాఖ్యానించారు. డిజిటల్ కనెక్టివిటీ ఇక విలాసమో, ప్రత్యేక హక్కో ఏమాత్రం కాదని, అది ప్రతి భారతీయుడి జీవితంలో విడదీయలేని భాగమైందని పేర్కొన్నారు. భారత్‌లో ప్రస్తుతం డెవలపర్‌ల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద టెలికాం మార్కెట్, రెండో అతిపెద్ద 5జీ మార్కెట్‌గా నిలిచిందన్నారు. మానవ వనరులు, మొబిలిటీ, మైండ్‌సెట్.. ఈ మూడింటి శక్తి భారత్‌ను ముందుంచుతోందన్నారు.

## ఉగ్రదాడులు జరిగినా కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉంది?

**ముంబై(జనంసాక్షి):**2008 ముంబై ఉగ్రవాద దాడుల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన 'బలహీనత'ను ప్రదర్శించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ఈ రోజు ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ హయాంలోని యూపీఏ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పటి రాజకీయ నిర్ణయాలు మరో దేశం నుంచి వచ్చిన ఒత్తిడి ద్వారా ప్రభావితమయ్యాయని ఆరోపించారు. ముంబై దేశంలోని అత్యంత శక్తివంతమైన నగరాల్లో ఒకటి అని, అందుకే ఉగ్రవాదులు 26/11 దాడులకు తెగబడ్డారని అన్నారు.ఇటీవల, కాంగ్రెస్ మాజీ హోం మంత్రి పి. చిదంబరం ముంబై ఉగ్రదాడుల గురించి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ఒత్తిడి వల్ల తాము పాకిస్తాన్‌పై దాడి చేయలేదని చెప్పారు. ముంబై దాడుల తర్వాత మన భద్రతా దళాలు పాకిస్తాన్‌పై దాడి చేయడానికి సిద్ధమయ్యాయయని, కానీ వేరే దేశం ఒత్తిడి కారణంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భద్రతా బలగాలను ఆపిందని చిదంబరం అన్నారు. దీనిపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఏ దేశం ఒత్తిడి తెచ్చిందో వెల్లడించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కారణంగా భారత్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదుల్ని బలపరిచిందని, ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా దేశం పదే పదే ఉగ్రవాదానికి మూల్యం చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. ఉగ్రదాడి అనంతరం సైనిక చర్యను అడ్డుకుంటూ ఆనాడు నిర్ణయం తీసుకున్నదెవరో చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాల్లో ముంబై ఒకటి కావడంతోనే ఉగ్రవాదులు దానిపై దాడి చేశారన్నారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని, దేశ ప్రజలకు ఈ విషయం తెలియాలని అన్నారు. కాంగ్రెస్ చూపించిన బలహీనతే ఉగ్రవాదులకు బలంగా మారిందన్నారు. జాతీయ భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వానికి దేశం, దేశ పౌరుల భద్రతే అత్యంత ముఖ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టామని గుర్తు చేశారు.

## ముంబైలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం

**ముంబై(జనంసాక్షి):**అత్యాధునిక నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1 అందుబాటులోకి వచ్చింది. దీనిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారంనాడిక్కడ ప్రారంభించారు. అదానీ ఎయిర్‌పోర్ట్స్, సిడ్కో మధ్య పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.19,650 కోట్లతో దీనిని నిర్మించారు. దీని వార్షిక ప్రయాణికుల సామర్థ్యం 9 కోట్లు. హెవీ కార్గో హ్యాండ్లింగ్ కెపాసిటీ 3.25 మిలియన్ మెట్రిక్ టన్నులు ఉండనుంది. ముంబై మెట్రో పాలిటన్ ప్రాంతంలో ఇది రెండో అంతర్జాతీయ విమానాశ్రయం. ఛత్రపతి శివాజీ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్ట్‌లో రద్దీని దృష్టిలో పెట్టుకుని బహుళ విమానాశ్రయ వ్యవస్థ ద్వారా గ్లోబల్ సిటీస్‌లో ముంబై ప్రతిష్టను మరింత పెంచే లక్ష్యంతో ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించారు. కాగా, ముంబై మెట్రో లైన్-3కి చెందిన ఫేజ్ 2బిను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. అచార్య అత్రే చౌక్ (ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్ దగ్గర) నుంచి కఫే పెరేడ్ వరకూ ప్రయాణం సాగించే ఈ నిర్మాణానికి రూ.12,200 కోట్లు ఖర్చు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సందర్భంగా ముంబై వన్ యాప్‌ను కూడా ప్రారంభించారు. తద్వారా ప్రయాణికుల పలు ప్రయోజనాలు పొందవచ్చు. నైపుణ్యం, ఉపాధి, వ్యవస్థాపకత, ఆవిష్కరణ శాఖ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో షార్ట్-టర్మ్-ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాంను కూడా ప్రధాని ప్రారంభించారు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే ముంబయి ఎయిర్‌పోర్టు పై భారాన్ని తగ్గించేందుకు గాను ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. సరికొత్త ఆకారంతోపాటు లగ్జరీ సదుపాయాలతో భవిష్యత్తు తరాలకు అనుగుణంగా దీన్ని రూపొందించారు.

## భారత్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలదు

- ఎవరితో సంబంధాలు కొనసాగించాలనేది వారి ఇష్టం
- ఆ దేశ నిర్ణయాలను శాసించలేం
- రష్యా చమురు కొనుగోళ్లు భారత్ ఆర్థిక వృద్ధికి కారణం కాదు
- ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ వెల్లడి

**న్యూయార్క్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడికి మెల్లగా సొంత వర్గం నుంచే వ్యతిరేకత వస్తోంది. ఆయన చర్యలు కొందరు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో యాదార్థాలన ముక్కుసూటిగా చెప్పేస్తున్నారు. ప్రధానంగా రష్యా నుంచి భారత్ ఆయిల్ కొనుగోలుపై ట్రంప్ తీరును తప్పుపడుతున్నారు. భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించ కూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు అని గ్రీర్ తెలిపారు. రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళ్లు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం అని గ్రీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూఢిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోందని గ్రీర్ వెల్లడించారు.

## కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లో ఎండగడతాం

- మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్
- కాంగ్రెస్ బాకీ కార్డును సిరిసిల్ల తెలంగాణ భవన్ లో విడుదల చేసిన బోయినపల్లి వినోద్ కుమార్



**సిరిసిల్ల (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ పార్టీ మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి ప్రజల్లో ఎండగడతామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్ లో " కాంగ్రెస్ బాకీ కార్డు " ను వినోద్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు పూర్తి కావస్తున్నా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దాదాపు 420 హామీలను ఇచ్చిందని, హామీల అమలు కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని, ప్రశ్నించాలని వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ ఇతర ఎలాంటి ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ నాయకులను, ప్రజా ప్రతినిధులను నిలదీసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని వినోద్ కుమార్ సూచించారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంటి యజమాని అనుమతి తీసుకుని ప్రతి ఆడబిడ్డకు, వారి కుటుంబ సభ్యులకు వివరించి కాంగ్రెస్ మోసాలను ఎత్తిచూపుతామని వినోద్ కుమార్ తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల్లో వెళ్లి ఓటు అడిగే పరిస్థితి కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేకుండా పోతుందని వినోద్ కుమార్ పేర్కొన్నారు. వచ్చే ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తిరస్కరించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని వినోద్ కుమార్ తెలిపారు. మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు కాబట్టే ఆచార సాధ్యం కానీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో చెప్పారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసాలు ఇక సాగవు అని, వాస్తవాలు ప్రజలు గ్రహించారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని వినోద్ కుమార్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఇంట్లో ఆడబిడ్డకు రూ.. 2,500 ఇస్తామని చెప్పి 22 నెలలు గడుస్తున్నా నయా పైసా ఇవ్వలేదని, ఈ లెక్కన ప్రతి ఆడబిడ్డకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.55,000 బాకీ పడిందని వినోద్ కుమార్ తెలిపారు. వృద్ధులకు అదనంగా 2000 రూపాయలు పెన్షన్ ఆధారంగా ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఈ లెక్కన ఒక్కొక్క వృద్ధునికి 44 వేల రూపాయలు బాకీ పడ్డారని, ఒకొక్క వికలాంగునికి 44 వేల రూపాయలు బాకీ పడ్డారని, ప్రతి ఇంటికి తులం బంగారం బాకీ పడ్డారని వినోద్ కుమార్ వివరించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగులు ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని, జెఏసి చైర్మన్ గా ఉన్న కోదండరాం ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన అన్నారు. ఉద్యోగ ఖాళీల లెక్కలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు ఇప్పుడు వస్తే ఆ ఉద్యోగాలు లెక్కలు కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటున్నదని వినోద్ కుమార్ అన్నారు. రైతు బీమా, రైతు భరోసా అమలు జాడ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీంద్రరావు, మాజీ శాసనసభ్యులు సుంకి రవిశంకర్,వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్, మాజీ లైబ్రరీ చైర్మన్ శంకరయ్య, సెస్ చైర్మన్ చికల రామారావు, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, సెస్ డైరెక్టర్లు శ్రీనివాసరావు ,నారాయణరావు,లక్ష్మీనారాయణ,హరిచరణ్రావు, మాజీ జడ్పీ చైర్మన్ అరుణ, మాజీ మున్సిపల్ చైర్మన్ కళా చక్రపాణి, మనోహర్ రెడ్డి,వివిధ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఐవీఎఫ్ మహిళా విభాగ్ నూతన కమిటీ సభ్యులకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. గీత గుప్త (పొలిటికల్ చైర్ పర్సన్), ఏపూరీ జయలక్ష్మి, భువన(స్టేట్ అడ్వైజర్), భువన (స్టేట్ అడ్వైజర్), ఈసీ కమిటీ సభ్యులుగా మంజుల, సౌమ్య, రంగ సంతోష రాణి, రేణుక, శైలజ, రేణుక, సాధన, సునీత, వాణి, జ్యోతి, నీలిమ, రాణి గుప్త నియమించారు. నాగోల్ డివిజన్ అధ్యక్షురాలుగా జయశ్రీ, ప్రధాన కార్యదర్శిగా నీల జ్యోతిని నియమించారు. బుధవారం నాగోల్ లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో మహిళ విబాగ్ నాయకురాల్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా ముందుకు రావాలని ఆయన అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్య వైశ్య మహిళ సోదరీమణులు జెడ్పీటీసీ,ఎంపీపీ లు ,ఎంపీటీసీ, సర్పంచ్ గా పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున మీకు నేను అండగా ఉంటాను అని ఆయన అన్నారు. ఇంటికే పరిమితం కాకుండా వ్యాపారంగా ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలి అని మరెన్నో సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, మహిళ విభాగం అధ్యక్షురాలు చందా భాగ్య లక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంజుల , కోశాధికారి నళిని, అడ్వై జర్ మనిమల తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**నర్సంపేట అక్టోబర్ 8( జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ జిల్లాలోని నర్సంపేట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సామాగ్రి, రిటర్నింగ్, సహాయ అధికారి స్వీకరణ గదులను, జనరల్ అబ్జార్వర్, వ్యయ పరిశీలకుల గదులు, ఎన్నికల సిబ్బంది, తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరగాలని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి తీసుకోవలసిన భద్రతా చర్యలు, పాటించాల్సిన విధానాలు, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై సమీక్షించారు. ఏలాంటి పొరపాట్లు, ఆలస్యం లేకుండా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పక్కగా జరగాలని, భద్రతాపరంగా పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ ప పాఠశాలలో ఏర్పాటుచేసిన మూడు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ర్యాంపులు, దివ్యాంగులు వృద్ధుల కోసం అవసరమైన సదుపాయాలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి ఓటర్ సురక్షిత వాతావరణం లో ఓటు హక్కు వినియోగించుకొనేలా వాతావరణం కల్పించాలని అధికారులను కోరారు. నర్సంపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని కలెక్టర్ పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన, ఆర్డీఓ ఉమారాణి ఎంపీడీవోలు శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చెప్పారు. మొదటి విడత జడ్పీటీసీ, ఎంపీటీసీ నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6 జడ్పిటిసి, 58 ఎంపిటిసి స్థానాలకు మొదటి విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 9న నోటిఫికేషన్ జారీ కానున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో గణపురం, చిట్యాల, రేగొండ, కొత్తపల్లి గోరి, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు జరుగనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి జడ్పిటిసి లకు 6, ఎంపిటిసిలకు 19 మంది రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ఎలాంటి చట్ట విరుద్ధ చర్యలు చోటు చేసుకోకుండా కఠినంగా పర్యవేక్షించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లుతో శాంతి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసులు, అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఏఎస్పి నరేష్ కుమార్, రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## మాకొద్దీ అమెరికా..

- అగ్రరాజ్యానికి వెళ్లేందుకు జంకు
- ట్రంప్ చర్యలతో చాలామంది వెనకడుగు
- తగ్గిన విద్యార్థి వీసాల జారీ

భారతీయ విద్యార్థులు అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. గతేడాది కన్నా 44.5శాతం తక్కువ విద్యార్థి వీసాలు జారీ అయ్యాయి. అదే సమయంలో చైనా విద్యార్థులకు 84,647 వీసాలను జారీ చేసింది. ఇది భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసా సంఖ్య కన్నా రెట్టింపు కంటే ఎక్కుగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. అయితే ఈనివేదిక అమెరికాలో విధ్యనభ్యసిస్తున్న మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను ప్రతిబింబించదు. వీరిలో చాలా మది గతంలో జారీ చేసిన వీసాలపైనే నివసిస్తున్నారు. తాజా గణాంకాలు అనేక ముస్లిం దేశాల నుండి విద్యార్థి వీసాలలో గణనీయ మైన తగ్గుదల నమోద్కైనట్లు నివేదిక తెలిపింది. ఇరాన్ నుండి ప్రవేశాలు 86శాతం తగ్గాయి. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ట్రంప్ శరణార్థులు, వీసాల జారీపై ఆంక్షలు విధించారు. జూన్‌లో విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో విద్యార్థి వీసాల ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాలని రాయబార కార్యాలయాలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఐటి నిపుణుల కోసం జారీ చేసే హెచ్1బి వీసాల రుసుమును కూడా ట్రంప్ భారీగా పెంచారు. ఈ క్రమంలో అమెఇరాకా అంత సులువు కాదన్న భావనలో భారతీయ విద్యార్థులు ఉన్నారు.

## అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా సాంకేతిక వృత్తి విద్య

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అధునాతన సాంకేతిక వృత్తి విద్యను అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు స్వయం ఉపాధి పొందాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఈ కేంద్రాలలో వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుండి చేపటనున్న నామినేషన్ల స్వీకరణ, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. మండల, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలను 2 విడతలలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో 16 జెడ్ పి టి సి, 129 ఎం పి టి సి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మొదటి విడత ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 12వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటయే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, 13వ తేదీన అప్పీళ్ళ స్వీకరణ, 14వ తేదీన అప్పీళ్ళ పరిష్కరణ, 15వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వం ఉపసంహరణ, 3 గంటల తరువాత పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, 23వ తేదీన పోలింగ్, నవంబర్ 11వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలను పాటించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ఫారములు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐ.టి.ఐ. కళాశాల ప్రిన్సిపల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తవ్వకాలతో మాయమవుతున్న గుట్టలు



### చిట్యాల మండలంలో రెచ్చిపోతున్న అక్రమార్కులు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/చిట్యాల, (జనంసాక్షి): ప్రకృతి వనరులను కొల్లగొట్టడం.. వాటిని క్యాష్ చేసుకోవడం.. అందలం ఎక్కడం.. దొరకకుండా అడ్డదారులు తొక్కడం.. లేదా రాజకీయ ముసుగు వేసుకోవడం.. ప్రస్తుతం సమాజంలో ఈ చైన్ సిస్టం నిత్యకృత్యంగా మారింది.. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా ఇదే తంతు కొనసాగుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక, మొరం అక్రమ తవ్వకాల దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవలె ఇసుక అక్రమ రవాణాను కొంతమేరా నివారించినా, ప్రభుత్వ పనుల పేరుతో అనుమతులు లేకున్నా పలు మండలాల్లో అడ్డగోలుగా మొరం తవ్వకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతూ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుమును ఎగ్గొడుతూ అడ్డదారిలో అందలం ఎక్కుతున్నారు. తమ అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకు అనేక రకాల దారులను వెతుక్కుంటున్నారు.

### చిట్యాల మండలంలో గుట్టలను తొలిచేస్తున్నారు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో కొందరు అక్రమార్కులు ప్రకృతి వనరులను కొల్లగొడుతూ సొమ్ము చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. మండలంలోని నవాబుపేట శివారు గుట్టలను మాయం చేస్తూ మొరం దందా కొనసాగిస్తున్నారు. ఇది సంబంధిత అధికారుల దృష్టికి వచ్చినా వారు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ భూముల్లో మొరం తవ్వకాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలి. ఇందుకోసం కొంత రుసుము చెల్లించాలి. అలాగే గ్రామ పంచాయతీ భూముల నుంచి మొరం తరలిస్తే రుసుము చెల్లించి అనుమతి తీసుకోవాలి. రైతుల పట్టా భూముల నుంచి మొరం తరలించినా రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి తప్పనిసరి. కానీ మొరం వ్యాపారులు ఈ నిబంధనలు గాలికి వదిలి ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. ఆయా శాఖలకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. మొరం అక్రమ తవ్వకాలు కండ్ల ముందే చేపడుతున్నా అధికారులు కట్టడి చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అదునుగా భావించిన కొంతమంది వ్యాపారులు ఒక్కో ట్రిప్పు ట్రాక్టర్‌కు రూ.500 వసూలు చేస్తూ, రాత్రింబవళ్లు అనేక ట్రిప్పులు కొడుతున్నారు. గుట్టలను కొల్లగొడుతూ మొరం అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు.

### మొరం తరలింపును అధికారులు అడ్డుకోవాలి



మొరం తరలింపును సంబంధిత అధికారులు అడ్డుకోవాలి. చిట్యాల మండలంలోని నవాబు పేట గుట్టల్లో అక్రమ మొరం దందా యథేచ్ఛగా సాగుతుంది. కొంతˇమంది వారి అక్రమ సంపాదన కోసం మట్టి తరలిస్తూ గుట్టలను పిండి చేస్తున్నారు. దీనిపై సంబందిత అధికారులు స్పందించి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**-ఎలుకటి రాజయ్య, ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షుడు**

భారతదేశంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న ఈ సమయంలో, దాని చరిత్ర, భావజాలం, రాజకీయ ప్రభావం మీద మరోసారి చర్చలు రేగుతున్నాయి. 1925లో కేశవ్ బలిరాం హెడ్గేవార్ స్థాపించిన ఈ సంస్థ, హిందూ సమాజాన్ని బలోపేతం చేయడం, జాతీయతా వాదాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పనిచేస్తుందని చెబుతుంది. కానీ, దాని చరిత్రను పరిశీలిస్తే, అసత్యాలు, వక్రీకరణలు, సమాజాన్ని విభజించే విద్వేషాలు దాని

**2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఆర్ఎస్ఎస్, బీజేపీ ద్విముఖ వ్యూహాలు అవలంబిస్తున్నాయి. బీహార్‌లో ముస్లింలు 17 శాతం, ఎస్సీలు 20 శాతం, ఓబీసీలు 27 శాతం, ఈబీసీలు 36 శాతం ఉన్నారు. మోహన్ భగవత్ హిందువులు, ముస్లింల డీఎన్ఏ ఒకటే అని చెబుతున్నాడు, కానీ బీజేపీ ముస్లిం ఎంపీలకు టికెట్లు ఇవ్వలేదు.**

చెందుతుందని అధ్యయనాలు చూపిస్తున్నాయి. మనువాద పునరుద్ధరణ ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. కుల వ్యవస్థను కాపాడటం, దోపిడీ అసమానతలను కొనసాగించడం దాని భావజాలం. భారత రాజ్యాంగాన్ని 'వలస రాజ్యాంగం' అని విమర్శించింది, మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంగా చేయాలని కోరింది. త్రివర్ణ జాతీయ పతాకాన్ని వ్యతిరేకించింది, రిజర్వేషన్లు, హిందూ కోడ్ బిల్‌ను నిరసించింది.

# ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు – ఆచరణ–అసత్యాలు



ప్రధాన ఆధారాలుగా కనిపిస్తాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన శతాబ్ది కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిందని, హైదరాబాద్ నిజాం పాలనలో ఇబ్బందులు ఎదుర్కొందని పేర్కొన్నారు. కానీ, చారిత్రక ఆధారాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్య సమరంలో పాల్గొనలేదని, బ్రిటిష్ వారికి లోబడి ఉండాలని దాని నాయకులు పిలుపిచ్చారని చరిత్రకారులు చెబుతున్నారు. తెలంగాణాలో నిజాం వ్యతిరేక పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదని, మోడీ వ్యాఖ్యలు తప్పుడు ప్రచారమని తెలంగాణ చరిత్రకారులు ఖండిస్తున్నారు.

ఆర్ఎస్ఎస్ భావజాలం వి.డి. సావర్కర్, ఎం.ఎస్. గోల్వాల్కర్ వంటి సిద్ధాంతకర్తల రచనలపై ఆధారపడి ఉంది. సావర్కర్ హిందుత్వాన్ని భౌగోళికంగా నిర్వచించాడు, గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్'లో మత సమానత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాడు. కానీ, ప్రస్తుత సర్ సంఘచాలక్ మోహన్ భగవత్, ఆర్ఎస్ఎస్ అన్ని వర్గాలతో కలిసి పనిచేస్తుందని, వైరుధ్యాలు లేవని చెబుతున్నాడు. ఇది దాని సిద్ధాంతంలోని అంతర్గత వైరుధ్యాలను సూచిస్తుంది. గోల్వాల్కర్ రచనలలోని కొన్ని భాగాలు ఇప్పుడు చెల్లవని భగవత్ స్వయంగా అంగీకరించాడు. ఆర్ఎస్ఎస్‌ను సాంస్కృతిక సంస్థగా చూపించడం ఒక మాయ. ఇది రాజకీయంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కు మాతృసంస్థగా పనిచేస్తుంది. హిందూ రాష్ట్ర సాధన దాని ముఖ్య లక్ష్యం, కానీ హిందూ అనే నిర్వచనంలోనే భౌగోళికం, వర్ణం, సంస్కృతి వంటి వైరుధ్యాలు ఉన్నాయి.

అసత్యాల ప్రచారం ఆర్ఎస్ఎస్‌కు కీలక ఆయుధం. హిట్లర్ మంత్రి జోసెఫ్ గోబెల్స్ సూత్రాన్ని అనుసరించి, ఒక అబద్ధాన్ని పదేపదే చెబితే అది సత్యమవుతుందని నమ్ముతుంది. సోషల్ మీడియా, వాట్సాప్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఫేక్ న్యూస్, డాక్టర్డ్ వీడియోలు ప్రసారం చేస్తుంది. బీజేపీ ఐటీ సెల్ లక్షల మంది ఉద్యోగులతో 24/7 పనిచేస్తూ, ప్రత్యర్థులపై అసత్యాలు రూపొందిస్తుంది. మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ వంటి కాంగ్రెస్ నేతలపై వందలాది అబద్ధాలు ప్రచారం చేస్తుంది. ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు దేశానికి ముప్పుగా చూపించి, మత విద్వేషాన్ని రెచ్చగొడుతుంది. ఫేక్ న్యూస్ సోషల్ మీడియాలో నిజ వార్తల కంటే ఆరు రెట్లు వేగంగా వ్యాప్తి

ఆర్ఎస్ఎస్ నాయకత్వం ఎక్కువగా బ్రాహ్మణులదే: హెడ్గేవార్, గోల్వాల్కర్, సుదర్శన్, భగవత్ వంటి వారు బ్రాహ్మణ కులాలకు చెందినవారు. ఒక్క రాజేంద్ర సింగ్ మాత్రమే రాజ్‌పుత్ నుంచి వచ్చాడు. శూద్రులు, బీసీలు, ఎస్సీ/ఎస్టీలు, మహిళలు నాయకత్వంలో చోటు లేదు, ఇది దాని కులాధిపత్య స్వభావాన్ని తెలియజేస్తుంది.

స్వాతంత్ర్యోద్యమంలో ఆర్ఎస్ఎస్ ద్విజాతి విద్వేష భావజాలాన్ని ప్రదర్శించింది. మహాత్మా గాంధీని మత సామరస్యానికి ప్రతీకగా చూసి, ఆర్ఎస్ఎస్ సభ్యుడు నాథూరాం గాడ్సే హత్య చేశాడు. నెహ్రూను కూడా చంపాలని ప్రయత్నించారని విచారణలో వెల్లడైంది. డా. అంబేడ్కర్ నేతృత్వంలో రూపొందిన రాజ్యాంగం ఆర్ఎస్ఎస్ మనువాదాన్ని తిరస్కరించింది. దీంతో ఆర్ఎస్ఎస్ విచక్షణ కోల్పోయి, రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటిస్తుంది. పాఠ్యపుస్తకాలలో చరిత్రను వక్రీకరించి, అశాస్త్రీయ అసత్యాలు చొప్పిస్తుంది. ఎన్‌సీఈఆర్‌టీ, ఎస్‌సీఆర్‌టీ వంటి సంస్థలలో చాందసవాదులను నియమిస్తుంది.

2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఆర్ఎస్ఎస్, బీజేపీ ద్విముఖ వ్యూహాలు అవలంబిస్తున్నాయి. బీహార్‌లో ముస్లింలు 17 శాతం, ఎస్సీలు 20 శాతం, ఓబీసీలు 27 శాతం, ఈబీసీలు 36 శాతం ఉన్నారు. మోహన్ భగవత్ హిందువులు, ముస్లింల డీఎన్ఏ ఒకటే అని చెబుతున్నాడు, కానీ బీజేపీ ముస్లిం ఎంపీలకు టికెట్లు ఇవ్వలేదు. మోడీ ఆర్ఎస్ఎస్‌ను భిన్నత్వంలో ఏకత్వం కోసం కృషి చేసిందని కొనియాడాడు. ఇది ఓట్ల కోసం కపట వ్యూహం. 2024 లోక్‌సభలో 400 సీట్లు ఆశించి 240 మాత్రమే పొందిన బీజేపీ, బీహార్‌లో కాస్ట్ అలయన్స్‌లపై దృష్టి పెట్టింది.

ఆర్థిక, రాజకీయ స్వార్థాల కోసం ఆర్ఎస్ఎస్ సామాన్యులలో మతోన్మాదం పెంచుతుంది. శాంతియుత సమాజాన్ని విద్వేషాల్లోకి నెట్టుతుంది. పెట్టుబడిదారుల సహాయంతో దేశాన్ని ప్రమాదంలోకి తీసుకుపోతుంది. కానీ, యువత, విద్యావంతులు ఇప్పుడు దాని అసత్యాలను గుర్తిస్తున్నారు. రాజ్యాంగం ఉన్నంత వరకు ఆర్ఎస్ఎస్ లక్ష్యాలు సాధ్యం కావు. సత్యమేవ జయతే – దేశాన్ని అసత్యాల నుంచి రక్షించాలి.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# విప్లవానికి ప్రతీక.. చే గువేరా గాథ

చరిత్రలో కొందరు వ్యక్తులు కాలానికి అతీతంగా నిలుస్తారు. వారి ఆలోచనలు, త్యాగాలు, ఉద్యమాలు తరతరాలను ప్రేరేపిస్తాయి. అటువంటి అజరామరమైన విప్లవ నాయకుల్లో ఒకరు ఎర్నెస్టో "చే" గువేరా ు లాటిన్ అమెరికా ఖండానికే కాకుండా, ప్రపంచంలోని అణగారిన ప్రజల ఆశయాలకు ప్రతీకగా నిలిచిన మహా యోధుడు. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియో పట్టణంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఎర్నెస్టో గువేరా దే లా సెర్నా చిన్నప్పటి నుంచే మేధావి, సంకల్పశక్తి కలవాడు. బాల్యంలో ఆస్తమా అనే దీర్ఘవ్యాధితో బాధపడినా, తన ధైర్యం, పట్టుదలతో దానిని అధిగమించాడు. వైద్యవిద్యను అభ్యసించిన ఆయన బ్యూనస్ ఎయిర్స్ విశ్వవిద్యాలయం నుండి 1953లో వైద్య పట్టా పొందాడు. మొదట మానవ సేవ ధ్యేయంగా వైద్యవృత్తి ద్వారా సమాజానికి సేవ చేయాలనుకున్న ఆయన, లాటిన్ అమెరికా పర్యటనల్లో పేదరికం, అన్యాయం, సామాజిక అసమానత, అమెరికా సామ్రాజ్యవాదం ఆధిపత్యం వంటి వాస్తవాలను ప్రత్యక్షంగా చూశాడు. ఈ అనుభవాలే ఆయన హృదయంలో విప్లవ జ్వాలలు రగిలించాయి.

1951–52లో తన స్నేహితుడు ఆల్బర్టో గ్రానాడోతో కలిసి మోటార్ సైకిల్‌పై దక్షిణ అమెరికా అంతటా చేసిన విస్తృత పర్యటన ఆయన జీవితానికి మలుపు తెచ్చింది. పెరూ, చిలీ, బొలీవియా, కొలంబియా వంటి దేశాల్లోని పేద ప్రజల దుస్థితిని గమనించి ఆయన మనసు మెలికలు తిరిగింది. ఈ అనుభవాలను ఆయన "ది మోటార్ సైకిల్ డైరీస్" అనే పుస్తకంలో అద్భుతంగా రాశాడు. ఆ యాత్ర ఆయనను ఒక వైద్యుడి నుండి ఒక విప్లవ యోధుడిగా మలచింది.

1954లో గ్వాటెమాలాలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని అమెరికా మద్దతుతో కూలదోయడాన్ని చూసినప్పుడు ఆయనలో పెట్టుబడిదారీ వ్యవస్థపై వ్యతిరేకత మరింత పెరిగింది. మెక్సికోలో 1955లో ఫిడెల్ కాస్ట్రో మరియు రౌల్ కాస్ట్రోలను కలవడం ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. కాస్ట్రో నేతృత్వంలోని "జులై 26 ఉద్యమం"లో చేరి క్యూబాలోని నియంత ఫుల్జెన్సియో బాటిస్టా ప్రభుత్వాన్ని కూలదోయడానికి గెరిల్లా యుద్ధంలో పాల్గొన్నాడు. మొదట వైద్యుడిగా, తర్వాత ధైర్యవంతమైన కమాండర్‌గా ఎదిగి "చే" అనే ముద్రను సంపాదించాడు ు ఇది అర్జెంటీనా భాషలో "స్నేహితుడు" అనే అర్థమున్న పదం.

1956 నుండి 1959 వరకు సాగిన క్యూబా విప్లవ యుద్ధంలో చేగువేరా కీలక పాత్ర పోషించాడు. ఆయన వ్యూహాలు, క్రమశిక్షణ, త్యాగం విప్లవ విజయానికి దోహద పడ్డాయి. ముఖ్యంగా సాంటా క్లారా నగరాన్ని స్వాధీనం చేసుకోవడం బాటిస్టా పరాభవానికి ప్రధాన కారణమైంది. 1959 జనవరి 1న ఫిడెల్ కాస్ట్రో హవానాలో అధికారాన్ని చేపట్టగా, చేగువేరా క్యూబా ప్రభుత్వంలో ప్రధాన నాయకుడిగా ఎదిగాడు. ఆయన క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా, తరువాత పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. క్యూబాను సామాజిక సమానత్వం, ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లడానికి పలు సంస్కరణలు అమలు చేశాడు. అక్షరాస్యత ఉద్యమాన్ని నడిపించి, భూ సంస్కరణలను ప్రోత్సహించి, పేదలకు గౌరవప్రద జీవనం అందించేందుకు కృషి చేశాడు.



1959 జూలైలో ఆయన భారతదేశం సహా అనేక దేశాలను సందర్శించి సోషలిజం పట్ల అవగాహనను పెంపొందించాడు. ఆయన "నూతన మానవుడు" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు ు భౌతిక సంపదల కన్నా నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే సమాజం ఏర్పడాలన్నది ఆయన కల. అధికారంలో ఉన్నా ఆయన మనసు విప్లవంలోనే మునిగిపోయి ఉండేది. క్యూబా స్వాతంత్ర్యం సాధించిన తరువాత కూడా లాటిన్ అమెరికా అంతటా ప్రజల విముక్తి కోసం పోరాటం కొనసాగించాలని ఆయన నిర్ణయించుకున్నాడు.

1965లో ఆయన క్యూబాను విడిచి ఆఫ్రికాలోని కాంగోలో విప్లవ ఉద్యమానికి పూనుకున్నాడు. అయితే అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేక ఆ యత్నం విఫలమైంది. అయినప్పటికీ ఆయన వెనుదిరగ లేదు. 1966లో ఆయన రహస్యంగా బొలీవియాకు వెళ్లి అక్కడ గెరిల్లా యుద్ధం ప్రారంభించాడు. బొలీవియాలో పీడిత రైతులను చైతన్య పరిచి కొత్త విప్లవాన్ని సృష్టించాలని ప్రయత్నించాడు. కాని స్థానిక మద్దతు లభించక పోవడంతో యుద్ధం కష్టాల్లో పడింది. చివరికి అమెరికా సిఐఎ మద్దతు పొందిన బొలీవియన్ సైన్యం చేత ఆయన 1967 అక్టోబర్ 8న పట్టుబడ్డాడు. అక్టోబర్ 9న లా హిగురా అనే గ్రామంలో ఆయన్ని కాల్చిచంపారు.

మరణం ఆయన ఆలోచనలను చంపలేదుబీ విప్లవానికి కొత్త జీవం పోశింది. ఆయన చివరి మాటలు ు "నేను చనిపోతున్నాను, కానీ విప్లవం చనిపోదు" ు ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. విప్లవం, మానవతా భావం, సమానత్వం ఆయన ఆత్మలో పులకరించిన మూడు మూలస్తంభాలు. "ప్రపంచంలో ఎక్కడైనా అన్యాయం జరుగుతుంటే, అది ఎక్కడైనా ఉన్న న్యాయానికి ముప్పు" అనే ఆయన మాట నేటికీ సామాజిక చైతన్యానికి మార్గదర్శకం. అలాగే "నిజమైన విప్లవకారుడు గొప్ప ప్రేమతో నిండిన మనసు కలవాడు" అనే ఆయన వాక్యం యువతకు ప్రేరణగా నిలిచింది.

చే గువేరా కేవలం ఒక విప్లవ నాయకుడు కాదుబీ ఆయన ఒక ఆలోచన, ఒక స్ఫూర్తి, ఒక ఉద్యమం. ఆయన ముఖచిత్రం ు బెరెట్ ధరించిన, ధైర్యవంతమైన చూపుతో ఉన్న ఆ చిత్రం ు ప్రపంచవ్యాప్తంగా తిరుగుబాటు, ధైర్యం, సమానత్వం, న్యాయానికి చిహ్నమైంది. ఆయన జీవితాన్ని ఆధారంగా తీసుకుని రూపొందించిన The Motorcycle Diaries, Che Part One, Che Part Two వంటి సినిమాలు ఆయన సిద్ధాంతాలను ప్రపంచానికి పరిచయం చేశాయి.

చే గువేరా జీవితమే విప్లవానికి పాఠశాల. ఆయన త్యాగం ప్రపంచంలోని అణగారిన, నిరుపేద, సామాజిక న్యాయం కోసం పోరాడే ప్రతి మనిషిలో శాశ్వతంగా ప్రేరణగా వెలుగుతోంది. ఆయనను బుల్లెట్లతో హతమార్చినా, ఆయన ఆలోచనలను చంపలేకపోయారు. విప్లవం ఆయన రక్తంలో రాసిన శాశ్వత గాథగా మిగిలిపోయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్**
**9440595494**

## అప్పుల తిప్పలు!

అవసరాలు పెరిగిపోతున్నాయి,
అప్పులు ఆన్లైన్ లోనూ పుట్టుకొచ్చాయి
ఒకటా రెండా
182 యాప్ లు
స్లైస్ అనీ, బ్రాంచ్ అనీ,
Mpokket అనీ, moneyview
అనీ
వీటి మీదే నా బతుకంతా
ఇంతకింతకు ముందుకి పోతోంది!

వచ్చే అరకొర జీతాల్లో,
జీవితమే జీవి లేకుంటయితుంది
నెల్లో పందెసాల్ అలవోకగా జారిపోతాయి,
ఇంకో పందెసాల్ అప్పులు గుండెలో
గుదిబండలై కూర్చుంటాయి!
ఇంకెంతకాలమో ఇలా?

నమ్మి ఇచ్చిన వారి చూపులో,
చిన్న చూపై పోవటం
ఆత్మని అగ్నిలో పడదోసి
గుండెలవిసేలా ఏడ్చినట్టే
ఎంతకూ తీరని దుఃఖ సంద్రంలో
ఈదలేక ఊపిరిని కాస్తా
ఉన్నపళంగా తీసుకుంటున్నట్టే
ఒకటే శూన్యం లోన
ఇంతకింతకూ పరిధిని
పెంచేసుకుంటూ పోతూ
ఇంకేం మిగలని లోకాన
ఇంకేం కావాలని అడగాలో
తెలీక
పస్తులుగానే కడుపు కంటి నిండా
నిద్రపోతోంది!

**బాలాజీ పోతుల**
**8179283830**

## గబ్బిలం జన్మ ధన్యం!



లోకులు కాకులైతే గబ్బిలం
కవన రెక్కలు అద్దుకొని
కావ్యగంగలో మునిగి
నవయుగ కవి చక్రవర్తిగా తేలి
నిటాలాక్షుడి భస్మ సింహాసనంపై వాలి
కావుకావన్న నోళ్లతో
అవుననిపించుకొంది
కవికోకిలై గండపెండేరం తొడిగించుకొంది
ఓ పక్క కులసర్పం బుసలు కొడుతున్నా
అక్షరపత్రాల తరువే ఆదరువుగా
వేళ్ళాడుతూ
ప్రజల నాల్కలపై సుకవిలా
గూడు కట్టుకొని జీవించింది
గబ్బిలం కోకిలవటం
స్వీయ మతానికి సమ్మతంకాక
తలదాచుకొన్న నీడే క్రీనీడై
విరిగి పడేసరికి విరక్తితో
నాస్తిక నైర్మల్యతే నిఖమైన దైవమనుకొంది
ఐనా వేటగాళ్ళ బాణాలు తప్పలేదు
వడగాల్పుల్లో మసి చేయాలనుకొన్నా
చల్లని వెన్నెలాక్షరాలు కురిపిస్తూ
అంటరానితనం అంచులు చీల్చుకొని
నవకవితా తేజస్సుతో
విశ్వనింగికి ఎగిరిపోయింది..!

**భీమవరపు పురుషోత్తమ్**
**రాజమండ్రి, 9949800253**

# జర్నలిస్టులకు కొత్త జర్నలిజం పరిచయం చేయాలి





**బిఎస్ రాములు**
**యుగకర్త సామాజిక తత్వవేత్త**
**తెలంగాణ తొలి బీసీ కమిషన్ చైర్మన్**
**8331966987**

ఆ మధ్య యూట్యూబ్ చానల్లు దండయాత్ర చేసాయి. ఇపుడు తగ్గుముఖం పట్టాయి. ఎన్నికల ముందు మళ్లీ వస్తాయేమో! ఇటీవల ఆన్ లైన్ దిన పత్రికలు, డిజిటల్ పత్రికలు, ప్రింటు పత్రికలు చాలా వస్తున్నాయి. తెలుగు భాష కనుమరుగ వుతున్నది అనేవాళ్లు కళ్లు తెరవాలి. పత్రికలకు మార్గ దర్శనం చేయాలి. అదేమీ కనపడడం లేదు. తెలుగు పాఠకులను విస్తరింప చేసుకోవడం ఎలా అని చెప్పకుండా తెలుగు భాషావాదులు, అధికార భాషా సంఘాలు, మీడియా అకాడమీలు ఏం చేస్తున్నాయో.. అసలు వాల్లు ఎక్కడున్నారో తెలియడం లేదు. ప్రపంచ తెలుగు మహా సభలు అనగానే ఉసుల్ల పుట్ట తీరు పరిగెత్తు కొస్తారు. ట్రాఫిక్ జాం అయినపుడు ట్రాఫిక్ పోలీసు క్రమ మార్గంలో ట్రాఫిక్ క్లియర్ చేయడం కర్తవ్యం. అలాగే పోటా పోటీగా ఉత్సాహంగా వెలువడుతూ పత్రికలు ట్రాఫిక్ జాం సృష్టిస్తుంటే క్రమ పద్ధతిలో మార్గ దర్శనం చేసే కర్తవ్యం పై వారంతా స్వీకరించాలి.

**పత్రికలలో వచ్చిన మార్పులు మలుపులు**

నేటి జర్నలిస్టులకు జర్నలిజం గడిచి వచ్చిన దశలను పరిచేయాలి. వందేళ్ల జర్నలిజంలో ఎన్నిమార్పులు వచ్చాయో, ఏఏ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని ప్రయోగాలు జరిగాయో, ఏవేవి సంప్రదాయాలుగా నిలిచి పోయాయో తెలిసినపుడే జర్నలిస్టుల దృష్టి విశాలమవుతుంది.

**పత్రికా భాష వేరు**

పత్రికా భాష సులభంగా ఉండాలి. వాక్యం చిన్నదిగా ఉండాలి. గొట్టు పదాలు కూడదు. మామూలుగా పాఠ్య పుస్కాల భాషకు, మాట్లాడే భాషకు, పత్రికా భాషకు మధ్య తేడా తెలియాలి. రేడియోకర్తలకు, పత్రికల వార్తలకు, టీవీ వార్తలకు, యూట్యూబ్ చానల్ వార్తలకు, తేడాలు, ప్రత్యేకతలు తెలియాలి. పది నిమిషాల్లో వంద వార్తలు అని చదివుతూ చూపించే వార్తల స్టయిలు ప్రత్యేకంగా ఉంటుంది. 30 ఏళ్ల క్రితం సీనియర్ జర్నలిస్టులు కూడ స్థానిక వీడియో వార్తలకు వాక్యాలు రాయడానికి జీరో నుండి నేర్చుకోవాల్సి వచ్చింది.

**రేడియో టీవి పత్రికల మధ్య పని విభజన**

ఇంటర్నెట్ వచ్చేదాక జర్నలిజం దశలు ఒక టైపు. రేడియో, టీవీ, యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సప్, ఎక్స్, ఇన్స్ట్రాగ్రాం వ్యాప్తి తరువాతి దశలు మరొక టైపు. రేడియో ఏం జరిగిందో చెపుతుంది. టీవీ ఎలా జరిగిందో చూపుతుంది. పత్రిక ఏం జరిగిందో, ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో సమన్వయించి చెపుతుంది. రేడియో, టీవీ వచ్చాక పత్రికా రచన వేరైపోయింది. తన రంగంలో మరింత విశ్లేషణ, పరిశోధనాత్మక జర్నలిజం, సామాజిక శాస్త్రాల జర్నలిజం చూపు పెరిగింది.

**ఈ పత్రిక చదవాలి అనే అవసరాన్ని సృష్టించాలి**

చాలా సినిమా కథలు ప్రేమ, హింస, నేరంచుట్టూతిరిగేవే. ప్రతి సినిమా తన ప్రేక్షకులను ఆకర్షించుకోవాల్సిందే. అట్లే పత్రికలు కూడా ఆ పత్రిక చదవకపోతే ఏదో మిస్సవుతున్నామని పాఠకులు ఫీలవ్వాలి. శ్రీ శ్రీ ఏ పత్రికలో రాసినా చదువుతారు. అలా లబ్ధ ప్రతిష్టలతో రాయించి పత్రిక ను చదివేట్లు చేసుకోవాలి. అలా పత్రికలు ప్రజలకు తమ అవసరాన్ని గుర్తింప జేస్తూ సర్కులేషన్ పెంచుకుంటూ వస్తున్నాయి. టీవీ, పత్రిక మూడు మాధ్యమాలు పరస్పరం పని విభజనతో సమన్య తో పని చేస్తున్నాయి. మానవీయ కోణం, సెంటుమెంటు కోణం, మానవాక్తి కోణం అనేవి వార్తా రచనలో ప్రత్యేక శైలి రూపొందిస్తూ వచ్చాయి. వాటిని కేవలం వార్త అనకుండా స్టోరీ రైటింగ్ అని పిలుస్తారు.

ఎక్ట్రానిక్ మీడియా భారీ పత్రికలు దూలేని రంగాల్లో దూరాలి. ఎలక్ట్రానిక్ మీడియాతో పత్రికలు వేగంలో పోటీ పడలేవు. అవి నిమిషానికి వార్తలందించగలవు. పత్రికలు రోజుకు రెండుసార్లకు ప్రచురించలేవు. అందువల్ల ఇటీవల బుచ్చి వార్తల ప్రింటు మీడియా, విజువల్ మీడియా కొత్త పుంతలు తొక్కాయి. ఆ లైన్ యూనికోడ్ వార్తా ప్రసారాలు పెరిగాయి. ఇపుడు మనం ఈ దశలో జర్నలిజం, పత్రికలు, ప్రింటు వేసేవి, ప్రింటు లేకుండా డిజిటల్ గా వెలువడే పత్రికలకు పరిమితమై ఈ వ్యాసం చర్చిస్తుంది. ఇలా దిన పత్రికలు కొత్త పరిస్థితుల్లో కొత్త పాఠకులను, రేడియో టీవీ, బుచ్చి వార్తల పాఠకులను పాత పాఠకులను ఆకర్షించి చదివించడం ఎలా అనేది టార్గెట్. ఇందుకు తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాభాషా సాంస్కృతిక శాఖ , ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసే పౌర సంబంధ శాఖ, ప్రెస్ అకాడమీ, పాఠ్య పుస్తకాల రూపకర్తలు.. ఏ ఒక్కరైనా, లేదా ఉమ్మడిగా చొరవ తీసుకొని చిన్న పత్రికల సంపాదకులను, బ్యూరో చీఫ్ లను ఆహ్వానించి సదస్సులు, నుర్వహించడం, గైడ్ లైన్సు తయారు చేసి ఇవ్వడం అవసరం. వారికి రాజకీయాలు నేర్ప నవసరం లేదు. జర్నలిజం విలువలు, పత్రికా భాష, అనువాదాలకు తెలుగులో సరైన పదాలు సూచించడం చేయాలి. ఈ పనులు చేయకపోతే ఇక వీరు చేసే భాషా సేవ ఏమిటి?

ప్రపంచంలో పత్రికల్లో వస్తున్న ట్రెండ్స్‌ను పరిచయం చేయాలి. తద్వారా వారికి ఆసక్తి గల దారిలో పత్రికను తీర్చి దిద్దుకుంటారు. అలాగే 5 నిమిషాలకో వార్త, నిమిష నిమిషానికి వార్తలందించే చానల్లు, డిజిటల్ బుచ్చి వార్త పత్రికలు వస్తున్నతీరు గమనించి ప్రింటు పత్రికలు ఆన్ లైన్ డిజిటల్ పత్రికలు తమ ప్రత్యేకతను ఎలా నిలుపుకోవాలో తమదైన కొత్త పాఠక శ్రేణిని ఎలా సృష్టించుకోవాలో రకరకాల నమూనాలను వారికి పరిచయం చేయాలి. హైదరాబాద్ నారాయణ గూడ తాజ్ మహల్ హొటల్ పక్కన పత్రికలు అమ్మే పాన్ షాపులో రకరకాల పత్రికలు కనపడతాయి. దిన పత్రికల్లో అలాంటి శీర్శికలు, ప్రత్యేక వ్యాసాలు, పరిశోదన ఆర్టికల్స్, ఇంటర్ వ్యూలు ప్రచురించు కోవచ్చు. కథలు నవలలు సమీక్షలకు పెద్ద పీట వేయాలి.

భారీ సర్కులేషన్ గల పత్రికలు అన్ని రకాల కథలు వేయలేవు. ఏ సెక్షన్ నొచ్చుకుంటుందో పాత ఒరవడి కొనసాగిస్తూ నూతనత్వానికి ప్రధాన్యత ఇవ్వలేరు. ఇద్దామన్నా యాజమాన్యం అడ్డుకుంటుంది. ఒక వేళ వేసినా ఎవరో ఊరేగింపో, నిరసనను తెలుపుతారు. కనక ఆ రిస్కు తీసుకోరు. చిన్న పత్రికలు నూతనత్వాని ని ఆహ్వానించాలి. పెద్ద పత్రికలు మహిళలను పాఠకులుగా ఆకట్టుకోవడానికి మహిళా పేజీలు వేస్తున్నారు. చిన్న పత్రికలు కొత్త పత్రికలు మహిళా పేజీలకు బదులు బీసీల పేజీలు మహిళా పేజీలు పెద్ద పత్రికలు వేస్తున్నాయి గనుక కొత్త పత్రికలు బీసీలను ఆకట్టుకునే ప్రత్యేక పేజీలు నిర్వహించవచ్చు. పెద్ద పత్రికల్లో పుస్తక సమీకలు చికెన వేలంత వేస్తున్నారు. చిన్న పత్రికలు వ్యాసం సైజులో సమీక్షలు ప్రచురించ వచ్చు. అది అ పుస్తకాన్ని పరిచయం చేస్తుంది గనక విజ్ఞాన దాయకంగా ఆసక్తిగా ఆ పాఠకులు చదువుతారు. ఎదురుచూస్తారు. పుస్తక సమీక్షలు లేట్ కావడం వల్ల ఉపయోగం లేదు. పుస్తకం రాగానే అందులోని ముందు మాటల్ని సంక్షంగా వేస్తే అందరికీ సులభం, ఆసక్తి కరం. అందువల్ల పుస్కంలోని ౖందుమాటలనుండి 300పదాలలోపు రాసి టైపు చేసి యూనికోడ్ లో పుస్తకంతో పాటు పంపాలని కోరితే పాఠకులు, గ్రంథకర్తలు ఎంతో సంతోషిస్తారు.

**వైవిధ్యం కోల్పోతున్న పత్రికలు**

కొందరు దినపత్రికను వార మా పత్రికల వలె తమకు నచ్చిన సిద్ధాంత ప్రచారంతో కరపత్రాల్లా తీస్తున్నారు. ఇటీవల ఎన్ని పత్రికలు వచ్చినా కొత్తదనం లేదు. అందరు అవే వార్తలు. కొత్త వార్తలు తక్కువ. కొత్త కోణాలు తక్కువ. వ్యాసాలు, సంపాదకీయాలు లేని పత్రికలు దిన పత్రికల్లా అనిపించడం లేదు. కొందరు సంపాదకులు తమ సైజుకు అనువుగా వ్యాసాలు ఎడిట్ చేసి ప్రచురిస్తున్నారు? అన్ని విషయాలు వారు కోరే సైజులో ఇమడవు. అలా అయితే రామాయణానికి రెండు పేజీలు చాలు. అంతంత పెద్ద గ్రంథాలెందదుకు? తానొకటి తలిస్తే ఎడిటర్ మరొకటి తలిచి తల కొట్టేయడమో కాళ్లు వరికేయడమో చేస్తే రచయిత చెప్పదల్చుకున్నది పాఠకులకు చేరదు.

ఇన్ని పత్రికలు వస్తున్నా రావలసిన విశ్లేషణలు రావడం లేదు. వార్తలకు బదులుగా కొందరు తమ ఊహలను ఇలా జరిగితే బాగుండు అనుకున్నవి వార్తలుగా వడ్డిస్తున్నారు? నాయకుల పనికిమాలిన పరస్పర విమర్శల చుట్టూ పత్రికలను తిప్పుతున్నారు. సమాజం గురించిన, ప్రజల గురించిన అనేక అంశాలను వదిలేస్తున్నారు. ఆటలు సినిమా వార్తలు కొత్త పత్రికలు కూడ వడ్డిస్తున్నారు. వీరు చెప్పక పోతే అవి వారికి తెలియవా? అలాంటి వాల్లు గంట గంటకు టీవీ లో సెల్ ఫోన్లో ఫాలో అవుతూనే ఉంటారు.

**పెద్ద పత్రికల కన్నా రెట్టింపు వార్తలు విశేషాలు వ్యాసాలు ఇవ్వవచ్చు**

పెద్ద పత్రికలు అనగా పెద్ద సర్కులేషన్ గల పత్రికల కన్నా చిన్న పత్రికలు ఎన్నో విషయాలను అందించవచ్చు.పెద్ద పత్రికల్లో ప్రకటనలు ఎక్కువ. ఆటలు, షేర్ మార్కెట్, బిజినెస్, సినిమాలు, మహిళల పేజీలు, విద్యార్థులకు, ఉద్యోగార్థులకు పాఠాలు, సూచనలు, ప్రకటనలు పోన్ని నికరంగా వేసే వార్తలు తక్కువ. 20పేజీలు వేసినా సంపాదకీయ పేజీతో సహా ఐదారు పేజీల వార్తలుంటే ఎక్కువ. ఇది వారి పరిమితి. ఇది అర్థమయ్యాక వార చొరలేని ఫీల్డులో చొరబడి కొత్త పాఠకులను తయారు చేసుకోవచ్చు. వార పత్రికలు మాసపత్రికలు బాగా తగ్గి పోయాయి. అవి లేని లోటును తీరడానికి ప్రతి రోజు కథలు నవలలు సీరియల్‌గా వేయవచ్చు . విద్యార్థుల రచనలు వేయ వచ్చు. బీసీల పేజీ వేయ వచ్చు. యువ పారిశ్రామిక వేత్తల పరిచయం వేయవచ్చు.

ఇటీవల మరో ట్రెండ్ చోటు చేసుకున్నది. పత్రికను చదివే పత్రికగా కాకుండాచూసే విజువల్ పత్రికగా మార్చేస్తున్నారు. చదవడానికి అనువుగా ఉండడం లేదు. పేజీ డిజైనింగ్లో మొదటి పేజీ తప్ప మిగతా పేజీల్లో ఆకర్శణ కన పడదు. ప్రతి పేజీని మొదటి పేజీలా పెదద్ద హెడింగ్ లు పెడ్తే పత్రిక ఆకర్శణీయంగా వుంటుంది. ఉద్యోగం కోల్పోయిన, వదిలేసిన జర్నలిస్టులు అనేక కొత్త పత్రికలకు రెండు మూడు గంటల్లో 12 పేజీలు నింపి పంపుతున్నారు. అందంగా తీర్చి దిద్దడం లేదు. భారీ పత్రికలో 20 పేజీలున్నా ఐదారు పేజీలే వార్తలు వ్యాసాలు. 12 పేజీల్లో కొత్త పత్రికలు రెట్టింపు వార్తలు వ్యాలు ఇవ్వవచ్చు. హిందూ, క్రనికల్ వంటి పత్రికలు రెండు పేజీలకు మించి వివిధ వ్యాసాలు వేస్తుంటాయి. అలా వేయవచ్చు. రాయించుకోవచ్చు. జర్నలిస్టులు అనేక విషయాలు తెలుసు కోవడం మార్చుకోడం తమ శ్రమకు సార్థకత చేకూర్చుకోవడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది.

**పాఠకులను ఆకర్షించాలి**

విజన్ ఉండాలి. ఎన్నో అంశాలు దొరుకుతాయి. వాట్సప్‌లో వచ్చినవి, ఫేస్‌బుక్‌లో వచ్చివి వెరిఫై చేసి ప్రచురిస్తే వారు పత్రికను వేలాది మందికి పరిచయం చేస్తారు. విద్యార్థులు తమ తొలి రచనలు అచ్చేసిన పత్రిక అని జీవితమంతా గుర్తుంచుకుంటారు. లేఖల శీర్శిక ద్వారా ఎన్నో విషయాలు చెప్పే అవకాశం ఇవ్వ వచ్చు. ఫలానా వారివి వేయకూడదు అనే అలవాటుంటే ఆ అలవాటు ప్ర నష్టం చేస్తుంది. ఆ అలవాటు మానుకొని అందరికి చోటు కల్పిస్తేనే పత్రిక అందరిలోకి వెళ్తుంది.

**విజన్ ఉండాలి శిక్షణ పొందాలి**

విజన్ లేకపోవడమో అధ్యయనం లేక పోవడమో శిక్షణ లేక పోవడమోగాని వారు తెలంగాణ సమాజం బాగు పడడానికి చేయాల్సిన కర్తవ్యాలను స్వీకరించలేక పోతున్నారు. ఇది దయనీయ పరిస్థితి. ఆటలు సినిమాలు ఆ పత్రిక చదవక పోతే పాఠకులకు తెలియవా? అనుక్షణ టీవీ ప్రసారాలున్నాయి. పతిరికలు తమదైన కొత్త పాఠకులను తయారు చేసుకోవాలనే ధ్యాస పెరగాలి. ఆలోచిస్తే ఎన్నో కొత్త వి తోస్తాయి. కొన్ని ప్రింటు పత్రికలు కూడా మూస ధోరణి మార్చుకోవాలి. ఏబీకే ప్రసాద్ ఏ పత్రికకు మారితే ఆ పత్రికలో అంత వరకు ఏ పత్రికల్లో లేని శీర్శికలు ప్రవేశ పెట్టి కొత్త పాఠకులను తయారు చేసేవారు. వారిని మార్గ దర్శకంగా తీసుకొని కొత్త కొత్త ఆలోచనలు చేయడం అవసరం.

# నేడు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ

- మొదటి విడత ఎన్నికల గ్రామాల్లో కోడ్ అమలు
- నేటి నుంచి 11 జెడ్పిటిసిలు, 115 ఎంపీటీసీలకు నామినేషన్లు
- జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ జారీకి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మొదటి విడత జెడ్ పిటి సి, ఎంపిటిసి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాకు సంబంధించి మొదటి విడతన ఈ నెల 9 న 11, జడ్పిటిసిలు,115 ఎంపీటీసీలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించి ఆర్వో, ఏఆర్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని , పునఃచరణ శిక్షణ కూడా ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలను నియమించడం జరిగిందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు పంపించడం జరుగుతుందని, అలాగే నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పూర్తి సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం ఎంపిడిఓలతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నామినేషన్ల ప్రక్రియ పై పలు సూచనలు చేశారు. నామినేషన్ ల స్వీకరణ లో ఏ ఒక్క అప్లికేషన్ కూడ రిజెక్టు కాకుండా చూసుకోవాలని, నియమ నిబంధనలు పాటించాలని, ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా నామినేషన్ల స్వీకరణపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, రెవిన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ జెడ్పి సీఈవో సుధీర్, డిపిఓ జయసుధ, ఆర్ డి ఓ వాసు చంద్ర, డి ఎస్ పి లు ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

- టిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- యాచారంలో కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ



**యాచారం, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** ఎన్నికల హామీలను నెరవేర్చడంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైదని మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం యాచారం మండలం కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిష్టన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ భాకి కార్డు ఇంటింట ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు మంచి రెడ్డి ప్రశాంత రెడ్డి,మాజీ జడ్పటిసి చిన్నోళ్ళ జంగమ్మయాదయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశ్చ భాష, మాజీ సర్పంచ్ రాజునాయక్ హాజరై ఇంటింటా తిరిగి ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకుని కాంగ్రెస్ భాకీ కార్డును ప్రచారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరగక ప్రజలంతా అస్తవ్యస్తంగా ఉన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్ళను కూల్చి రియల్ వ్యాపారాన్ని దారుణ పరిస్థితులు ఏర్పడే విధంగా చేశారని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. ప్రభుత్వం తీరు మారకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని, స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతుందని సరైన సమయానికి అందడం లేదని ఆరోపించారు.దేశ చరిత్రలోనే రైతు బీమా గొప్ప పథకమని అది కూడా నీరుగారిచే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ ఛైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు చిగురింత శ్రీనివాస్ రెడ్డి,ఎండి అఖీబుద్దీన్,కారింగ్ యాదయ్య,మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి, కాజు మహ్మద్, డా చిక్కుడు గుండాలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- నామినేషన్లకు 9వ తేదీన ఉదయం 10 గంటలకల్లా నోటిఫికేషన్ పబ్లిష్
- రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి బ్యూరో, అక్టోబర్ 8 (జనంసాక్షి) : ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి దశ ఎన్నికల నామినేషన్లకు 9వ తేదీన ఉదయం 10 గంటలకల్లా నోటిఫికేషన్ పబ్లిష్ చేయాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం సాయంత్రం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఎంపీటీసీ జడ్పిటిసి మొదటి దశ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పై సంబంధిత రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ మొదటి దశ ఎన్నికల నామినేషన్లకు గురువారం ఉదయం 10 గంటలకల్లా నోటిఫికేషన్ పబ్లిష్ చేయాలని ఆర్వోలకు ఆదేశించారు. అభ్యర్థులు నామినేషన్లను వేసినప్పుడు వారి నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు మరో ఇద్దరి కంటే ఎక్కువ రిటర్నింగ్ అధికారి గదిలోకి రావడానికి అనుమతించవద్దని సూచించారు.నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు నిర్దేశించిన పత్రాలు తీసుకురాకపోతే వారి నామినేషన్ తిరస్కరించకుండా వారికి గడువుతో కూడిన నోటీసు ఇవ్వాలని సూచించారు. ప్రతి రిటర్నింగ్ అధికారి వద్ద తమ ప్రాదేశిక నియోజకవర్గం యొక్క ఎలక్ట్రోరల్ రోల్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను జాగ్రత్తగా పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. రిటర్నింగ్ అధికారులు నామినేషన్ కేంద్రాల్లో ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు ప్రకారమే నామినేషన్ల ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు పనిచేయాలి



**దోమ, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి దోమలో ఏర్పాటు చేసిన తెరాస పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలను గురించి ప్రజలకు పూర్తిగా వివరించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. అంతేకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని చెబుతూ,కాంగ్రెస్ బాకీ పత్రిక ను మహేష్ రెడ్డి విడుదల చేశారు. రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో మన ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పరిగి నియోజకవర్గంలో అత్యధిక స్థానాలను గెలవాలని, తెరాస పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. పట్టణాల్లో, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దొంగ హామీలను ప్రజలకు వివరించి, అధికార పార్టీ నాయకులు ఓట్ల కోసం వచ్చిన సమయంలో వారిని నిలదీసి అడగాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తెలిపారు.

## ఆన్‌లైన్ గేమింగ్ మోసాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠా అరెస్ట్




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** సైబర్ టెక్నాలజీ అవగాహన లేని కొంతమంది అమాయకులను ఆన్లైన్ గేమింగ్ ద్వారా మోసం చేస్తూ భారీగా సొమ్ము లూటీకి పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సైబర్ క్రైమ్స్ విభాగం డిసిపి సాయి శ్రీ వెల్లడించిన వివరాల ప్రకారం... డొప్పలపూడి నవీన్ కుమార్, వంకాదిరి సందీప్ కుమార్, చింతలపాటి పృథ్వి రామరాజు, చింతలపాటి పవన్ వెంకట నాగ భరద్వాజ్ మరియు మామిడి శెట్టి రామాంజనేయులు అనే ఐదుగురు నిందితులు వారికున్న సైబర్ టెక్నాలజీని ఉపయోగించి ఓ ముఠాగా ఏర్పడి టెలిగ్రామ్, వాట్సాప్ మాధ్యమాల ద్వారా గ్రూపులను క్రియేట్ చేసి ఆన్లైన్ గేమింగ్ విధానానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఈ ఐదుగురు సభ్యుల ముఠా ఏకంగా 120 బ్యాంకు ఖాతాలను సృష్టించి ఆన్లైన్ గేమింగ్ పట్ల ఆసక్తి కలిగిన వారికి తక్కువ టైంలో ఎక్కువ మొత్తం డబ్బు వస్తుందని ఆశ చూపి సదరు అకౌంట్ నెంబర్లను అమాయకులైన బాధితులకు పంపి ఆ ఖాతాలద్వారా అందిన కాడికి సొమ్మును దండుకొని వెంటనే అకౌంట్లను మూసివేస్తూ ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. అయితే పలు ఫిర్యాదులను అందుకున్న సైబరాబాద్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం పోలీసు అధికారులు పలు సెక్షన్ల కింద కేసులను నమోదు చేసి వారికి లభించిన విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుండి రెండు లాప్టాప్స్, 30 మొబైల్ ఫోన్లు, 32 చెక్ బుక్స్, 23 ఏటీఎం కార్డ్స్, 48 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు ఆయా ఖాతాల నుండి 14 లక్షల రూపాయలను పోలీసు అధికారులు సీజ్ చేశారు. ఈ కేసును చాకచక్యంగా చేదించేందుకు పర్యవేక్షణ చేసిన ఏసీపీ రవీంద్రా రెడ్డి, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జి విజయ్ కుమార్ తదితరులను డిసిపి సాయి శ్రీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఉపాధ్యాయులు విద్యార్థులకు థర్డ్ పేరంట్‌గా వ్యవహరించాలి

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్




**వనపర్తి క్రైమ్, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** ఉపాధ్యాయులు విద్యార్థులకు థర్డ్ పేరంట్ గా వ్యవహరించాలని, విద్యార్థినీ, విద్యార్థులకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని,విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదవి, ఉన్నతస్థాయికి ఎదగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మాతృభూమికి మంచి పేరు తేవాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు.బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామాపురం,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, విద్యార్థినీ విద్యార్థులకు,సైబర్ నేరాలు,బాల్యవివాహలు పోక్సో నేరాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సమాజంలో చిన్నారులపై నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని అన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకి థర్డ్ పేరంట్ గా వ్యవహరించాలని, వారిపై ఎల్లప్పుడూ ఒక దృష్టి పెట్టి తప్పుడు మార్గంలో వెళ్లకుండా చర్య తీసుకోవాలన్నారు. సమాజంలో అందరూ కలిసికట్టుగా ఒక అంశాన్ని లేవనెత్తినప్పుడే నేరాలు జరగకుండా నివారించవచ్చని చెప్పారుఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించి పోక్సో చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలని, చక్కటి వనపర్తి నిర్మాణానికి కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ, రాంబాబు, కొత్తకోట ఎస్సై, ఆనంద్, పెబ్బేరు ఎస్సై, యుగంధర్ రెడ్డి, శ్రీరంగాపూర్ ఎస్సై, హిమబిందు, కొత్తకోట వైద్యాధికారి, ఆసియాబేగం అప్పరాల వైద్యాధికారి, శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,రవి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను,పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా నారాయణపేట బస్టాండ్, ప్రధాన చౌరస్తాలలో నారాయణపేట పోలీసులు గోపాల్, రవి కుమార్ లు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు.పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులను గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## మహేశ్వరం మెడికల్ కాలేజ్‌ను మాయం చేశారు

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం మహేశ్వరం మెడికల్ కాలేజ్ ని మాయం చేసిందాన్ని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు.బుధవారం కందుకూరు మండలం మీర్ఖాన్ పేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను గ్రామస్థులకు అందజేశారు.ఈ సందర్భంగా మాజీమంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలల గడుస్తున్న ప్రజలకు ఏమి చేసిందో తెలపాలన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫ్యూచర్ సిటీ పక్కనే మెడికల్ కాలేజ్ నిర్మాణంను చేపట్టామన్నారు.మెడికల్ కాలేజ్ ను కాంగ్రెస్ పార్టీ ఎందుకు నిలిపివేశారన్నారు.మాజీ సీఎం కెసిఆర్ హయంలో ఫార్మాసిటీ రోడ్డు 75 శాతం పనులు జరిగాయన్నారు.మిగిలిన 25 శాతం రోడ్డు నిర్మాణ పనులను జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్,నాయకులు సురసాని సురేందర్ రెడ్డి, లక్ష్మీనర్సింహా రెడ్డి, చంద్రశేఖర్,కాకి రాములు, జ్యోతి చంద్రశేఖర్,దామోదర్ గౌడ్,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి మించి ఖర్చు చేయరాదు

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్ని కల కమిషనర్ నిర్దేశించిన ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి కంటే ఎక్కువ ఖర్చు చేయరాదని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. రెండో సాదారణ ఎన్నికల్లో పోటీ చేసే జెడ్పీటీసీ,ఎంపీటీసీ, సర్పంచి అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు బుధవారం కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ నిర్దేశించిన వ్యయం ప్రకారమే ఆయా అభ్యర్థులు ఎన్నికల ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే జెడ్పీటీసీ అభ్యర్థి ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి 4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి లక్షా 50 వేలు, సర్పంచి అభ్యర్థుల ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి 2లక్షల 50 వేలు (5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలో) అంతలోపు జనాభా ఉన్న పంచాయతీలలో లక్షా 50 వేలు మాత్రమే అని, దీనిని అనుసరించి ఆయా గ్రామ పంచాయతీలలో వార్డు అభ్యర్థుల ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి 30 నుంచి 50 వేలు ఉంటుందని ఆమె వెల్లడించారు. కాగా నామినేషన్ వేసిన రోజు నుంచి ఓట్ల లెక్కింపు చివరి రోజు వరకు ఆయా అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిగణలోకి వస్తుందన్నారు. ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేసిన అభ్యర్థి ఒకవేళ గెలిచినా డిస్ క్వాలిఫై అవుతారని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్నింటిపై అభ్యంతరాలు వ్యక్తం చేయగా, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కూడిన అధికారుల బృందం తగు నిర్ణయం తీసుకుంటుంది అని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోర్టు తీర్పు ఏదైనా ఎన్నికలకు సిద్ధం

- అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి
- బాకీ కార్డులతో కాంగ్రెస్ బండారం బయట పెట్టాలి
- గతములో జనరల్ స్థానాలలో బి. సిలకు చోటు కల్పించాం
- కార్యకర్తల ఏకాభిప్రాయంతోనే అభ్యర్థుల ఎంపిక
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** స్థానిక సంస్థలపై కోర్టు తీర్పు ఎలా వచ్చినా ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం నాడు గోపాల్ పేట స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎన్నికల దిశనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అలవికాని, ఆచరణ సాధ్యం కాని,అమలుకాని హామీలు ఇచ్చి ప్రజల విశ్వాసం కోల్పోయిందని అన్నారు.బాకీ కార్డులు ఇంటింటికి తిరిగి ఇచ్చి వాళ్లు ఇచ్చిన హామీల మేరకు ప్రజలకు బకాయిపడ్డ రూపాయలు ఎన్నో తెలియజేయాలని, ఇదే మన ఎన్నికల అస్త్రం అని ఉద్బోధించారు. ప్రతి గ్రామ కమిటీ సమావేశం అయి ఓటర్ లిస్టును నిశితంగా పరిశీలించి, కాంగ్రెస్ ఓటు చోరీనీ బహిర్గతం చేయాలని అన్నారు.వాళ్ళు ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు ఒక్కరికి ఎకరానికి 76000,ప్రతి మహిళకు 50000,వృద్ధులకు,వికలాంగులకు ఫించన్ల బకాయి 44000,కళ్యాణ లక్ష్మీతో తులం బంగారం,నిరుద్యోగుల 2లక్షల ఉద్యోగాలు,విద్యార్థులకు విద్యా బరోసా,విద్యార్థినులకు స్కూటీలు,రైతు కూలీలకు,ఉపాధి కూలీలకు రైతు భరోసా,రుణ మాఫీ,బకాయి పెద్దవైనాన్ని క్షుణంగా వివరించి ఎన్నికలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని సూచించారు.

# ఆరు గ్యారెంటీలు అమలు చేశాకే ఓట్లు అడగాలి

● మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, గురుజాల్ శివరాజ్ పాటిల్



**కృష్ణ, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** అధికారం కోసం ఆరు గ్యారెంటీలు 420 హామీలు పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు 22 నెలలు బాకీ పడిందని, గ్యారెంటీ పథకాల బాకీ తీర్చాలని ఆరు గ్యారెంటీలు అమలు చేశాకే స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఓట్లు అడగాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు . బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు బుధవారం కృష్ణ మండలం కేంద్రంలో క్షిరలింగేశ్వర మఠంలో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేసి, గడపగడపకు అందిస్తూ అవగాహన కల్పించారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామంటూ 22 నెలలైనా ఒక్క హామీ నెరవేర్చకుండా మోసం చేశారన్నారు వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు మహిళలకు 2,500/- రూపాయలతో పాటు, తులం బంగారం, ఇలా అనేక బాకీ పడ్డారని గుర్తు చేశారు. ఆనాడు ఎన్నికల సమయంలో ఇంటింటికి గ్యారెంటీ కార్డులు ఇస్తూ ఇవి ఉంటేనే ఇంటింటికి గ్యారెంటీ కార్డుల పథకాలు వర్తిస్తామని నాయకులు ప్రచారం చేశారని, మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని అన్నారు. గ్యారెంటీ కార్డులతో ఉన్న పథకాలను అమలు చేయడంతో పాటు 22 నెలల బాకీ తీర్చిన, తర్వాతనే ఓట్లు కోసం రావాలని, నిలదీయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ మాయ మాటలు వింటే మరోసారి మోసం పోయి గోస పడతామని ఆయన సందర్భంగా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షుడు గురజాల శివరాజ్ పటేల్, చేగుంట శివప్ప, మాజీ సర్పంచ్. చెవిటోళ్ల అమ్రేష్, బొల్ల తిక్కన్న, (వెంకటేష్), అశిరెడ్డి ,మ్యాకల్ భీమ్ బోయ్ శంకర్, మౌనేష, అబ్దుల్ కాదర్,డి దేవేంద్రప్ప, ఎల్లారెడ్డి కదుమూరు, వాకిటి సంతోష్ కృష్ణ ఎక్స్ ఉప సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పీఓలకు శిక్షణ




**మల్దకల్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** రెండవ సాధారణ ఎన్నికలలో భాగంగా బుధవారం గ్రామపంచాయతీ, మండల ప్రాదేశిక,జిల్లా ప్రాదేశిక ఎన్నికలు 2025 సందర్భంగా మండల కేంద్రంలో రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. టిఓటిగా వెంకటేష్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి, ఎంఈఓసురేష్, మండల పంచాయతీ అధికారి రాజశేఖర్,సీనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాష్ రెడ్డి,ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు120 ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు బుధవారం నాడు మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే . జి. మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించి కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.మోడీ పాలనలో ప్రజా స్వామ్యం ప్రమాదంలో ఉందని, బిజెపి ప్రభుత్వం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తుందని అన్నారు. ఇప్పటికే లోక్సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఓట్ చోరీకి సంబంధించి ఆధారాలు బయటపెట్టిన, ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోకుండా బిజెపి కనుసన్నల్లో ఎన్నికల సంఘం పనిచేస్తుందన్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా, భారత రాజ్యాంగం కల్పించిన హక్కు (ఓటు హక్కు ను) కాపాడుకునే ప్రయత్నం కు అందరూ సంతకం చేసి ఓట్ చోరీ వ్యతిరేక కార్యక్రమంలో భాగ్యస్వాములు కావాలని అన్నారు, అదేవిధంగా ప్రతి గ్రామం నుండి ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతి గ్రామంలో 100 మందితో సంతకాల సేకరణ చేపట్టాలని పిలుపునిచ్చి, సంతకాల సేకరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. టీపీసీసీ కార్యదర్శులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికలలో రిటర్నింగ్ అధికారులదే ప్రధాన పాత్ర

● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు ముఖ్య భూమిక పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్/ ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో రిటర్నింగ్ అధికారుల సమావేశం నిర్వహించి వారి బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో 13 జడ్పిటిసి,136 ఎంపీటీసీ స్థానాలకు గాను రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే జిల్లాలోని 272 గ్రామ పంచాయతీ లకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అయితే నామినేషన్ల ప్రక్రియను వీడియోగ్రఫీ తీయించాలని, నామినేషన్‌లో అభ్యర్థి సంతకాలు లేకపోతే, సరైన ధ్రువపత్రాలు జత చేయకపోతే రిటర్నింగ్ అధికారులు గుర్తించి సరి చేయాలని, వీలైనంతవరకు నామినేషన్ తిరస్కరణకు గురి కాకుండా చూడాలని ఆర్ వో లకు కలెక్టర్ సూచించారు.నామినేషన్ వేసేందుకు 100 మీటర్ల దూరంలో కేవలం ఒకే వాహనం వచ్చేందుకు అనుమతి ఉంటుందని, నామినేషన్ వేసే గదిలో ముగ్గురు కంటే ఎక్కువ మంది వెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ల పరిశీలన, అప్పీలు,ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, అభ్యర్థుల బీ ఫామ్ తదితర విషయాల గురించి స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వా ర్ క్లుప్తంగా వివరించారు. ఎన్నికల నియమావళి లోని ప్రతి పేజీని ప్రతి అక్షరాన్ని చదువుకొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆర్ వో లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అన్ని మండలాల ఆర్వోలు పాల్గొన్నారు.

## బాల కార్మికులను పాఠశాలలో చేర్పించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్ లో భాగంగా ధరూర్ మండలం పరిధిలో పొలాలలో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులను గుర్తించి, సంబంధిత పాఠశాలలో చేర్పించారు.అలాగే పాతపాలెం లోని పొలం లో పనిచేస్తున్న ఒక బాల కార్మికుడిని డ్రాపౌట్ గుర్తించి,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సభ్యులు మరియు చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో అందించబడుతున్న మధ్యాన్న భోజనంలో ఆహార నాణ్యత, విద్యార్థులకు మెనూ ప్రకారం ఫాలో కావాలని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని తెల్సుకున్నారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ మాట్లాడుతూ, బాలల శ్రమ నేరంగా మాత్రమే కాకుండా, వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన అంశం. ప్రతి ఒక్కరూ దీనిపై చైతన్యం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి.రాజేందర్, బి.శ్రీనివాసులు,డి. లక్ష్మణ స్వామి,చైల్డ్ వెల్ఫేర్ అధికారులు జయన్న, సురేష్ పాల్గొన్నారు.

## పోలీస్ వ్యవస్థను ప్రజానుకూలంగా తీర్చిదిద్దాలి



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** జోగులాంబ డీఐజీ ఎల్. ఎస్. చౌహాన్, బుధవారం నాడు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా డీఐజీ జిల్లా పోలీసు కార్యాలయం పరిధిలోని విభాగాలు, స్పెషల్ బ్రాంచ్, హెడ్క్వార్టర్స్ తదితర విభాగాలను సందర్శించి, పనితీరు, రికార్డు నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ, పారదర్శకత, మరియు కార్యనిర్వహణ విధానాలను సమీక్షించారు. డీఐజీ పోలీసు రికార్డులు, రిజిస్టర్లు, ఆఫీస్ ఫైల్స్, బలగాల హాజరు రికార్డులు, ఆయుధ నిల్వలు, వాహనాల సంరక్షణ విధానాన్ని పరిశీలించి సిబ్బంది నిబద్ధతపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీ అనంతరం డీఐజీ మాట్లాడుతూ "జిల్లా పోలీసు వ్యవస్థను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజలతో అనుసంధానం మెరుగుపరచి, సకాలంలో స్పందించడం ద్వారా పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి. రికార్డులు సక్రమంగా, నవీకరించబడిన విధంగా ఉంచడం అత్యవసరం. అధికారి–సిబ్బంది మధ్య సమన్వయం ఉంటే సేవా నాణ్యత మరింత మెరుగుపడుతుంది," అని సూచించారు. డీఐజీ జిల్లాలో నేరాల నివారణ, చట్టవ్యవస్థ కాపాడటంలో జిల్లా పోలీసు బలగాలు చూపుతున్న కృషిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత క్రమశిక్షణతో ప్రజాసేవలో అగ్రగాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి. జానకి, అదనపు ఎస్పీ ఎన్. బి. రత్నం, అదనపు ఎస్పీ సురేష్ కుమార్,వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లించకుంటే ఎన్నికల విధుల బహిష్కరణ



**మల్దకల్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** గత సంవత్సరం నవంబర్ నెలలో చేసిన కులగణన సర్వే రెమ్యూనరేషన్ బకాయిలను స్థానిక ఎన్నికల లోపు చెల్లించాలని కోరుతూ మల్దకల్ మండలఎంపీడీవో ఆంజనేయులురెడ్డికి బుధవారంవినతి పత్రం అందజేశారు.ఎన్నికల లోపు కులగణనసర్వే బకాయిలు చెల్లించని యెడల సామూహికంగా ఎన్నికల విధులు బహిష్కరిస్తామని జిల్లా సిపిఎస్ యూనియన్ అధ్యక్షుడు నాగరాజు, శ్రీరాములు,యుటిఎఫ్ ఆంజనేయులుతో పాటు మరి కొంతమంది ఉద్యోగస్తులు వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో సర్వే చేసిన మండల ఉపాధ్యాయులు,పంచాయితీ సెక్రటరీలు రాఘవేంద్ర,శ్రీలత, దామరాఘవేంద్ర, రేణుక, కాజమీర్,బసిరెడ్డి, పాల్గొన్నారు.

## ఏటీసీలో శిక్షణతో విద్యార్థుల భవిష్యతుకు బాట



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** ఏటిసిలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని, విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ క్లాసులు ఆధునిక యంత్రాలతో సమగ్రంగా నిర్వహించాలని, విద్యార్థులకు తాజా సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ప్రభుత్వ ఐ.టి.ఐ. (బాలుర) మరియు (బాలికల) ఆవరణలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తో కలిసి బుధవారం సందర్శించారు. ఏ.టి.సిలో ఆధునిక సాంకేతిక శిక్షణ కోర్సుల గురించి కలెక్టర్ కు ప్రిన్సిపాల్ వివరించారు. ప్రిన్సిపల్స్, బోధనా సిబ్బందికి కలెక్టర్ సూచనలు చేశారు. ఏ.టి.సిలో అందిస్తున్న కోర్సులు దేశీయంగా మాత్రమే కాకుండా విదేశాలలో కూడా అత్యుత్తమ ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులని, అందువల్ల విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. తొలుత జిల్లా కేంద్రం లో ని బస్టాండ్ సమీపంలోని బాదం రామస్వామి సరోజా దేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియం, మున్సిపాలిటీలో కళా భారతి, భవనాలను కలెక్టర్ పరిశీలించారు. బాదం రామస్వామి సరోజా దేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియంను పరిశీలించి కావలసిన రిపేర్ ల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. కళా భారతి నిర్మాణం ను పరిశీలించి నిర్మాణ ప్రగతి గురించి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమాల్లో బాలుర ఐ.టి.ఐ ప్రిన్సిపల్ బి. శాంతయ్య, బాలికల ఐ.టి.ఐ ప్రిన్సిపల్ ఎస్. గోపాల్ నాయక్, ఐ.టి.ఐ / ఏ.టి.సి బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


## ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన అవసరం




**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్ వన్ రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల ప్రక్రియపై మాస్టర్ ట్రైనర్ కృష్ణ ద్వారా కలెక్టరేట్ ఆడిటోరియం లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల స్టేజ్ వన్ రిటర్నింగ్ అధికారులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియలో సమయపాలన కీలకమైన అంశం అన్నారు. రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల (నియమావళి) పాటించడం , ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు,పోలింగ్ కేంద్రాల లో ఓటింగ్ ప్రక్రియ కు తగిన ఏర్పాట్లు పరిశీలన,పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, సర్పంచ్,వార్డు మెంబర్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ రోజున జరిగే కౌంటింగ్ ప్రక్రియకు సరైన ఏర్పాటు చేయడం తదితర ఏర్పాట్లను ఎన్నికల విధిగా పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు సిబ్బంది తమ విధుల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి ఎన్నికలు నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా నామినేషన్ల దాఖలు పరిశీలన ఉపసంహరణ బ్యాలెట్ పేపర్ తయారీ తదితర అంశాలతో రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, శిక్షణ నోడల్ అధికారి రామాచారి, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాల కోసం నిరంతరం కృషి చేయాలి

● జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ఐటిఐ సమీపంలో ఉన్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ )ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏటీసీ సెంటర్లో కొనసాగుతున్న బోధన విధానం, విద్యార్థులకు అందిస్తున్న సాంకేతిక శిక్షణను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. నేటి కాలంలో సాంకేతిక నైపుణ్యం కలిగినవారికే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఏటీసీలో అమలవుతున్న కోర్సులు, అధునాతన మిషనరీలు, అభివృద్ధి పనులపై వివరాలను సంబంధిత అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ ద్వారా అందిస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ తో పాటు ఏటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పంట నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి

● జిల్లా కలెక్టర్‌కు చిలప్‌చేడ్ మండల రైతుల వినతి



**చిలప్‌చేడ్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** చిలప్‌చేడ్ మండలంలోని అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్ గ్రామాలలో మంజీరా నది నీటి ప్రవాహమునకు పంట పొలాలు పెద్ద మొత్తంలో మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తమకు పంట నష్టం సర్వే నిర్వహించి పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మెదక్ జిల్లా కలెక్టర్ కు బాధిత రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంజీర నదీ ప్రవాహానికి తమ గ్రామాలలో తీవ్రంగా పంటలు నీటమునిగిపోయాయి అని, అజ్జమర్రి గ్రామంలో 232ఎకరాలు, బండాపోతుగల్ గ్రామంలో 180ఎకరాలు, ఫైజాబాద్ గ్రామంలో 90ఎకరాలకు పైగా పంటపొలాలు ముంపునకు గురయ్యాయి అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సర్వే నిర్వహించి బాధిత రైతులకు నష్టపరిహారం కింద ఒక ఎకరాకు 3500 చొప్పున చెల్లించి ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా కోరుకున్నామని తెలిపారు.

### జిల్లా విద్యుత్తు అధికారికి బాధిత రైతుల విన్నపం

చిలప్‌చేడ్ మండలంలోని అజ్జమర్రి, బండపోతుగల్, ఫైజాబాద్ రైతులు గత రెండు నెలలుగా సింగూర్ ప్రాజెక్టు నుండి నీరు మంజీరా నది గుండా ప్రవహించినందున మంజీరా ఒడ్డున ఉన్న విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్తు తీగలు పెద్ద ఎత్తున పాడై పోయాయి అని, కరెంట్ సరఫరాలో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని బాధిత రైతులు జిల్లా విద్యుత్ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు.వెంటనే మరమ్మతులు చేసి రైతుల బాధలు తీర్చాలని కోరారు.

# గంజాయి పట్టివేత

## పట్టుకున్న కేయూసీ పోలీసులు



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 08 (జనం సాక్షి) :** వరంగల్లోని కాకతీయ యూనివర్సిటీ పోలీసులు రూపాయలు 20 లక్షల 50 వేలు విలువ గల గంజాయి పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ ఏసిపి నర్సింహారావు కేసు వివరాలు తెలుపుతూ రూ.20 లక్షల 50 వేల విలువ చేసే గంజాయిని ట్రాన్స్ పోర్ట్ చేస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను పక్క సమాచారంతో కాకతీయ యూనివర్సిటీ పోలీసులు పట్టుకున్నారని, వారిని విచారించగా ఏ1 పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దిన్హత జిల్లా కోచ్‌బెహార్‌కు చెందినరాను హొస్సైన్ నాలుగు నెలల క్రితం తన సొంత గ్రామం నుండి గంజాయి సప్లయ్ చేసే పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోచ్ బేహార్ జిల్లా సదిఅలేర్ కుతి కృష్ణ చంద్ర బర్మన్ దగ్గర నుండి తన వద్ద ఉన్న డబ్బులతో గంజాయిని కొనుగోలు చేశాడు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కూలీల అడ్డ వద్ద అమ్మేసరికి తనకు అధిక లాభం రావడంతో అట్టి డబ్బులను జల్సాలకు ఖర్చు చేసుకున్నాడని, ఈ విషయాన్ని తన చిన్ననాటి స్నేహితుడు అయిన ఏ2 నూర్ మహమ్మద్ మియాకి తెలియజేసి మనమిద్దరం గంజాయి ట్రాన్స్ పోర్ట్ చేసి అమ్ముతే అధిక డబ్బులు సంపాదించవచ్చునని అనుకోని వీరిద్దరూ కలసి గత నెలలో చెరో ఒక లక్ష రూపాయలను రెడి చేసుకొని గంజాయి అమ్మే కృష్ణ చంద్ర బర్మన్ వద్ద రూ. 2 లక్షలతో మొత్తం 41 కిలోల గంజాయి ని కొనుగోలు చేసి లగేజ్ బ్యాగులలో ఎవ్వరికి అనుమానం రాకుండా ప్యాక్ చేసుకొని తేది: 04-10-2025 కోచ్ బేహార్ రైల్వే స్టేషన్ లో సికింద్రాబాద్ కు వెళ్ళే రైలు ఎక్కి వస్తుండగా వీరిద్దరూ పోలీస్ వారిని చూసి భయపడి తేది: 06-10-2025 వ రోజు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ లో దిగి అక్కడ నుండి బస్సులో హనుమకొండ బస్ స్టేషన్ కు వచ్చి నిన్నటి రోజు హైవే లొకేషన్ చూసుకొని ముచ్చెర్ల క్రాస్ వద్ద దిగి సికింద్రాబాద్ కు వెళ్ళుటకు లారీలు అపే క్రమంలో వారిని పట్టుకొని అదుపులోకి తీసుకొని గంజాయి సిజ్ చేసినాము అని, వారి దగ్గర మూడు సెల్ ఫోన్స్ సీజ్ చేసి రిమాండ్ తరలించినాము అని తెలిపి ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెడుతామని తెలిపినాడు. ఈ సందర్భంగా హనుమకొండ ఏసిపి కేయూ ఇన్స్పెక్టర్. రవికుమార్ ను, ఎస్సై.కళ్యాణ్ కుమార్ ను, పెట్రోలింగ్ పోలీసులను అభినందించినారు.

# ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో తాత్కాలిక మార్పులు

- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనం ఒక సెక్షన్ పై బాగం భవనం పూర్తిగా కుప్ప కూలి పోయింది. దీంతో విధులకు ఆటంకం ఏర్పడడంతో ఈ ఘటనలో ఉద్యోగులు , ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశముండటంతో తాత్కాలికంగా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఉన్న కొన్ని ముఖ్యమైన శాఖల కార్యాలయాలను ఇతర భవనాలకు తరలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక తెలిపారు. అందులో తరలించిన కార్యాలయాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం పాత కలెక్టరేట్ కాంప్లెక్స్, ఆదిలాబాద్ అదేవిధంగా అదనపు కలెక్టర్ (రెవిన్యూ), అదనపు కలెక్టర్ (ఎల్బీ) పెన్ గంగ భవన్, ఇరిగేషన్ శాఖ భవనం, జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా, కలెక్టరేట్ విభాగాల కార్యాలయాలు ఏవో నుండి హెచ్ వరకు పెన్ గంగ భవన్, జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా జిల్లా ట్రెజరీ కార్యాలయం పాత కలెక్టరేట్, ఆదిలాబాద్ జిల్లా ప్రజాసంబంధాల కార్యాలయం డీపీఆర్వో పాత కలెక్టరేట్, ఆదిలాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం పాత కలెక్టరేట్, ఆదిలాబాద్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం కలెక్టరేట్ లోని జిల్లా సబ్ జైలు ప్రాంగణం, పాత కలెక్టరేట్ తహశీల్దార్ అర్బన్ కార్యాలయం జిల్లా పరిషత్ కార్యాలయం, ఆదిలాబాద్ జిల్లా పౌర సరఫరాల కార్యాలయం రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం పాత కలెక్టరేట్ కాంప్లెక్స్ ఎస్బిఐ బ్రాంచ్, పాత కలెక్టరేట్ కు తరలించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరూ ఈ కార్యాలయ మార్పులను గమనించి, సంబంధిత శాఖల సేవల కోసం తాజా చిరునామాల వద్ద సంప్రదించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బాణాసంచా విక్రయ కేంద్రాల అనుమతికి దరఖాస్తు చేసుకోండి

- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 08 (జనం సాక్షి) :** తాత్కాలిక బాణాసంచా విక్రయాలతో పాటు బాణాసంచా నిల్వ చేసుకొనిందుకు అనుమతి కోసం ఆసక్తి కల్గిన వ్యక్తులు,సంస్థలు దరఖాస్తు చేసుకోవాలసిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తు ఫారంతో తప్పనిసరిగా అగ్నిమాపక విభాగం అధికారులు జారీచేసిన ఎన్. ఓ. సి తో పాటు, ప్రవైయిటు స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు అయితే స్థల యజమాని అనుమతి పత్రం, అలాగే ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబందిత ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం,పక్క నిర్మాణాల్లో ఏర్పాటు చేసుతున్నట్లు అయితే పక్కవారి అనుమతితో పాటు పక్క భవన బ్లూ ప్రింట్ తో పాటు స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా, ఆదాలట్ శాఖలో ఎనిమిది వందల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు జామచేసినట్లుగా బ్యాంక్ చాలన్ తో దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబర్ 16వ తేదీలోపు సంబంధిత జోన్లకు చెందిన డీసీపీ స్థాయి అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు బాణాసంచా అనుమతులు జారీ చేస్తారు.

# కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలి

- **అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పత్తి పంటను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా మార్కెటింగ్, పోలీస్, వ్యవసాయ, విద్యుత్, రవాణా, తూనికలు కొలతల అధికారులతో పత్తి కొనుగోలు ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో సుమారు 98,260 ఎకరాలలో పత్తి సాగు జరిగిందని, 11,79,000 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అక్టోబర్ మాసం తర్వాత పత్తి దిగుబడి ప్రారంభమవుతుందని, నవంబర్, డిసెంబర్ నెలల్లో అధికంగా పంట రాక ఉంటుందని వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే తక్కువగా మార్కెట్‌లో రేటు పలికితే వెంటనే సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు భూపాలపల్లి, కాటారం, చిట్యాల మార్కెట్ పరిధిలో మొత్తం 5 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పత్తి తేమ శాతం 8% ఉన్నప్పుడు కనీస మద్దతు ధర రూ.8,110లుగా ఉన్నదని చెప్పారు. రైతులు తమ పత్తిని మధ్యవర్తులు, దళారులకు అమ్మకుండా, కనీస మద్దతు ధర కంటే తక్కువ ధర పలికినప్పుడు సీసీఐ కేంద్రాలలో విక్రయించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో నీరు, విద్యుత్, టాయిలెట్ సదుపాయాలు, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు మొదలైన మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవాలని, దానిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రైతులు 'కప్పాస్ కిసాన్ యాప్' ద్వారా రిజిస్టర్ అయి, స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తిని అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, అడిషనల్ ఎస్పి నరేష్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్, జిల్లా అగ్నిపక అధికారి వి.సతీష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా తూనికలు కొలతల అధికారి శ్రీలత, రవాణా శాఖ అధికారి సంధాని, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లు యజమానులు, మార్కెట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన ఆటో డ్రైవర్ బిడ్డ



**పాలకుర్తి, అక్టోబర్ 08(జనంసాక్షి) :** మండలంలోని పెద్దతండా (కే) గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని లావుద్యా తులసి ఈ ఏడాదిలో నిర్వహించిన నీట్ లో ప్రతిభను కనబరిచి మెడిసిన్లో సీట్ సాధించింది. తండ్రి భాస్కర్ ఆటో డ్రైవర్ గా తల్లి జ్యోతి ఆశావర్కర్ గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తులసి 5 నుంచి ఇంటర్ వరకు పాలకుర్తిలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదివింది. తులసి నీట్ పరీక్షలో 2.47.621 ర్యాంకుతో కరీంనగర్లోని ప్రతిమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాదించిన తులసిని వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ లావుద్యా మంజుల, భాస్కర్, గ్రామస్తులు అభినందించారు.

# లారీ టైర్లు, బ్యాటరీలు, డీజిల్ దొంగతనం



**మల్హర్, అక్టోబర్ 08(జనం సాక్షి) :** మండలంలోని కొయ్యూర్ గ్రామంలోని మూసి ఉన్న పెట్రోల్ బంకులో నిలిపి ఉన్న లారీ టిఎస్ 25 – టి 3004 అనే లారీ కి బిగించి ఉన్న నాలుగు టైర్లతో పాటు స్టెపిన్ టైర్ ను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెల్లిన సంఘటన చోటు చేసుకుంది. బుధవారం బాధితుడు తెలిపిన కథనం ప్రకారం కొయ్యురు ఇండియన్ పెట్రోల్ బంకు లో లారీ నిలిచి ఉన్న లారీకి ఉన్న నాలుగు టైర్లతో పాటు,ఒక లిఫ్ట్ టైర్ ను, రెండు బ్యాటరీస్ తోపాటు 120 లీటర్ల డీజిల్ ను కూడా దొంగలు దోచుకెల్లినట్లు తెలిపారు. ఇదే కొయ్యూరు లో వారం రోజుల క్రితం రెండు లారీలలో సుమారు 500 లీటర్ల డీజిల్ దొంగతనం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనల పై కొయ్యురు పోలీస్ స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# నామినేషన్ల ప్రక్రియ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ఈ నెల 9వ తేదీ నుండి సాధారణ పంచాయతీ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల జిల్లాలోని కన్నేపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుండి చేపటనున్న నామినేషన్ల స్వీకరణ, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. మండల, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలను 2 విడతలలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో 16 జెడ్ పి టి సి, 129 ఎం పి టి సి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మొదటి విడత ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 12వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటయే నామినేటెడ్ అభ్యర్థుల జాబితా, 13వ తేదీన అప్పీళ్ళ స్వీకరణ, 14వ తేదీన అప్పీళ్ళ పరిష్కరణ, 15వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వం ఉపసంహరణ, 3 గంటల తరువాత పోటీ చేయు అభ్యర్థుల జాబితా ప్రచురణ, 23వ తేదీన పోలింగ్, నవంబర్ 11వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతాయని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో నిబంధనలను పాటించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ఫారములు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ప్రచార సంబంధించిన అనుమతులు నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సి.సి. కెమెరాలు, గోడ గడియారాలు, ఓటర్ల జాబితా నిర్వహణ సక్రమంగా ఉండాలని, నామినేషన్ల సమయంలో వీడియోగ్రఫీ ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ సమయంలో అభ్యర్థులు సమర్పించవలసిన అఫిడవిట్లు, ధ్రువపత్రాలు, ఇతర ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో జరగనున్న ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, మండల తహసిల్దార్ రామచందర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం ప్రాంగణ అభివృద్ధి పనుల పరిశీలన

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ములుగు ప్రతినిధి - మేడారం, అక్టోబర్ 08(జనంసాక్షి) :** బుదవారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఈ ఎన్ సి ప్రహరీ గోడ మార్కింగ్ ను కలెక్టర్ కు చూపించి పని పురోగతి ప్రణాళిక గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మేడారం దేవాలయం ప్రాంగణ అభివృద్ధి పనులలో భాగస్వాములైన అధికారులతో కలసి ప్రారంభించబడిన అభివృద్ధి పనులను నిశితంగా పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం మరియు భక్తుల రద్దీకి సంబంధించి చెయవలసిన పనుల పై పలు సూచనలను అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఆండ్ బి ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, ఆర్కిటెక్ట్, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా బొల్లోజు సురేష్ ఎన్నిక

**శాయంపేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి) :** తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా శాయంపేట గ్రామానికి చెందినబొల్లోజు సురేష్ ని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి యుగంధర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ చైర్మన్ సంఘ వీరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు తొవిటి సదానంద చారి, గోగులస్వామి, బోదేరా ప్రవీణ్ కుమార్, గుంజి నరసింహారావు, రానా నాగేష్ సింగ్, కుమార్ మహేంద్ర, పసుపులేటి కరుణాకర్, కొత్తపల్లి బాయమ్మ, వెన్ను అరుణ పాల్గొన్నారు.

# మీడియా సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్

- **ఎన్నికల వార్తలపై నిఘా పెట్టాలని సూచనలు**



**నిర్మల్ రూరల్,అక్టోబర్8(జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ,మీడియా మానిటరింగ్ సర్టిఫికేషన్ కమిటీ(ఎంసిఎంసి)ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమాచార శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన కలెక్టర్, అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి వార్తపై నిఘా ఉంచాలని సూచించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా వచ్చే వార్తలు లేదా ప్రచారాలు ఏవైనా గమనించిన వెంటనే వాటి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని, వాస్తవాధారిత వార్తల ప్రచారంతో ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుం దన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, అపోహలు వ్యాపించకుండా జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీపీఆర్వో విష్ణువ ర్ధన్, డిపిఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- **కలెక్టర్ వెంకటేష్**



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 8 ( జనం సాక్షి) :** భూభారతి దరఖాస్తులను వెంటనే రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ఆదేశించారు. బుధవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులపై కలెక్టర్ వెంకటేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారుల సమస్యలకు పరిష్కారం చూపడంలో ఆదేశించారు. పేరు, తండ్రి పేరు, ఇంటి పేరు, విస్తీర్ణం, విరాసత్, పట్టా మార్పిడి, డిజిటల్ సంతకం తదితర సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, డివిజన్ పరిధిలోని తహసిల్దార్లు పాల్గొన్నారు.

### కౌంటింగ్ కేంద్రాల పరిశీలన..!

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ వెంకటేష్ పరిశీలించారు. పట్టణంలోని త్రిశూల్ పహాడ్ పేదల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచుల ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే విషయం, భద్రత గురించి కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, డి.ఎస్.పి వహీయొ ద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
09 అక్టోబర్ 2025

# రౌడీ షీటర్స్‌పై పటిష్ట నిఘా..

- దౌర్జన్యాలకు పాల్పడితే పిడి యాక్ట్ నమోదు
- ఎస్పీ కె.నరసింహ

**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె.నరసింహ సూర్యాపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.పోలీసు సిబ్బంది కవాతు,పరికరాలు తనిఖీ చేశారు.సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకుని విధుల నిర్వహణపై సూచనలు అందించారు.పోలీసు స్టేషన్ అవరణంలో మొక్కలు నాటారు.అనంతరం ప్రజలకు అందించే పోలీసు సేవలు, నేరాల నమోదు, పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల తీరు, కేసుల దర్యాప్తు, ప్రకృతి వైపరిత్యాలు సమయంలో పోలీసు పని, కేసుల పురోగతి, సీసీ కెమెరాల ఏర్పాటు, మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల రక్షణలో పటిష్టంగా పని చేస్తున్నామని, రౌడీ షీటర్లపై పటిష్టంగా నిఘా ఉంచామన్నారు.ప్రతిరోజు వారి కదలికలను తెలుసుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామని, ఇతరులపై భౌతిక దాడులకు దౌర్జన్యాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి పిడి యాక్ట్ నమోదుతో పాటు జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు.విధుల పట్ల ప్రతి పోలీస్ బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పని చేస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ ప్రజల అవసరాలకు



అనుగుణంగా ట్రాఫిక్ ను పునరుద్ధరిస్తున్నామని,జిల్లా కేంద్రంలో ఎక్కువగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి నేను సైతం కమ్యూనిటీ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, ఎస్ఐ శివ తేజ, మహేంద్ర నాథ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్ బి ఇన్స్పెక్టర్ హరిబాబు, ఆర్ఎస్ఐ అశోక్, ఎఎస్ఐ అంజన్ రెడ్డి, సీసీ సందీప్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం చెప్పిన క్షమాపణను స్వాగతిస్తున్నాం



**గోదావరిఖని, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ దివ్యాంగుల శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ పై కుల వివక్షతో అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ క్షమాపణ చెప్పడాన్నిఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్వాగతించింది బుధవారం గోదావరిఖని పట్టణంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందుగాల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఇది దళిత అనగారిన వర్గాల బహుజనుల ఐక్యతగా భావిస్తున్నామని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కాంపెల్లి సతీష్ అన్నారు, భవిష్యత్తులో ఇటువంటి పరిణామాలు చోటు చేసుకోవద్దన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కన్వీనర్ బూడిద మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, జిల్లా కో కన్వీనర్ ఆకునూరి బాలంకూస్, గద్దల శశిభూషణ్, ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, రామగుండం మున్సిపల్, కో కన్వీనర్ పంజా అశోక్, నాయకులు పెరిక రవి, స్వామీల్, అంబాల రాజకుమార్ కొంకటి సిద్ధార్థ పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంలను పరిశీలించిన జగిత్యాల కలెక్టర్



**జగిత్యాల బ్యూరో, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు. ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత,జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కలెక్టర్ ఏవో హకీమ్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ పాల్గొన్నారు.

## కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



**హాలియా, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** హాలియా పట్టణంలోని కస్తూరిబా బాలికల విద్యాలయం ను నల్గొండ జిల్లా అడిషనల్ కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణలు బుధవారం సందర్శించారు. అనంతరం తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులు యొక్క ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు ఉన్నతంగా చదువుకోవాలని .. కావలసిన వసతులన్నీ మేము త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి, మండల విద్యాశాఖ అధికారి గుండా కృష్ణమూర్తి, అనుముల మండల తహసిల్దార్ రఘు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హేమావతి, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకమైన పాలన కోసమే సమాచార హక్కు చట్టం



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** సమాచార హక్కు చట్టం ద్వారా పాలనలో పారదర్శకత ,బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 12 వరకు సమాచార హక్కుచట్టం వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ అధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బుధవారం తెలిపారు.సమాచార హక్కు చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత పౌర సమాచార అధికారులు ,పబ్లిక్ అథారిటీలపై ఉందని అన్నారు.తప్పుడు సమాచారం ఇవ్వద్దని అన్నారు.సమాచార హక్కు చట్టం ద్వారా అధికార యంత్రాంగంలో పారదర్శకత, బాధ్యత పెరుగుతుందని తెలిపారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ జారీకి సిద్ధం



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నిర్వహణ, నోటిఫికేషన్ జారీకి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు తెలిపారు.బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని హైదరాబాద్ నుండి గ్రామీణ, స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మొదటి విడత జడ్పీటీసీ,ఎంపిటిసి ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లాకు సంబంధించి మొదటి విడతలో నేడు 11 జడ్పిటిసిలు, 112 ఎంపీటీసీలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించి ఆర్వో, ఏఆర్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు,జడ్పీ సిఈఓ అప్పారావు, డిపిఓ యాదగిరి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరికి మద్దతు ధరను అందించాలి

- జిల్లాకలెక్టర్ ఇలా త్రిపాఠి



మాడ్గులపల్లి, అక్టోబర్ 8 (జనంసాక్షి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధర అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.మాడ్గులపల్లి మండలం గ్యారకుంటపాలెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో వరి కోతలు ప్రారంభమైయ్యాయని రైతులు పండించిన ప్రతి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఐకెపిల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలోజిల్లాఅదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ,జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి శేఖర్ రెడ్డి, డీఎస్ఓ, వెంకటేశ్వర్లు డి ఎం, బ్యాంకు లింకేజీ డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ సోమయ్య, మండల తహశీల్దార్, జాయింట్ సబ్ రిజిస్టర్ సరోజ పావని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంగీత తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




**మధిర, అక్టోబర్ 08 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం మధిర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు మండలాలకు (మధిర, ఎర్రుపాలెం, బోనకల్) సంబంధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, లాజిస్టికల్ సదుపాయాలపై అధికారులకు తగు సూచనలు ఇచ్చారు.కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించేందుకు సంబంధిత విభాగాల మధ్య సమన్వయం కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రంలో పరిశుభ్రత, విద్యుత్ సదుపాయాలు, పార్కింగ్ వంటి అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. తరువాత కలెక్టర్ మధిర మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ బూత్‌ల వారీగా చేపట్టిన సమీక్షలపై అధికారుల నుండి వివరాలు సేకరించారు. పోలింగ్ రోజున ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ, అదనపు పోలీస్ కమిషనర్ ప్రసాదరావు, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ సన్యాసయ్య, ఆర్డీవో నరసింహారావు, మధిర తహసిల్దార్ రాళ్లబండి రాంబాబు, రూరల్ సీఐ మధు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ అరిగెల సంపత్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జస్టిస్ బీఆర్ గవాయ్ పై మతోన్మాదుల దాడిని ఖండించండి



**చౌటుప్పల్, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** ఇది ఒక వ్యక్తి పై జరిగిన దాడి కాదు అత్యున్నతమైనటువంటి భారత రాజ్యాంగం పైన జరిగిన దాడిగా పరిగణించాలి, దాడిని ఖండించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధుకృష్ణ గడ్డం వెంకటేష్ అన్నారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ కార్యక్రమం చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనువాద భావజాలం కలిగినటువంటి రాకేష్ కిషోర్ అని న్యాయవాది కోర్టు ఆవరణలోనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైన దాడికి యత్నించడం సిగ్గుచేటు అని రాజ్యాంగ బద్ధంగా పరిపాలన చేయవలసినటువంటి ప్రజా ప్రభుత్వాలే ఇటువంటి మనువాదులకు అండగా ఉండటం కూడా ఇటువంటి చర్యలను ప్రోత్సహించినట్టు అవుతుంది అని వారు అన్నారు. ద్వేషాలను విద్వేషాలను మనోభావాలను భావోద్వేగాలను రెచ్చగొడుతున్నటువంటి సంఘ పరివార్ భావజాలం వ్యాప్తి చెందడంతో ఈ దేశంలో ఇటువంటి చర్యలు క్రమంగా జరుగుతూ ఉన్నాయి. ఈ దేశాన్ని పరిపాలిస్తున్నటువంటి మనువాద వారసులు పూర్తిగా ఈ చర్యకు బాధ్యత వహించి ఈ పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు జిల్లా సహాయ కార్యదర్శి ఎండి ఖయ్యూం, ఎండి సలీం, గుడ్డేటి సుర్జిత్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, రాజశేఖరరెడ్డి, ఎక్కరాజు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో రక్షా హాస్పిటల్ ను డాక్టర్ రంగారెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రానికి వైద్యం కోసం వివిధ గ్రామాల నుండి వచ్చే వారికి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని అన్నారు.హైదరాబాదుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్య సేవలను సూర్యాపేటలో అందే విధంగా వైద్యులు కృషి చేయాలని అన్నారు.హాస్పటల్ మేనేజ్మెంట్ చింతరెడ్డి వినీల పాపిరెడ్డి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో 24 గంటల పాటు అత్యవసర సేవలు, జనరల్ మెడిసిన్, గైనకాలజీ వంటి విభాగాల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు.అనుభవజ్ఞులైన వైద్యులచే వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ, విశ్వసనీయ సేవలతో రక్ష హాస్పటల్ ప్రజలలో విశ్వాసం పొందేలా పనిచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రక్షా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కోలా యశ్వంత్ కుమార్, డాక్టర్ బి.రేఖ,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,డాక్టర్ రామ్మూర్తి యాదవ్,డాక్టర్ ప్రమీల రాంచందర్ నాయక్, డాక్టర్ ఆనంద్ దాంగ్డె,డాక్టర్ రమేష్ నాయక్,డాక్టర్ శ్రీనివాసరెడ్డి, యామా ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చివరి గింజ వరకు ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలను ఆదేశించారు. ఖరీఫ్ 2025-26 సీజన్‌కి సంబంధించి ధాన్యం కొనుగోలుపై బుధవారం కలెక్టరేట్‌లో ఐకెపి, పిఎసిఎస్, ఎఫ్పిఓ, మెప్మా శాఖలకు చెందిన కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఐకేపీ ద్వారా 158, పిఏసిఎస్ ద్వారా 122, ఎఫ్ పిఓ ద్వారా 15, మెప్మా ద్వారా 13, మొత్తం 308 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందని అన్నారు. కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లో ప్రారంభించాలని, ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలు లోతట్టు ప్రాంతంలో ఉండకుండా ఎత్తైన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ప్రతి కేంద్రంలో వేయింగ్ మిషన్,విద్యుత్,త్రాగునీరు, ఫ్లెక్సీపై నిర్వాహకుల పేరు, ఫోన్ నెంబర్, టార్పాలిన్ పట్టాలు, పాడి క్లీనర్లు, డ్రైయర్లు, ట్యాబ్ లాంటి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాలన్ని ప్రారంభించేలాగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి వివి.అప్పారావు, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎం రాము, డిసిఓ పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, రవాణా అధికారి జయప్రకాశ్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే మోసం..

- బ్రహ్మాస్త్రంలా కాంగ్రెస్ బాకీ కార్డు.
- నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్



**హాలియా, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** కాంగ్రెస్ అంటేనే మోసం అని.. కాంగ్రెస్ బాకీ పడ్డ హామీలను కాంగ్రెస్ బాకీ కార్డుతో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిద్దామని నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ పిలుపునిచ్చారు. హాలియా పట్టణంలో బుధవారం గుర్రంపోడ్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి అనంతరం కాంగ్రెస్ బాకీ కార్డులు అందజేశారు. ఎన్నికలకు ముందు అమలు కాని ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఇచ్చి, అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని 22 నెలలు గడుస్తున్నా ఒక్క పథకమూ సక్రమంగా నెరవేర్చకుండా.. వాటి ఊసే ఎత్తకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చామలేడులో గరిష్టంగా దెబ్బతిన్న వరి



**గుర్రంపోడు, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** గుర్రంపోడు మండలం చామలేడు గ్రామంలో అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగి, అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలు కోత దశలో ఉన్నప్పుడు వర్షాలు కురవడం వల్ల, పంట మార్పిడికి సిద్ధంగా ఉన్న వరి చేలు ఒరిగిపోయి, వడ్లు రాలిపోతున్నాయని, రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఒకపక్క యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు యూరియా కోసం సరఫరా కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడుతున్నారు, ప్రభుత్వం సమన్వయ లోపంతో వ్యవహరిస్తోందని విమర్శలు వస్తున్నాయి.

## అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలి




**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 8 (జనం సాక్షి) :** మండలంలోని దేశ్ ముఖి గ్రామంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఎంబీఏ ఫస్ట్‌యేర్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వి. దాసేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలోని అడ్డంకులను అవకాశాలుగా మార్చుకొని ముందుకు సాగాలని సూచించారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ అధిపతి ప్రొఫెసర్ సరితా సత్పతి మాట్లాడుతూ ఎంబీఏతో ప్రపంచవ్యాప్తంగా విస్తృతమైన కెరీర్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సత్తాచాటిన గురుకుల విద్యార్థులు



**ముత్తారం, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** పెద్దపెల్లి జిల్లా జూనియర్ కళాశాలలో జిల్లా సాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో అండర్-14విభాగంలో రామగుండం సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలురు పాఠశాల విద్యార్థిలు రామంచ సహస్ర 100 మీటర్ల, 200 మీటర్లు, 400,మీటర్ల పరుగు పందెంలో 600 మీటర్ల పరుగు పందెంలో అభిజ్ఞ సత్తా చాటగా అండర్-17జిల్లా స్థాయి పరుగు పందెంలో శ్రీ వర్షిణి ,సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ మాధవి తెలిపారు.క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్,మాధవి పి డి పి ఈ టి ఉపాధ్యాయులు సిబ్బంది బుధవారం అభినందించారు.




# నష్టాల్లో సూచీలు..

## • మెరిసిన ఐటీ షేర్లు



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశా యి. అస్థిర సెషన్ తరువాత బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు ప్రారంభ లాభాలు కరెక్షన్‌కు గురై నష్టాల్లో స్థిరపడ్డాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 153.09 పాయింట్లు లేదా 0.19 శాతం క్షీణించి 81,773.66 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 62.15 పాయింట్లు లేదా 0.25 శాతం నష్టపోయి 25,046.15 వద్ద ముగి సింది.విస్తృత మార్కెట్లో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.73 శాతం, 0.52 శాతం నష్టపోయాయి. సెక్టోరల్ ఫ్రంట్ లో, నిఫ్టీ ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా మిగతా అన్ని రంగా లు నష్టాల్లో ముగిశాయి.ఇన్ఫోసిస్, టీసీఎస్, కోఫోర్జ్, ఎల్టీఐ మైండ్‌ట్రీ, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.51 శాతం లాభపడ్డాయి. మరోవైపు నిఫ్టీ రియాల్టీ, మీడియా, ఆటో, ఎనర్జీ 1 శాతానికి పైగా నష్టపోయాయి. నిఫ్టీ బ్యాంక్, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మా, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ కూడా 1 శాతం వరకు పడిపోయాయి.సెన్సెక్స్ లో 30 షేర్లకు గాను 21 షేర్లు పడిపోయాయి. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, సన్ ఫార్మా టాప్ లూజర్స్ గా నిలిచాయి. టైటాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా టాప్ గెయినర్లుగా నిలిచాయి.

## వాళ్లందరికీ కనీసం ఆర్నెల్ల జీతం..



**న్యూఢిల్లీ:**దేశీయ ఐటీ సంస్థ టీసీఎస్ ఇటీవల భారీ లేఆఫ్ ప్రణాళికను ప్రకటించింది. సుమారు 12,000 మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఈ తొలగింపులతో ప్రభావితమవుతున్న ఉద్యోగులకు వివిధ స్థాయిల సెవెరెన్స్ ప్యాకేజీని అమలు చేస్తోంది. ఏఐ, డేటా, సైబర్ సెక్యూరిటీలో కంపెనీ పెట్టుబడులను పెంచుతున్న నేపథ్యంలో సిబ్బంది పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. ఈ నిర్ణయం సోషల్ మీడియాలో కలకలం రేపింది.సంస్థలో ఎవరి నైపుణ్యాలైతే పనికిరావో లేదా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం పొందడానికి అవకాశం లేదో అలాంటి వారిని టీసీఎస్ తొలగిస్తోంది. వీరందరికీ మూడు నెలల నోటీసు వ్యవధి చెల్లింపుతో పాటు ఆరు నెలల నుండి ఒక సంవత్సరం జీతాన్ని సెవెరెన్స్ ప్యాకేజీ కింద అందిస్తోంది. ఇది సంస్థలో వారి సర్వీస్ కాలాన్ని బట్టి మారుతూ ఉంటుంది. అయితే అందరికీ కనీసం ఆరు నెలల వేతనాన్ని ఇవ్వాలని నిర్ణయించారు.ప్రభావిత ఉద్యోగులు మరో ఉద్యోగం వెతుక్కోవడంలో సహాయపడటానికి, టీసీఎస్ మూడు నెలల వరకు అవుట్ ప్లేస్ మెంట్ ఏజెన్సీ ఫీజులను అందిస్తోంది. అదే జూనియర్ అసోసియేట్లకు అయితే ఇంకొన్ని నెలలు ఈ సహాయాన్ని అందించనుందని టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొంది. ఇక అలాగే ఉద్యోగులకు అందించే మానసిక ఆరోగ్య సాయం టీసీఎస్ కేర్స్‌ను కూడా కొన్నాళ్ల పాటు వారికి కొనసాగించనుంది. బెంచ్‌లో ఉండి లేదా ఎనిమిది నెలలకు పైగా వర్క్ కేటాయించని ఉద్యోగులు తొలగింపునకు గురైతే వారు ప్రామాణిక మూడు నెలల నోటీసు వ్యవధి వేతనాన్ని మాత్రమే పొందుతారు. రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నవారికి, పదవీ విరమణ ప్రయోజనాలు, బీమాకు పూర్తి ప్రాప్యతతో ముందస్తు రిటైర్‌మెంట్ ఎంపికను టీసీఎస్ అందించింది. అలాంటి వారు మిగిలిఉన్న సర్వీస్ కాలాన్ని బట్టి ఆరు నెలల నుండి రెండేళ్ల వరకు జీతాన్ని సెవెరెన్స్ ప్యాకేజీగా అందుకుంటారు.

## అంబుడ్స్‌మన్ స్కీమ్ విస్తరణ



**న్యూఢిల్లీ**రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) పరిధిలోకి రాష్ట్ర సహకార బ్యాంకులు, కేంద్ర సహకార బ్యాం కులు చేరనున్నాయి. ఇందుకు 2021 ఏకీకృత అంబుడ్స్‌మన్ పథకం(ఐవోఎస్)లోకి వీటిని చేరుస్తూ ఆర్‌బీఐ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది.దీంతో నవంబర్ 1నుంచి రూ.50 కోట్ల డిపాజిట్ పరిమాణంగల అన్ని వాణిజ్య బ్యాంకులతోపాటు.. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు, కేంద్ర సహకార బ్యాంకులు, షెడ్యూల్డ్ ప్రైమరీ(అర్బన్) సహకార బ్యాంకులు, నాన్‌షెడ్యూల్డ్ ప్రైమరీ(అర్బన్) సహకార బ్యాంకులకు ఏకీకృత అంబుడ్స్‌మన్ స్కీమ్ వర్తించనుంది. కనీసం రూ. 100 కోట్లు అంతకుమించిన ఆస్తులు కలిగిన అన్ని నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)లనూ పథకం కవర్ చేయనుంది. అయితే హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలను ఈ పథకం నుంచి మినహాయింపునివ్వగా.. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలను చేర్చింది. ఈ ఆర్‌బీఐ ఐవోఎస్‌ను 2021 నవంబర్‌లో ప్రవేశపెట్టింది. అంబుడ్స్‌మన్ అనేది బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఇతర నియంత్రిత సంస్థల వినియోగదారుల కోసం కేంద్రీకృత ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ.క్రెడిట్ రిస్క్‌లో సవరణ:బ్యాంకుల క్రెడిట్ రిస్క్ నిబంధనలను సవరించేందుకు ఆర్‌బీఐ తాజాగా ప్రతిపాదించింది. సంభవించిన నష్టాల ఆధారంగా ప్రొవిజనింగ్ చేపట్టేందుకు ప్రస్తుతం బ్యాంకులను ఆర్‌బీఐ నిబంధనలు అనుమతిస్తున్నాయి. వీటిస్థానే అంచనా రుణ నష్టాల ఆధారిత ప్రొవిజనింగ్‌కు వీలు కల్పించే విధంగా ఆర్‌బీఐ నిబంధనల సవరణకు ప్రతిపాదించింది. తద్వారా క్రెడిట్ రిస్క్ నిర్వహణా విధానాలను మరింత పటిష్టం చేయనుంది. అంతేకాకుండా వివిధ ఫైనాన్షియల్ సంస్థలను పోల్చి చూడటంలో మరిన్ని అవకాశాలకు తెరతీయనుంది. 2025 ఆర్‌బీఐ మార్గదర్శకాలు పేరుతో అంతర్జాతీయంగా అనుమతించిన నిబంధనలు, అకౌంటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా తాజా ముసాయిదాను రూపొందించింది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, దేశవ్యాప్త ఫైనాన్షియల్ సంస్థలు- అసెట్ క్లాసిఫికేషన్, ప్రొవిజనింగ్ అండ్ ఇన్‌కమ్ రికగ్నిషన్ పేరుతో ముసాయిదాను విడుదల చేసింది.

వెయ్యి కొత్త ఉద్యోగాలు..

## డిజిటల్ ఇంజినీరింగ్ కంపెనీ ప్రకటన

**న్యూఢిల్లీ:**గ్లోబల్ డిజిటల్ ఇంజినీరింగ్ కంపెనీ నగారో వచ్చే 12-18 నెలల్లో 1,000 మంది పైగా నిపుణులను నియ మించుకునే యోచనలో ఉంది. హైదరాబాద్, బెంగళూరు, పుణె సహా కీలక హబ్‌లలో ఈ నియామకాలు చేపట్టను న్నట్లు సంస్థ తెలిపింది.కంపెనీకి ప్రస్తుతం భారత్‌లో 13 ,000 మంది ఉద్యోగులు ఉన్నట్లు నగారో సీఈవో మానస్ హుమాన్ వివరించారు.స్టార్టప్‌లు, గ్లోబల్ కేపబిలిటీ సెం టర్లలో (జీసీసీ) హైరింగ్ పెరగడంతో మార్కెట్లో నిపుణుల కొరత నెలకొందని, అయితే అంతర్జాతీయ అనిశ్చితులపై ఆందోళన వల్ల ఉద్యోగాలు మారే విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తున్నట్లు మానస్ తెలిపారు. అంతర్జాతీయంగా వాణిజ్య, టారిఫ్‌లపరమైన అనిశ్చితులు ప్రభావం చూపుతున్నాయని వివరించారు.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.20 | ₹ 5.22 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,13,600 (22 క్యారెట్లు) | ₹ 1,23,930 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,70,000

## జాబ్‌లో చేరిన 4 నెలల్లోనే రూ.1లక్ష వేతనం పెంపు



వేతనాల పెంపు కోసం చాలా మంది ఉద్యోగులు సంవత్సరాల తరబడి ఎదురుచూస్తుంటారు. కానీ ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కేవలం నాలుగు నెలల్లోనే భారీ వేతన పెంపును అందుకున్నాడు.కంపెనీలో చేరినప్పుడు తన సీటీసీలో 100% పెరిగిన కొద్ది నెలలకే మరోసారి వేతన పెంపు అందుకున్నాడు. ఈమేరకు రెడ్డిట్‌లో చేసిన పోస్ట్ కాస్తా వైరల్‌గా మారింది.పోస్ట్‌లోని వివరాల ప్రకారం..'నేను ప్రముఖ కంపెనీలో ఇటీవలే చేరాను. నాకు 7.2 ఏళ్ల పని అనుభవం ఉంది. అంతకుముందు పని చేసిన కంపెనీతో పోలిస్తే కొత్త సంస్థ 100 శాతం సీటీసీను పెంచింది. నేను ఇంటర్వ్యూలో అడిగిన దానికంటే ఎక్కువగానే వేతనం ఇచ్చారు. దాంతో నాకు ఏటా రూ.31 లక్షలు ఆఫర్ చేశారు. కొత్త సంస్థలో చేరి నాలుగు నెలలైంది. ఇటీవల అప్రైజల్స్ వచ్చాయి. అందులో ఆశ్చర్యంగా నాకు మరో లక్ష పెంచారు. దాంతో నా వార్షిక వేతనం రూ.32 లక్షలైంది' అని రాసుకొచ్చారు.ఈ వ్యవహారంపై నెటిజన్లు స్పందిస్తున్నారు. 'ఇది అసాధారణమైనది కాదు. మంచి స్టార్టప్ కంపెనీలు నైపుణ్యాలున్న వారి కోసం ఇలా చేస్తాయి' అని ఒకరు తెలిపారు. మరోవ్యక్తి స్పందిస్తూ..'కేవలం 5 నెలల్లోనే నేను 16% పెంపు పొందాను' అని చెప్పారు.

## దేశంలో 10 ప్రీమియం సర్వీస్ సెంటర్లు ప్రారంభం



భారతదేశంలో కస్టమర్ సపోర్ట్, మేనేజ్‌మెంట్‌ను మెరుగుప రచడానికి షావోమి ప్రధాన నగరాల్లో 10 ప్రీమియం సర్వీస్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.ఇది భారత మార్కెట్ పట్ల కంపెనీ దీర్ఘకాలిక నిబద్ధతను బలోపేతం చేస్తుందని చెప్పింది. కంపెనీ తీసుకున్న నిర్ణయంలో భాగం గా బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిన్, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, జైపూర్, ముంబై, పుణె, అహ్మదాబాద్‌ల్లో ఈ కేంద్రాల ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే బెంగళూరు, హైదరా బాద్, కొచ్చిన్‌లో కేంద్రాలు ప్రాథమికంగా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.భవిష్యత్తులో దేశవ్యాప్తంగా 100 ప్రీమియం సర్వీస్ సెంటర్లకు విస్తరించా లని సంస్థ యోచిస్తోంది. ఈ సందర్భంగా షావోమి ఇండి యా సీఈవో సుధీన్ మాథుర్ మాట్లాడుతూ..'కంపెనీ ఉత్ప త్తులను తయారు చేసి విక్రయించడం కంటే మమ్మల్ని విశ్వ సించే వ్యక్తులతో శాశ్వత సంబంధాలను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అందులో భాగంగానే ఈ ప్రీమియం సర్వీస్ సెంటర్లను ప్రారంభించాలని నిర్ణయించాం' అని చెప్పారు.

# పొమ్మంటే మీకే నష్టం

- అది స్వల్పకాలిక సంతోషం మాత్రమే
- దీర్ఘకాలంలో తీవ్ర సమస్యలు
- ట్రంప్‌పై వెల్లువెత్తుతున్న విమర్శలు



**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా ఇమ్మిగ్రేషన్ విధానాల ను కఠినతరం చేయడం లేదా ఉన్న ఉద్యోగులను తిరిగి పంపించే నిర్ణయాలు స్వల్పకాలికంగా అమెరికన్ ఉద్యోగులకు మేలు చేస్తాయనే వాదనలున్నాయి.కానీ, దీర్ఘకాలంలో ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచంలో ఆ దేశ పోటీతత్వానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. వలస వచ్చిన నిపుణులు అమెరికా ఆవిష్కరణకు మూల స్తంభాలుగా ఉన్నారు. పేటెంట్లు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం రంగాల్లో గ్రాడ్యుయేట్లు, వెంచర్ క్యాపిటల్-ఫండ్ పొందిన సంస్థల్లో కీలక స్థానాల్లో విదేశీ నిపుణుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. వారంతా విరమించుకుంటే అమెరికన్ కంపెనీల్లో నైపుణ్యాల కొరత ఏర్పడుతుంది. ముఖ్యంగా సాంకేతిక రంగంలో ఇది మరీ ఎక్కువగా ఉంటుంది. దీని వలన ఆవిష్కరణ రేటు తగ్గి, ఉత్పాదకత దెబ్బతింటుంది. కొన్ని అంచనాల ప్రకారం, కఠినమైన వలస విధానాలు దీర్ఘకాలంలో అమెరికా స్థూల జాతీయోత్పత్తి ని గణనీయంగా తగ్గించవచ్చు.

**శ్రామిక శక్తి పెరుగుదలపై ప్రతికూలత**

అమెరికన్ స్థానిక జనాభా వయసు పెరుగుతున్న నేపథ్యంలో గత 20 ఏళ్లుగా శ్రామిక శక్తి వృద్ధికి వలసదారులు ప్రధాన చోదక శక్తిగా ఉన్నారు. 2000 నుంచి 2022 మధ్య 25-54 ఏళ్ల వయసున్న శ్రామికుల్లో దాదాపు మూడు వంతుల పెరుగుదలకు విదేశీయులే కారణం. కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాలు శ్రామిక శక్తి వృద్ధిని తగ్గిస్తాయి. ఇది ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే సామర్థ్యాన్ని తీవ్రంగా పరిమితం చేస్తుంది.

**పోటీ దేశాలకు లాభం**

అమెరికాలో ఉద్యోగం కోల్పోయిన లేదా ప్రవేశం దొరకని అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులు వేరే మార్గాలను అన్వేషిస్తారు. ఈ సమయంలో కెనడా, జర్మనీ వంటి దేశాలు వీరికి స్వాగతం పలుకుతున్నాయి. అమెరికా కోల్పోయిన ఈ మేధాసంపత్తి ఇతర దేశాలకు బదిలీ అవుతుంది. తద్వారా ఆ దేశాల ఆవిష్కరణ, ఆర్థిక వ్యవస్థలు బలోపేతం అవుతాయి. అమెరికాను కాదని ఇతర దేశాలకు వెళ్లే వలసదారులు అక్కడ వ్యాపారాలను స్థాపిస్తారు. వినియోగాన్ని పెంచుతారు.

## అమెరికా పొమ్మంటూంటే.. ఇవి రమ్మంటున్నాయి!

అమెరికా హెచ్1బీ వీసాపై పెంచిన ఫీజులు, 'యూఎస్ ఫస్ట్' వైఖరితో అక్కడ ఉన్న ఇతర దేశాలకు చెందిన చాలామంది ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.దాంతోపాటు అమెరికా వెళ్లాలని భావిస్తున్న ఇతర దేశాల్లోని వారు ఆలోచనలో పడ్డారు. ఈనేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అనేక ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు తమ శ్రామిక శక్తి లోటును భర్తీ చేయడానికి, ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేయడానికి నియామకాలను ముమ్మరం చేస్తున్నాయి.

**నైపుణ్యం కలిగిన వారికి అవకాశాలు..**

కెనడా: అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానం కెనడా తన టెంపరరీ ఫారిన్ వర్కర్ ప్రోగ్రామ్ ద్వారా గ్లోబల్ టాలెంట్ స్ట్రీమ్ విధానంలో నిపుణులను వేగంగా రిక్రూట్ చేసుకుంటోంది. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ, గ్లోబల్ టాలెంట్ ప్రావిన్షియల్ నామినీ ప్రోగ్రామ్స్ వంటి విధానాలు అనుసరిస్తోంది. ముఖ్యంగా టెక్నాలజీ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, నెట్‌వర్క్ టెక్నీషియన్లు), ఇంజినీరింగ్ (ఎలక్ట్రికల్, సివిల్), ఆరోగ్యం (నర్సులు, డాక్టర్లు), నిర్మాణం వంటి విభాగాల్లో నియామకాలు చేపడుతున్నారు. కెనడా అర్హతగల అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగుల వర్క్ పర్మిట్ దరఖాస్తులను కేవలం రెండు వారాల్లో ప్రాసెస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది అత్యంత వేగవంతమైన ప్రక్రియ. జర్మనీ:యూరప్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జర్మనీ తన కార్మిక లోటును పూడ్చుకోవడానికి చురుగ్గా వలసదారులను ఆకర్షిస్తోంది. అందుకోసం ఈయూ బ్లూ కార్డ్ ఎంప్లాయ్‌మెంట్ వీసా, జాబ్ సీకర్ వీసా, ఆపర్చునిటీ కార్డ్ పాలసీలను అనుసరిస్తుంది. ఇక్కడ ముఖ్యంగా ఇంజినీరింగ్ (మెకానికల్, ఆటోమోటివ్, ఎలక్ట్రికల్), (సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లు, డేటా సైంటిస్టులు), ఆరోగ్యం (డాక్టర్లు, నర్సింగ్), ఫైనాన్స్ రంగాల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక్కడ ఉద్యోగం చేయాలంటే జర్మన్ భాషా నైపుణ్యం కలిగిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తారు.ఆస్ట్రేలియా:ఆస్ట్రేలియా పాయింట్స్-ఆధారిత వ్యవస్థను ఉపయోగిస్తుంది. నైపుణ్యాల కొరత ఉన్న ఉద్యోగాల జాబితాను క్రమం తప్పకుండా ప్రకటిస్తుంది. హెల్త్‌కేర్ (నర్సింగ్, ఇతర వైద్య నిపుణులు), ఇంజినీరింగ్, నిర్మాణ రంగంలో అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియాలో కనీస వేతనంగా భారీ మొత్తాన్ని చెల్లిస్తారు.యూకే:యూకే కూడా పాయింట్స్-ఆధారిత ఇమ్మిగ్రేషన్ వ్యవస్థకు మారింది. నైపుణ్యం కలిగిన కార్మికులకు, ఆరోగ్య కార్యకర్తలకు వీసా ప్రక్రియను సులభతరం చేసింది. హెల్త్‌కేర్ (నర్సులు, వైద్య నిపుణులు), విద్యలో అవకాశాలున్నాయి.స్వీడన్: స్వీడన్ అధిక నాణ్యత గల జీవన ప్రమాణాలు, బలమైన సామాజిక భద్రత, వర్క్-లైఫ్ సమతుల్యతకు ప్రసిద్ధి చెందింది. టెక్నాలజీ, హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, పునరుత్పాదక శక్తి రంగాల్లో భారీగా అవకాశాలున్నాయి. నైపుణ్యం కలిగిన నిపుణులకు వర్క్ పర్మిట్ ప్రక్రియ చాలా సరళంగా ఉంటుంది.నెదర్లాండ్స్:నెదర్లాండ్స్ ఒక అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం. హై-టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రసిద్ధి చెందింది. హైలీ స్కిల్డ్ మైగ్రెంట్ వీసా, ఈయూ బ్లూ కార్డ్ పాలసీలు పాటిస్తుంది. ఫైనాన్స్, ఇంజినీరింగ్, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయి.సింగపూర్, యూఏఈ:ఆసియాలో ఈ దేశాలు ఉన్నత స్థాయి జీతాలు, తక్కువ పన్నులు, శక్తివంతమైన వ్యాపార వాతావరణాన్ని అందిస్తున్నాయి. సింగపూర్‌లో ఫైనాన్స్, ఫిన్‌టెక్ ఐటీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్ విభాగాల్లో కొలువులున్నాయి. ఇక్కడ జారీ చేసే ఉద్యోగ పాస్‌లు అత్యంత నైపుణ్యం కలిగిన వారికి మార్గాన్ని సుగమం చేస్తాయి. యూఏఈ (దుబాయ్, అబుదాబి)లో నిర్మాణ నిర్వహణ, పర్యాటకం, రియల్ ఎస్టేట్, ఐటీ, ఎనర్జీ వంటి విభాగాల్లో అవకాశాలున్నాయి. ఇక్కడ అందించే గోల్డెన్ వీసాల ద్వారా దీర్ఘకాల నివాస అవకాశాలను పొందవచ్చు.



## వయసు తక్కువే కానీ.. సంపదలో రారాజులు







**న్యూఢిల్లీ:**భారతదేశ స్టార్టప్, వ్యాపార రంగంలో యువతరం శక్తి అద్భుతమైన ప్రభావాన్ని చూపుతోంది. హురున్ రిచ్ లిస్ట్ 2025 విడుదల చేసిన జాబితా ప్రకారం భారత్‌లో అత్యంత ధనిక యువ వ్యాపారవేత్తలు దేశవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న ఎన్నో ఆవిష్కరణలు చేస్తున్నారు.ఆర్థికంగా ఎదుగుతున్నారు. సాంకేతికత, ఫిన్‌టెక్, సైబర్ సెక్యూరిటీ, నిర్మాణ రంగాలు.. వంటి వాటిలో తమదైన ముద్ర వేస్తున్నారు.కైవల్య వోహ్రా కేవలం 22 ఏళ్ల వయస్సులోనే రూ.4,480 కోట్ల నికర విలువతో భారతదేశంలోని అతి పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న తన 'జెప్టో' స్టార్టప్ నిమిషాల్లో కిరాణా సామాగ్రిని డెలివరీ చేయడంలో నగర జీవన విధానాన్ని మార్చేసింది. జెప్టో సహ-వ్యవస్థాపకుల్లో మరొకరు ఆదిత్ పలిచా (23). రూ.5,380 కోట్ల సంపదతో ముందుకు సాగుతున్నారు.రితేష్ అగర్వాల్ (31):ప్రిజం వ్యవస్థాపకుడు. రూ.14,400 కోట్ల నికర విలువతో గ్లోబల్ ఆతిథ్య రంగంలో తనదైన ముద్ర వేశారు. భారతీయ స్టార్టప్‌లను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన దార్శనికత ముఖ్యమైనది.అరవింద్ శ్రీనివాస్ (31): శాన్ ఫ్రాన్సిస్కో కేంద్రంగా ఉన్న పెర్‌ప్లెక్సిటీ ద్వారా రూ.21,190 కోట్లు సేకరించి గ్లోబల్ టెక్ మార్కెట్‌లో భారతదేశ ప్రతిభను తెలియజేశారు.
త్రిష్నీత్ అరోరా (30): చండీగఢ్‌కు చెందిన ఈయన తన సైబర్ సెక్యూరిటీ సంస్థ టాక్ సెక్యూరిటీ ద్వారా రూ.1,820 కోట్ల సంపదను ఆర్జించారు.
శాశ్వత్ నక్రానీ (27): ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ భారత్‌పే సహ వ్యవస్థాపకుడిగా రూ.1,340 కోట్ల నికర విలువతో చిన్న వ్యాపారాల చెల్లింపులను డిజిటలైజ్ చేయడంలో ముందంజలో ఉన్నారు.
రోహన్ గుప్తా , ఫ్యామిలీ (26): ఎస్‌జీ ఫిన్‌సర్వ్ ద్వారా రూ.1,140 కోట్ల సంపదతో డిజిటల్ ఫైనాన్షియల్ సేవలను ఆధునీకరిస్తున్నారు. హార్దిక్ కొఠియా అండ్ ఫ్యామిలీ (31): సూరత్ కేంద్రంగా ఉన్న రేజోన్ సోలార్ ద్వారా రూ.3,970 కోట్ల సంపదతో పునరుత్పాదక ఇంధన పరిష్కారాలపై దృష్టి సారించి పర్యావరణ అనుకూల ఆవిష్కరణ లాభదాయకతను నిరూపించారు.

## సీనియర్ల వేధింపుల వల్లే..

### ఐపీఎస్ ఆఫీసర్ సూసైడ్ నోట్



**గుర్గావ్:** సీనియర్ అధికారుల వేధింపుల వల్లే తాను బలవన్మరణానికి పాల్పడుతున్నానని తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న హర్యానాకు చెందిన ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ రాసిన సూసైడ్ నోట్‌లో బహిర్గతమైంది.ఈ మేరకు పూరన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడే ముందు ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ రాశారు. మంగళవారం పూరన్ కుమార్ బలవన్మరణానికి పాల్పడగా, తాజాగా సదరు అధికారి రాసిన సుదీర్ఘ సూసైడ్ నోట్ బయటకొచ్చింది. ఈ విషయాన్ని సీనియర్ పోలీస్ అధికారులు తమ దర్యాప్తులో కనుగొన్నారు. పూరన్ కుమార్ సన్నిహితుడైన సుశీల్ కుమార్ అనే వ్యక్తి సదరు ఆఫీసర్ పేరు మీద లంచం అడిగినట్లు మద్యం కాంట్రాక్టర్ చేసిన ఫిర్యాదురై రోహతక్ పోలీసులు.. సోమవారం నాడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.పలువురు పైస్థాయి అధికారులు మానసిక వేధింపుల కారణంగానే పూరన్ కుమార్ ఇలా ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో పోలీసులు తేల్చారు. పూరన్ కుమార్ కుమార్ సహాయకుడు తన పేరు మీద రూ. 2.5 లక్షలు లంచం అడిగినట్లు మద్యం కాంట్రాక్టర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా రోహతక్ పోలీసులు సోమవారం ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు.అయితే ఈ క్రమంలోనే సుశీల్‌ను అరెస్ట్ చేయగా, పూరన్ కుమార్ పేరు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఐపీఎస్ ఆఫీసర్ పూరన్ పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. అయితే ఇది సీనియర్ అధికారుల తనను వేధింపులకు గురి చేయడంలో భాగంగానే జరిగిందని, తన ప్రొఫెషనల్ కెరీర్‌ను నాశనం చేయడానికి ఇలా చేశారని సూసైడ్ నోట్ రాసిన పూరన్ కుమార్ ఆపై బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో 10 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు పేర్లు రాసి పెట్టాడు పూరన్ కుమార్.కాగా, హర్యానా కేడర్‌కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ వై. పురాణ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన నివాసంలోనే సర్వీస్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

ఈసారి యుద్ధం వస్తే

## మాదే పైచేయి

- భారత్‌తో ముప్పు తొలగిపోలేదు
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

'భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సైనికులను ఆదేశించారు. పూర్తి సన్నద్ధంగా ఉండండి. దేవుడు వాంఛిస్తే ఆ అవకాశం త్వరలోనే మనకు వస్తుంది అని భారత జవాన్లకు ఆయన పిలుపునిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
09 అక్టోబర్ 2025

# సమాచార హక్కు చట్టం అమలులో జిల్లాను ఆదర్శంగా నిలపాలి

**అవగాహన సదస్సులో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**




**నిజామాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 08 (జనంసాక్షి)**: పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఉద్దేశించిన సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ శాఖలలో సమర్థవంతంగా అమలు చేస్తూ నిజామాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలుపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఆర్.టి.ఐ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సబ్ కలెక్టర్లు, ఆర్డీఓల నేతృత్వంలో గురువారం నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజనల్ స్థాయిలో, శుక్రవారం తహసిల్దార్ల ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో మండల స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలకు ఆయా శాఖల పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓలు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఆర్.టి.ఐ చట్టంలోని నిబంధనలను చక్క గా ఆకళింపు చేసుకుని, పక్కాగా అమలు అయ్యేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి (పీ.ఐ.ఓ), సహాయ పౌర సమాచార అధికారి (ఏ.పీ.ఐ.ఓ), అప్పిలేట్ అధికారి వివరాలతో కూడిన సమాచార హక్కు చట్టం బోర్డును విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అధికారులు మారిన సందర్భాలలో వెంటదివెంట ఆ సమాచారాన్ని అప్డేట్ చేయాలని అన్నారు. అదేవిధంగా ఆర్.టి.ఐ అమలుకు సంబంధించి తప్పనిసరిగా రిజిస్టర్లను నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు వివరాలను అందులో పొందుపరచాలని సూచించారు. 4(1బి) రిజిస్టర్లోని సమాచారంతో కూడిన బుక్ లెట్ను అన్ని కార్యాలయాలలో అందుబాటులో ఉంచాలని, పీరియా డికల్ రిపోర్ట్లను క్రమం తప్పకుండా సేకరించాలని, కనీసం ప్రతి మూడు మాసాలకు ఒకసారి ఆర్.టి.ఐ అమలుపై సమీక్ష జరపాలని అన్నారు. పై అంశాలను పాటిస్తున్నారా, లేదా అన్నది నిశితంగా పర్యవేక్షణ జరుపుతామని కలెక్టర్ తెలిపారు. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలను తప్పకుండా పాటిస్తూ, దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధి లోపు పరిష్కరించాలని అన్నారు. దరఖాస్తుదారు రెండవ అప్పిలేట్ అథారిటీకి వెళ్లే ఆస్కారం లేకుండా కోరిన సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్లో అందించాలని, సమాచారం అందించే సమయంలో వివక్షతతో వ్యవ హరిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్.టి.ఐ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావిస్తూ, అనవసర కాలయాపన చేస్తే జరిమానాలకు గురి కావాల్సి వస్తుందని, ఇది పదోన్నతులు, ఇంక్రిమెంట్లు వంటి వాటిపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్.టి.ఐ అమలులో నిర్లిప్త ధోరణికి అవకాశం లేకుండా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని హితవు పలికారు. దరఖాస్తుదారు కోరిన విధంగా నిర్ణీత వ్యవధిలో పారదర్శకంగా ఖచ్చితమైన సమాచారాన్ని యథాతథంగా అందించాలని అన్నారు. సమాచారం ఇవ్వడానికి తిరస్కరిస్తే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అవగాహన సదస్సులో పాల్గొని, ఆర్.టి.ఐ చట్టం గురించి ఆకళింపు చేసుకుని, అన్ని కార్యాలయాలలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. కాగా, రిసోర్స్ పర్సన్లు కిషన్, కృష్ణారెడ్డి సమాచార హక్కు చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆర్.టి.ఐ అమలు విషయంలో సాధారణంగా జరిగే పొరపాట్లు ఏమిటి, వాటిని ఎలా నియంత్రించుకోవాలి, దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని అందించే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ అన్ని శాఖ ల జిల్లా అధికారులు, పీ.ఐ.ఓలు, ఏ.పీ.ఐ.ఓలు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం

**ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**గంభీరావుపేట అక్టోబర్ 08 (జనంసాక్షి):** రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో శ్రీ హరిహర దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవలు కన్నులపండుగ కొనసాగుతున్నాయి పద్మావతి అలవేలుమంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవంపై పురవీధుల గుండా ఊరోగింపులో ముందు చిన్నారులు దాండియా కోలాటాలు డీజే పాటలతో నృత్యాలు చేస్తూ భక్తులను కనువిందు చేస్తున్నారు స్వామివారికి మహిళలు మంగళారతులు తీసుకువచ్చి దర్శించుకుంటున్నారు. గ్రామంలో గోవిందా నామస్మరణలతో మారుమోగాయి ,భక్తులు స్వామివారిని పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు, బుధవారం ఉదయం వెంకటేశ్వర స్వామి రథోత్సవం పైన భక్తులు దర్శనమిచ్చారు, వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు, శ్రీ వెంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు భక్తులకు ఉంటాయని, వేద పండితులు తెలిపారు ,ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బి ఆర్ఎస్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, నాస్కప్ చైర్మన్, కొండూరి రవీందర్రావు, ఎస్సై అనిల్ కుమార్, మాజీ జెడ్పిటిసి, విజయ లక్ష్మణ్, నర్సా గౌడ్,సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హనుమాన్లు, మండల అధ్యక్షుడు హమీద్, వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ, యూత్ మండల అధ్యక్షుడు, స్వామి, వేద పండితులు రామాచారి. రామయ్య పంతులు. సూర్య పంతులు. రాధాకృష్ణ, గిరి.ఆలయ కమిటీ చైర్మన్ దొంతినేని పాపారావు. వైస్ చైర్మన్ జోగు సురేష్. ఆలయ కమిటీ సభ్యులు నరసింహ చారి, రమేష్, కిషన్ రావు, చంద్రారెడ్డి, రాజు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు .

# ఏటీసీలో శిక్షణ పొందిన వారికి మంచి ఉపాధి అవకాశాలు

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**మర్పల్లి అక్టోబర్ 8 (జనంసాక్షి):** ఏటీసీలో శిక్షణ పొందిన విద్యార్థిని విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు వస్తాయని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మర్పల్లి మండల కేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. అక్కడ ఉన్న సామాగ్రిని పరిశీలించారు. ఉన్న సౌకర్యాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో చేరిన వారికి ఆసక్తి ఉన్న సబ్జెక్టులపై నాణ్యమైన శిక్షణను అందించాలని, ఏటీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులతో కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులకు ఆధునాతన సాంకేతికలో పట్టు సాధించే విధంగా



విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏటీసీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు.

# “బుధవారం బోధన”కు ప్రాధాన్యత ఇవ్వాలి

- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం బోధన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు కఠినమైన అంశాలు, పాఠాలు నేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. జడ్పీహెచ్ఎస్ లో “బుధవారం బోధన”లో భాగంగా పదవ తరగతి విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను పరిశీలించారు. ఆంగ్ల పాఠం నేర్చుకుంటుండగా ప్రతి విద్యార్థితో ఆంగ్ల పాఠాన్ని చదివిస్తూ.. పాఠాలు చదవడంలో మెళకువలు నేర్పారు. అన్ని పాఠశాలల్లోని అన్ని తరగతుల్లో బుధవారం బోధన పకడ్బందీగా అమలు చేయాలని విద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కఠినమైన సబ్జెక్టులను నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ఇంగ్లీష్ సమర్థవంతంగా నేర్చుకోవడానికి చక్కటి వేదిక అని తెలిపారు. విద్యార్థులు కష్టతరమైన పాఠం పట్ల బుధవారం బోధనలో దృష్టి పెట్టాలని, శ్రద్ధ, అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లోని తరగతి గదులు, వంటగది, విటమిన్ గార్డెన్ పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, భోజనం చేస్తున్న చిన్నారులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

**“అంగన్వాడీ కేంద్రం సందర్శన’** : నగునూరు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. అంగన్వాడీలో భోజనం చేస్తున్న చిన్నారులతో ముచ్చటించారు. పిల్లల హాజరు, నమోదు, గర్భిణీ, బాలింతల సంఖ్య వంటి వివరాలు అంగన్వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వడ్డించిన భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడి పిల్లల హాజరు పెంచాలని ఆదేశించారు.

**“పల్లె దవాఖాన సందర్శన”**: నగునూర్ “పల్లె దవాఖాన”ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, వైద్య పరీక్షల రిజిస్టర్ ను పరిశీలించారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య సేవల పట్ల గ్రామస్తులందరికీ అవగాహన కల్పించి, నూరు శాతం మందికి ఆరోగ్య మహిళ పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, ఎంఈఓ రవీందర్ పాల్గొన్నారు.

# బ్యాంకర్లు రుణ పంపిణీ లక్ష్యాలను సాధించాలి

- **బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్**
- **గైర్హాజరైన బ్యాంకర్ల తీరుపై కలెక్టర్ సీరియస్**




**నిజామాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** బ్యాంకర్లు ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు కృషి చేయాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలో బుధవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావే శం జరిగింది. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, వచ్చే సీజన్ లో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు, రైస్ మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు గురించి ఆరా తీశారు. ఈ సమావేశానికి పలువురు బ్యాంకర్లు గైర్హాజరు కావ డం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కీలక సమావేశానికి బ్యాంకర్లు రానప్పుడు, సమావేశం నిర్వహించి ప్రయోజనం ఏమిటని సంబంధిత అధికారులను నిలదీశారు. గైర్హాజర్ అయిన బ్యాంకర్ల గురించి మినిట్స్ బుక్లో పొందుపరిచి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సునీల్, డీఆర్డీఓ సాయాగౌడ్, నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్, ఆర్బీఐ ఎల్.డీ.ఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు
# మంత్రి శ్రీధర్ బాబు ఆమోదం

- **సీసీ రోడ్డు, సైడ్ డ్రైనేజ్ పనులపై మంత్రికి సురేందర్ రెడ్డి విన్నపం**
- **వెంటనే స్పందించిన మంత్రి**



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని పలు ప్రధాన జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో సీసీ రోడ్డు నిర్మాణం, సైడ్ డ్రైనేజ్ పనులకు నిధులు మంజూరు చేయించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు, మంథని రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. మంథని పట్టణంలోని శ్రీ అయ్యప్ప దత్తగుడి దేవాలయాల నుండి సి ఆర్ కే కాంప్లెక్స్ మీదుగా తమ్మి చెరువు కట్ట వరకు అలాగే సి ఆర్ కే కాంప్లెక్స్ నుండి ఎరుకల గూడెం హనుమాన్ దేవాలయం వరకు రోడ్డు పూర్తిగా చెడిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దేవాలయాలకు వెళ్లే భక్తులు, అలాగే జనసంచారం అధికంగా ఉండే ఈ ప్రాంతాల్లోని రోడ్ల మరమ్మతుకు డ్రైనేజీల నిర్మాణా నికి సహకరించాలని ఆయన మంత్రిని కోరారు. ఈ విషయమే వెంటనే స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు ఇందుకు సంబంధించిన పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంథని ప్రాంతంలోని ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలపై ఎప్పుడు మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించే మంత్రి శ్రీధర్ బాబుకు ఈ సందర్భ ంగా సురేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కలర్ డబ్బా ఉంటేనే లోపలికి అనుమతా..?

- **వేములవాడ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్వాహకుల వింత పనిష్మెంట్.**
- **జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్న తల్లిదండ్రులు**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 08 (జనంసాక్షి):** వేములవాడలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో మంగళవారం ఓ విచిత్ర ఘటన సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు లేటుగా వచ్చిన విద్యార్థులకు కలర్ డబ్బా తీసుకువస్తేనే లోపలికి అనుమతి’ అనే వింత పనిష్మెంట్ విధించడం తల్లిదండ్రులను ముక్కున వేలేసుకునేలా చేసింది. బతుకమ్మ,దసరా సెలవులు ముగిసిన తరువాత విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. కొంతమంది విద్యార్థులకు ట్రాన్స్పోర్ట్ సౌకర్యం లేక, ఇతర కారణాలతో కాస్త ఆలస్యంగా మంగళవారం స్కూల్కు చేరుకున్నారు. ఈ విషయం ప్రిన్సిపల్ దృష్టికి వెళ్లగానే,లేటుగా వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాల ఎదుట ఉన్న షాపులో కలర్ డబ్బా కొనుక్కొని వస్తేనే లోపలికి ప్రవేశం ఉంటుందని ఆదేశించినట్టు సమాచారం. విద్యార్థులు అయోమయంలో పడగా, తల్లి దండ్రు లు ఈ వింత ఆదేశంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకి బోధించాల్సిన గురువులు ఇలాంటి పనిష్మెంట్లు ఇస్తేఎలా అని తల్లిదండ్రు లు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సహాయంతో కలర్ డబ్బాలు కొనుక్కొచ్చి స్కూల్లోకి ప్రవేశిం చారు.పాఠశాల ఎదుట ఉన్న షాపులో ఒక్కసారిగా కలర్ డ బ్బాల డిమాండ్ పెరగడంతో స్థానికులు ఆశ్చర్య పోయారు. ఈ ఘటన వెలుగు లోకి రాగానే స్థానిక విద్యార్థి సంఘాలు తీవ్రంగా స్పందించాయి. విద్యార్థుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా, ఆర్థికంగా బలహీన వర్గాల విద్యా ర్థులపై ఇలాంటి శిక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యా ర్థులపై అనవసర ఒత్తిడి తీసుకువస్తున్న ప్రిన్సిప ల్, ఉపాధ్యాయు లపై చర్యలు తీసుకోవా లన్నా రు. జిల్లా కలెక్టర్ , వెల్ఫేర్ శాఖ అధికారులు ఈ వ్యవ హారంపై విచారణ జరపాలని, భవిష్య త్తులో ఇలా ంటి సంఘటనలు పునరా వృతం కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రాణాలు పోతున్న పట్టించుకోరా..?



**సదాశివపేట అక్టోబర్ 8(జనంసాక్షి):** గుంతల రోడ్డులో ప్రయాణం చేసి ప్రాణాలు పోతున్న పట్టించుకోరా అని హనుమాన్ నగర్ కాలనీవాసులు ఆందోళనకుదిగారు. మంగళవారంసదాశివపేట పట్టణంలో హనుమాన్ నగర్ కాలనీ రోడ్డు నిర్మించాలని కోరుతూ కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్స రాల నుండి రోడ్డు లేక కాలనీలోకి వెళ్లే మట్టి రోడ్డు గుంతల మయంగా ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని పేర్కొన్నారు. రోడ్డుపై వెళ్తూ వాహనాల పై నుండి కింద పడి చేతులు కాళ్లు విరగడమే కాకుండా ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పలుమార్లు అధికారులకు, స్థానిక నాయకులకు విన్నవించిన పట్టించు కోవడం లేదన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న సంఘటన స్థలానికి చేరుకొని కాలనీ వాసులతో మాట్లాడారు.


## “ అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని “
### ఎస్.జి.ఎఫ్ రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు ఎంపిక




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి):** విద్యార్థుల కు ప్రాథమిక దశ నుండి క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని క్రీడల్లో పాల్గొనడానికి వనరులను కల్పించి విజేతలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం చాలా ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ కు చెందినటువంటి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీల కు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థు లకు విద్యతో పాటు క్రీడల పట్ల అవకాశాలు కల్పించాలని, వివిధ పోటీలలో పాల్గొనేందుకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా వారిలో దాగివున్న ప్రతిభను వెలికితీయవచ్చని వారు అభిప్రాయపడ్డారు. క్రీడల ప్రాముఖ్యత దృష్టిలో పెట్టుకొని వార్షిక ప్రణాళికలో భాగంగా వివిధ రకాల క్రీడల పోటీలు నిర్వహించడమే కాకుండా వారిని వివిధ స్థాయిలో నిర్వహిం పబడేటువంటి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో జగిత్యాల జిల్లాలో నిర్వహించినటువంటి ఎస్.జి.ఎఫ్. జిల్లా స్థాయి టైక్వాంఢో పోటీలలో పాఠశాల కు చెందినటువంటి బి.సహస్ర, 8 తరగతి, అండర్ 17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబ రృడమే కాకుండా త్వరలో మహ బూబ్నగర్ లో నిర్వహిం చబోయేటువంటి రాష్ట్రస్థాయి పోటీలకు సైతం ప్రాతినిధ్యం ఇవ్వ బోతున్నదని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన సందర్భంగా విజేతకు పుష్పగుచ్ఛంతో పాటు అర్హత పత్రాన్ని అందజేసి రాష్ట్రస్థాయిలోనూ విశేషంగా రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సి పాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

# ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 08 (జనంసాక్షి):** కరీం నగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ , వినాయక నగర్ లలో బుధవారం రోజు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిం చారు. వీటిలో 77 బైకులు, 27 ఆటోలు, ఒక ట్రక్ ఉన్నా యి. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగా హన కల్పించారు. సైబర్ నేరాలు జరుగు తున్న తీరును వివరించి, సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే స్పందించి, నేరం జరిగిన గంట లోపల 1930 నంబ ర్కు ఫోన్ చేయడం ద్వారా తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాలను దుర్వి నియోగం చేయడం, వాటిని అక్రమంగా రవాణా చేయడం, అమ్మకం, వినియో గించడం చట్ట ప్రకారం నేరం అని పోలీ సులు స్పష్టం చేశారు. అంతేకాకుండా, వాటి వలన కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.



**అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు:** చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అడిషనల్ డీసీపీ హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యక్తుల పై సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# బాణా సంచా దుకాణాలు నిబంధన మేరకు అనుమతి పొందాలి

**మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి**



**తాండూరు అక్టోబర్ 8 (జనంసాక్షి):** రాబోయే దీపావళి పండుగ సందర్భంగా బాణా సంచా దుకాణాలను నిబంధన మేరకు అనుమతి పొంది ఏర్పాటు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి యాదగిరి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాల యంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసే యజమానులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో నివాస ప్రాంతాల్లో బాణా సంచ దుకాణాలను ఏర్పాటు చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఒకే చోట అన్ని బాణాసంచా ( టపాకుల ) దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. జనవాసాల మధ్య ఏర్పాటు చేస్తే నిబంధన మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లైసెన్సును పొందడానికి ముందు నిబంధన మేరకు ఎన్.ఓ. సీ లనుపొందాలని ఆయన చెప్పారు.

# పోచారం ప్రాజెక్టును సందర్శించిన కేంద్ర బృందం

**నాగిరెడ్డిపేట్,అక్టోబర్ 8 (జనంసాక్షి):** మండలంలోని ఆగస్టు 27న కురిసిన అతి భారీ వర్షాలకు పోటెత్తిన వరదతో మంజీరా నది ముంపుకు నాగిరెడ్డిపేట్ మండలంలో పోచారం,గోలిలింగాల, మాల్తుమ్మెద, చినూర్,వాడి నాగిరెడ్డిపేట,వెంకంపల్లి, బంజర తాండ,తాండూర్, మాటూర్,మాసంపల్లి గ్రామాలలో జరిగిన పంట నష్టం,నేషనల్ హైవే 765 డి రోడ్డు ద్వంసమైన ప్రాంతాలను కేంద్ర బృందం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్తో కలిసి కేంద్ర బృందం సభ్యులు పీకే రాయ్ జెయింట్ సెక్రటరీ హోమ్ అఫైర్స్ నేతృత్వంలో మహేష్ కుమార్ డిప్యూటీ డైరెక్టర్ ఎక్స్పెండిచర్ సెంట్రల్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ శ్రీనివాస్ బైరి మినిస్ట్రీ ఆఫ్ జలశక్తి శశివర్ధన్ రెడ్డి నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఇస్రో డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ హైదరాబాద్ పరిశీలించారు.పోచారం ప్రాజెక్టు ఓవర్ హెడ్ వద్ద మట్టి కొట్టుకపోయిన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు.కేంద్ర బృందం సభ్యులు జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో పంట నష్టం,ఆస్తి నష్టం జరిగిన వివరా లను సేకరించారు.వరదల వల్ల జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు కేంద్ర బృందం సభ్యులు తెలిపారు.



# గంజాయితో పట్టుబడ్డ ఇద్దరు రిమాండ్

**65 గ్రాముల గంజాయి స్వాధీనం**

**బోడుప్పల్ (జనంసాక్షి):** నిషేదిత గంజాయి తో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించిన సంఘటన మేడిపల్లి పోలీసే స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘటకేసర్ మండలం లింగాల గణపురం గ్రామానికి చెందిన అన్నబోయిన కిరణ్ మార్(31) స్థానికంగా టైల్స్ వర్కర్ గా పని చేస్తున్నాడు. మేడిపల్లి క్రాంతికాలనీకి చెందిన బక్కి నవీన్ (26) ప్రవేట్ జాబ్ చేస్తున్నాడు. మంగళ వారం ఉదయం మేడిపల్లి ప్రశాంత్నగర్లోని నిర్మానుష్య ప్రాంతంలో పెట్రోలింగ్ పోలీ సులకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న వీరిద్దరు అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా వారివద్ద 65 గ్రాముల గంజాయితో పాటు బైకు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



### జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే..

# ఎన్నికల ప్రవర్తన నియామావళి (ఎంసిసి) అమలు

- కేంద్ర ఎన్నికల సంఘం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్
- ఉల్లంఘనలు లేకుండా పార్టీలు, ప్రతిని ధులు తమవంతు సహకారం అందించాలి
- షేక్ పేట తహసీల్దార్ ఆఫీస్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు

**హైదరాబాద్,అక్టోబర్ 08 (జనంసాక్షి) :** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రతినిధులు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పక పాటించాలనీ జిల్లా ఎన్నికల అధికారి ,జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. జిల్లా ఎన్నికల అధికారి ,జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆధ్వర్యంలో బుధవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పై జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక షెడ్యూల్ ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరిం చారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడు తూ.... ఈ నెల 6వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిం దన్నారు. ఆ వెంటనే జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ , ప్రైవేట్ ప్రాపర్టీల పై ఉన్న రాజకీయ పార్టీల బ్యానర్‌లు, పోస్టర్‌లు తొలగిం చడం ప్రారంభిం చామన్నారు. షేక్ పేట తహసీ ల్దార్ ఆఫీస్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఈ నెల 13 నుంచి నామి నేష న్‌లు స్వీకరిస్తామని చెప్పారు. నామి నేషన్ ప్రక్రియ సజావుగా కొనసా గేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పటిష్ట భద్రత చర్యలు ఏర్పాటు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.




**అభ్యర్థుల నేర చరిత్రను తెలియజేయాలి**

ఎన్నికల సంఘం విడుదల చేసిన నిబంధనల ప్రకారం, తమ అభ్యర్థులపై పెండింగులో ఉన్న కేసులతోపాటు నేర స్వభావం గురించి రాజకీయ పార్టీలు మీడియాలో వెల్లడించాలన్నారు. ఒక వేళ నేర స్వభావం ఉన్న వారిని అభ్యర్థులుగా పెడితే అటువంటి వారిని ఎందుకు ఎంపిక చేసుకున్నారో? అనే విషయాన్ని తెలియజేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫోటోలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. తెలంగాణలో ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫోటోలు పెట్టడం ఇదే తొలిసారి. హైదరాబాద్ జాయింట్ పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రతినిధులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఫాలో అయితే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక స్వేచ్ఛ వాతావరణంలో ప్రశాంతంగా పారదర్శకంగా జరుగుతుందన్నారు. సజావుగా ఎన్నికలు జరిగేందుకు పోలీసు యంత్రాగం పూర్తిగా సహకరిస్తుందన్నారు.

## బీజేపీ చెప్పు చేతల్లో ఎన్నికల సంఘం




**దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ ఆగ్రహం**

**మహబూబ్ నగర్ బ్యూరో 08(జనంసాక్షి):** స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం బిజెపి చెప్పు చేతల్లో పనిచేస్తూ, ప్రజా స్వామ్యాన్ని కాలరాసిందని దేవరకద్ర ఎమ్మెల్యే గవి నోళ్ల మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో మహా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడు తూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా ప్రభుత్వాలను నిర్ణయిస్తారని అన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఓట్ల వ్యవస్థను ఎన్నికల సంఘం సహకా రంతో బిజెపి కలుషితం చేసిందని పేర్కొన్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు సెంట్రల్ లోక్ సభ స్థానంలోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్లో ఒక లక్ష 250 ఓట్లు దొంగ ఓట్ల దొంగతనం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ ఆధారాలను బయటపెట్టినా, ఎన్నికల సంఘం చర్యలు తీసుకోకుండా, ఓట్ చోరిని బయటపెట్టిన రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని, అఫిడవిట్ ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశించడం హస్యా స్పదమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ప్రేరణ విద్యార్థిని



**జడ్చర్ల, అక్టోబర్ 8 (జనంసాక్షి):** ఈనెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే అండర్ 19 స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు మున్సిపాలిటీ పరిధిలోని ప్రేరణ బ్రిలియంట్ పాఠశాల చెందిన 10వ విద్యార్థిని ఇ.హిందు ఎంపిక అయిందని పాఠ శాల ప్రధానాచార్యులు అమరావతి గోపీనాథ్ తెలిపారు. బుధవారం ప్రధానోచా ర్యులు అమరావతి గోపీనాథ్ పత్రికా ప్రకటన ద్వారా తెలుపుతూ విద్యార్థిని హిందు సంగారెడ్డి జిల్లా లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఫుట్ బాల్ ఆడేందుకు ఎంపికైందని, ఎంపికైన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయికి రాణి ంచాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వ్యా యామ ఉపాధ్యాయుడు బాలు, పాఠశాల ఉపా ధ్యాయ బృందం విద్యార్థినిని అభినందించారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 08 (జనంసాక్షి):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ సారి వరి కొనుగోళ్ల ప్రక్రియలో ఎవరైనా బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ మీటింగ్ హాల్ లో జిల్లా పౌర సరఫరా శాఖ – సంస్థ ఆధ్వర్యంలో 2025 – 26 వానాకాలం (ఖరీఫ్) వరి ధాన్యం కొనుగోలు పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్ల కు సంబంధించింది వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ప్యాక్స్, పోలీసు, ఆర్టీఓ, మార్కెటింగ్, మెప్మా అధికారులు సమన్వయంతో ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు నిబంధనల మేరకు సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. అయితే సమావేశాల్లో చర్చించేది వేరు. క్షేత్రస్థాయిలో జరిగేది వేరు అని ఈ సారి మా త్రం గత సీజన్ లో జరిగిన పొరపాట్లకు తావు ఇవ్వకుండా అధికారులంతా జాగ్రత్తగా ఉండి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో సజావుగా కొనసాగించాలన్నారు. గత సీజన్‌లో రూ.460 కోట్ల వరి ధాన్యాన్ని జిల్లా రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగిందని, ఈ సీజన్ లో ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆమె చెప్పారు. కొనుగోళ్లలో నిబంధనలు పాటించకపోతే శాఖా పరమైన చర్యలు ఉంటాయని పునరుద్ఘాటించారు. జిల్లాలోని అన్ని కేంద్రాల పై డిఆర్డిఏ, డిసిఒ పర్యవేక్షణ ఉండాలన్నారు. మండ ల మానిటరింగ్ కమిటీ రోజూ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల బాధ్యతలు లేని అధికారులంతా కొనుగోలు కేంద్రాలను పరిశీలించాల్సిందేనని కలెక్టర్ తేల్చి చెప్పారు. సదస్సులో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. ఈ నెల రెండో వారంలో జిల్లాలో వరి కొనుగోళ్లు ప్రారంభం అ య్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదికను బట్టి తెలిసిందని, అంతలోపు కేంద్రాల ఏర్పాటు, వసతి సౌకర్యాలు, గన్నీ సంచుల నిల్వ, అందుబాటులో టార్పా లిన్లు ఉంచుకోవాల న్నారు. వర్షానికి ధాన్యం తడవకుండా అన్ని ముం దస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ఆదిత్య, ఆర్డీవో రామచందర్ నాయక్, డి ఆర్ డి ఓ మొగులప్ప, డీ ఎస్పీ నల్లపు లింగయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి బాల్ రాజ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ సైదులు, ఆర్టీవో మేఘా గాంధీ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి బాలామణి, డీసీఓ,సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు, ఐకెపి, మెప్మా, ప్యాక్స్ నిర్వాహకులు, పాల్గొన్నారు.




# ప్రతి ఒక్కరూ 'సచేత్' యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలి

- దిశ మీటింగ్ లోనూ ఎన్డీఆర్ఎఫ్ సేవల విభాగాన్ని భాగస్వాములు చేసే అంశాన్ని పరిశీలించండి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 08 (జనంసాక్షి) :** జాతీయ విపత్తుల నిర్వహణ సేవల్లో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అగ్రస్థానంలో ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. జాతీయ విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలతోపాటు జాతీయ విపత్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులను కోరారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'సచేత్ యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకునేలా చైతన్యం కలిగించాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ సిబ్బందికి క్లిష్టమైన సమయాల్లో రోప్స్, గ్యాస్ కట్టర్స్, జాకెట్ వంటి మౌలిక సదుపా యాల కల్పనలో ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరారు. న్యూఢిల్లీలోని ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ) సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్డీఎంఏ ఉన్నతాధికారులతో సమావేశమై సంస్థ అందిస్తున్న సేవలను, చేపడుతున్న కార్యాచరణను అడిగి తెలుసుకున్నారు. ఎన్డీఎంఏ సేవలకు సంబంధించి కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ప్రధానంగా తెలంగాణ, పంజాబ్, ఢిల్లీ వరదల (2025)తోపాటు సిక్కిం వరదలు, వయనాడ్ ల్యాండ్‌స్లైడ్, హిమాచల్ వరదల సమయంలో, బాలాసోర్ రైల్వే ప్రమాదం (2023), సిల్క్యారా టన్నె ల్ రక్షణ చర్యల్లో(2023) భాగంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందించిన సాహసోపేత చర్యలను వివరించారు. Yuva Aapda Mitra Scheme NCC, NYKS, BSG, NSS సంస్థల నుండి యువ వాలంటీర్లను చేర్చి, 28 రాష్ట్రాల్లో 2,37,326 వాలంటీర్లు , 1,300 మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వబడిందిబీ ఈ సంస్థలతో కలిసి విపత్తు స్పందన సేవల్లో యువ తను భాగస్వామ్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విపత్తు సేవలు అందించే విషయంలో జపాన్, రష్యా, జర్మనీ, మాల్దీవులు, చిలీసహా 14 దేశాలతో అం తర్జాతీయ అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. అత్యధిక వర్షా లు, వరదలు, విపత్తులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు 'సచేత్ యాప్ ను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13.9 లక్షల డౌన్ లోడ్స్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా ఎక్కడ ఏ విపత్తు వచ్చే అవకాశం ఉందనే సమాచారం ప్రజల కు తెలుస్తుం దని, తద్వారా ఆ విపత్తు నుండి బయటపడే అవకాశాలు ఉంటాయని తెలిపారు.



# లిప్పన్ కళారూపానికి ఆధునికత



**గీతంలో నెక్సెస్ 2025**

**పటాన్చేరు అక్టోబర్ 8 (జనంసాక్షి):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ బుధవారం నెక్సెస్ 2025 పేరిట సృజనాత్మకత, సంస్కృతి, సహకారం యొక్క ఉత్సాహభరితమైన వేడుకను నిర్వహించి, లిప్పన్ కళ యొక్క కాలాతీత ఆకర్షణను సమకాలీన వెలుగులోకి తీసుకొచ్చింది. శతాబ్దాల నాటి లిప్పన్ కళారూపాన్ని ఆధునిక లెన్స్ ద్వారా తిరిగి ఊహించుకుంటూ, సాంస్కృతిక వారసత్వాన్ని సమకాలీన డిజైన్ సున్నితత్వాలతో మిళితం చేశారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది కళాశాలలకు చెందిన 55 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, ఒకరికి మరొకరు సహకరించుకోవడంతో పాటు ఇతరులతో పరిచయాలను పెంచుకుని, తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. సాంప్రదాయ చేతిపనుల యొక్క సాధారణ అన్వేషణగా ప్రారంభమై, ఆవిష్కరణ, బృంద కృషి, కళాత్మక వ్యక్తీకరణలతో కూడిన కాన్వాస్ గా పరిణామం చెందింది. స్కెచ్ బుక్ లు సంక్లిష్టమైన నమూ నాలతో రోజంతా వికసించాయి. తత్ఫలి తంగా, భారత దేశ కళాత్మక వారసత్వాన్ని, యువత ఆవిష్కరణ స్ఫూర్తిని ప్రతిబింబించే సృజ నాత్మక ప్రదర్శనగా నిలిచిపోయింది. ఈ కార్యక్రమాన్ని వీక్షా నోముల, జక్కిడి అద్వయ స్ఫూర్తి ,అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రుతి గాల్లి సమన్వయం చేశారు.

## ప్రతి ప్రాంతానికి ఆధునిక న్యూరో సర్జరీ సేవలు

**ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రఘు సామల**

**మహబూబ్ నగర్ బ్యూరో (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎంవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత మూర్ఛ వ్యాధి, వెన్నెముక వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు వెల్లడించారు. కమ్యూనిటీ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఉచిత వైద్య శిబిరాలో న్యూరోలాజికల్ వ్యాధులు, వెన్నెముక సంబంధిత సమస్యలపై ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రఘు సామల, డాక్టర్ వంశీ కృష్ణా అవగాహన కల్పించారు. ట్రామ మేనేజ్మెంట్ పై ఉచిత కన్సల్టేషన్లు, డయాగ్నస్టిక్ సేవలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ప్రాంతానికి ఆధునిక న్యూరో సర్జరీ సేవలను అందించడమే తమ లక్ష్యమని వెల్ల డించారు. ఏఐజి ఆసు పత్రిలో ఆధునిక మల్టీ స్పె షాలిటీ సదుపాయాల సహాయంతో అవసరమైన వారికి సులభంగా వైద్య సేవలు అందించడమే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, న్యూరో సైన్స్ విభాగాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆసుపత్రి ఎండీ. డాక్టర్ రమేష్ గౌడ్, సీని యర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ డాక్టర్ కార్తీక్, డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా హైడ్రా ఫీల్డ్ విజిట్

- తూముకుంట మున్సిపాలిటీలో కమిషనర్ పరిశీలన
- నాళాల ఆక్రమణలు తొలగించాలని ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్ 08 (జనంసాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తూముకుంట మున్సిపాలిటీలో పర్యటించారు. దేవరాయాంజాల్ విలేజ్ లో సర్వే నంబర్ 135, 136లలో రహదారిలో ఆటంకాలు కలిగిస్తున్న వివాదంపై హైకోర్టు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అదేమార్గంలో కొత్తగా కోర్టు భవనం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వస్తున్న క్రమంలో రహదారిని వెంటనే పునరుద్ధరించాలని స్థానిక మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం దేవరాయాంజాల్ విలేజ్లోని వరద కాలువ ఆక్రమణలను పరిశీలించారు.

**వరద కాలువ వాస్త వెడల్పు ఉండేలా..**

తుర్కవాణి కుంట నుంచి దేవరాయాంజాల్ చెరు వుకు వెళ్లే వరద కాలువ కబ్జా కావడంతో 4 కాలనీలు నీట మునుగుతున్నాయని స్థానికులు ఫిర్యా దు చేసారు. గ్రామ రికార్డ్స్, సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్ సి మ్యాపుల ఆధారంగా గతంలో ఎంత విస్తీర్ణంలో ఉండేదో చూసి. ఆక్రమణలు తొలగించి వరద కాలువను పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. తర్వాత తూము కుంట విలేజ్లోని వాసవి సుచిర్ ఇండియా లేఅవుట్లో నాలా కుంచించుకుపోవడాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. దేవరాయాంజాల్ చెరువు, పోతాయిపల్లి చెరువు నుంచి గుండ్లకుంట చెరువుకు వెళ్లే వరద కాలువ వాస్తవ వెడల్పు కొనసాగించకుండా నిర్మించడాన్ని పరిశీలించారు. 9 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా 2 మీటర్లకే పరిమితం చేయడం వల్ల అదే వెంచర్లోని ప్లాట్లతో పాటు పై భాగంలో ఉన్న నివాసాలు కూడా మునిగిపోతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల వర్షాలకు నీట మునిగిన వీడియోలు చూపించారు. ఓపెన్ నాల ఉండాల్సిన చోట పైపులు వేయడంతో ఈ సమస్య తలెత్తిందని అధికారులు చెప్పారు. ఇరిగేషన్, హెచ్ఎండిఏ, మునిసిపాలిటీ అధికారులతో పాటు వెంచర్ యజమానులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపుతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో స్థానికులు ఊరట చెందారు. హైడ్రా అదనపు కమిషనర్ ఎన్. అశోక్ కుమార్, హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు హైడ్రా అధికార కమిషనర్ రంగనాథ్ వెంట ఈ పర్యటనలో ఉన్నారు.



## పరిశోధన సమాజానికి దిక్సూచిగా ఉపయోగపడాలి

- చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సి.హెచ్.వి.పురుషోత్తం రెడ్డి

**మొయినాబాద్ అక్టోబర్ 08 (జనంసాక్షి) :** పరిశోధన సమాజానికి దిక్సూచిలాగ ఉపయోగపడాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సి.హెచ్.వి. పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో నూతి మనీషా "ఆన్ ఎండ్, ఎండ్ బ్లాక్ చైన్, డ్రివెన్ ఐఓటి బేస్డ్ ఫుడ్ ట్రేసిబిలిటీ సిస్టం" అనే అంశంపై చేసిన పరిశోధన సిద్ధాంతానికి ఆమె ఈ ఘనత సాధించారు. ఆమెకు పి.హెచ్.డి డిగ్రీ పట్టా లభించింది. ఈ సందర్భంగా ఆచార్య యం.జగదీశ్వర్ పర్యవేక్షణలో జరిగింది. పి.హెచ్.డి. డిగ్రీ పట్టా పొందిన నూతి మనీషా చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ చాన్సలర్ సి.హెచ్.వి. పురుషోత్తం రెడ్డి చేతుల మీదగా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ సైన్స్ విభాగంలో పరిశోధన జాతీయ అభివృద్ధికి కీలకమైనదని మరియు గొప్ప గర్వకారణమని ఆయన తెలియజేశారు. పరిశోధనలు సమాజానికి దిక్సూచిలాగ ఉపయోగపడాలని ఆయన సూచించారు. విద్య పరిశోధన సమాజానికి సంబంధితంగా మరియు ప్రభావవంతంగా చేయడం యొక్క ప్రాముఖ్యతను ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి. శంకర్ లింగం, రిజిస్ట్రార్ యం.రవీందర్, క్రిస్టోఫర్, యస్. కవిత, బి.యస్. అనురాధ, యం. జగదీశ్వర్, సి.హెచ్. ప్రతిషా రెడ్డి, ఏ.రమేష్ బాబు, డాక్టర్.వి.మధుకర్, సుదీప్తచంద్, గాదె రాంబాబు రెడ్డి, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## మణికొండ పుప్పాలగూడలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత



**రాజేంద్రనగర్, అక్టోబర్ 8 (జనంసాక్షి):** ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణ చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనైనా కూల్చి వేస్తామని గండిపేట మండలం తహసిల్దార్ కె. శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ సర్వే నెంబర్ 290 లో పట్టా భూమిలో 60 గజాల దొంగ పత్రాలు సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన 6 అక్రమ నిర్మాణాలను ఆయన ఆదేశాలతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కూడా ఇక్కడి ప్రభుత్వ భూమిలో దొంగ పత్రాలు సృష్టించి నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చి వేశామని, అక్రమణదారులు ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## శభాష్ రాధిక

**ఆలిండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ లో ఉమెన్ కానిస్టేబుల్ కు కాంస్యపతకం**




**మహబూబ్ నగర్ బ్యూరో (జనంసాక్షి):** హర్యానా రాష్ట్రంలో సెప్టెంబర్ 20 నుండి 24 వరకు నిర్వహించిన 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ (ఆర్మ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్) – 2025–26లో తెలంగాణ పోలీస్ బృందం తరఫున పాల్గొన్న మహబూబ్‌నగర్ జిల్లా అడ్డకల్ పోలీస్ స్టేషన్ కు చెందిన మహిళా కానిస్టేబుల్ రాధిక 80o కేటగిరీలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ, కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి రాధిక విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెను శాలువా కప్పి అభినందించారు. రాధిక చూపిన కృషి, పట్టుదల, క్రీడాస్ఫూర్తి పోలీస్ సిబ్బందికి ఆదర్శ ప్రాయంగా నిలుస్తాయన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది క్రీడా రంగంలోనూ చాటడం ఎంతో గర్వ కార ణంగా ఉందన్నారు. భవిష్యత్తులో రాధిక జాతీయ, అం తర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే ఎలా?




**హైదరాబాద్,అక్టోబర్ 08 (జనంసాక్షి) :** నాడు జర్నలిస్టు గౌరీ లంకేష్, నరేంద్ర దబోల్కర్, గోవిందు పన్సారే మొదలుకొని ప్రస్తుత సుప్రీంకోర్టు (సిజెఐ) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. సిజెఐపై దాడి చేసిన మతోన్మాద దుండగులను కఠినంగా శిక్షించాలని, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ ముఖ్య కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని చీకట్లో నెట్టేందుకు కొందరు మనువాదులు మతతత్వం పేరుతో ఇలా ప్రవర్తిస్తున్నారని, దీనిని ప్రజలు ప్రజాస్వామికవాదులు మేధావులు ఖండించాలన్నారు. ఇది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే కాదని, భారత రాజ్యాంగంపైన దాడి జరిగిందన్నారు. రాజ్యాంగానికి ప్రజాస్వామిక విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అర్జునప్ప, రవీంద్రనాథ్, ఈశ్వర్, శ్రీను నాయక్, కృష్ణ, కరుణాకర్, టీజీ. శ్రీనివాస్, బిజిలి సత్యం రాములు, చంద్రశేఖర్, బాలయ్య, శివరాములు, మందారం నరసింహులు, పాల్గొన్నారు.

# ఆర్టీసీపై బీఆర్ఎస్‌ది మొసలి కన్నీరు

- ఛలో బస్ భవన్ పేరుతో రాజకీయ కుట్రలు
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం




**హైదరాబాద్, అక్టోబర్8 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ చేపట్టబోతున్న ఛలో బస్ భవన్ కార్యక్రమంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఛలో బస్ భవన్ చేపట్టేవారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఛలో బస్ భవన్‌తో అనవసరమైన రాజకీయ కుట్రకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులపై కేసులు పెట్టిన వాళ్లు ఈ రోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే మాజీ సీఎం కేసీఆర్ కనీసం పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం గాంధీ భవన్‌లో మాట్లాడారు.. ఆర్టీసీపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సంరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ బకాయిలను తాము కడుతున్నామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం గుడిని, గుడి లింగాన్ని మింగినట్టు ఆర్టీసీని పూర్తిగా ధ్వంసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచలేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం కొంత ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు. ఆర్టీసీకి లాభాలు వచ్చే విధంగా కార్యాచరణ తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం సిటీ బస్సుల్లో పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. గురువారం బీఆర్ఎస్ పార్టీ ఛలో బస్ భవన్‌కు పిలుపునిచ్చింది.

# స్వదేశీ టెక్నాలజీకి ఆదరణ

- జోహో మెయిల్‌కు మారిన కేంద్ర మంత్రులు
- ఈ జాబితాలో తాజాగా చేరిన అమిత్ షా




**న్యూఢిల్లీ, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో కేంద్రమంత్రులు సిద్ధం అవుతున్నారు. స్వదేశీ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, డిజిటల్ ఇండియాలో భాగంగా 'జోహో' ప్లాట్‌ఫామ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఆ సంస్థ సేవలు వినియోగిస్తుండగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోహో మెయిల్‌లోకి మారిపోయారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. హలో.. నేను జోహో మెయిల్‌కు మారాను. నా ఈమెయిల్ చిరునామాలో ఈ మార్పును గమనించండి. నా కొత్త మెయిల్ అడ్రస్ గురించి అమిత్ షా తన పోస్టులో రాసుకొచ్చారు. ఇకనుంచి మెయిల్స్ అన్నీ ఈ కొత్త అడ్రస్‌కే పంపాలని చెప్పారు. భారత్‌పై అమెరికా సుంకాల మోత, జీఎస్టీ సంస్కరణల వేళ ప్రధాని మోదీ 'స్వదేశీ' పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ.. కొన్ని సవాళ్లు తప్పవు. అటువంటి సమయాల్లో 'ఆత్మనిర్భర్' స్ఫూర్తిని కొనసాగించాలి. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి అని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు జోహో సేవలను వినియోగిస్తున్నారు. జీమెయిల్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్‌కు పోటీగా జోహో మెయిల్ ను తీసుకువచ్చారు. ఇప్పుడు ఈమెయిల్‌లోకి అమిత్ షా మారగా.. మైక్రోసాఫ్ట్ పవర్‌పాయింట్ బదులు జోహోతోనే కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జోహో రూపొందిన మెసేజింగ్ యాప్ 'అర్టటై'ని వాడాలంటూ ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకుముందు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అర్టటైకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాప్‌ను విపరీతంగా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యూజర్ల ప్రైవసీ కోసం త్వరలోనే 'అర్టటై'లోనూ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తాజాగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో సమాచార గోప్యతపై పెద్దఎత్తున చర్చ జరుగుతోన్న సమయంలో ఈ స్పందన వచ్చింది.

## జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన

- ప్లకార్డులతో నిరసన తెలిపిన ఉద్యోగులు



**హైదరాబాద్, అక్టోబర్8 (జనంసాక్షి) :** భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవాయిపై జరిగిన దాడికి నిరసనగా తెలంగాణ సచివాలయంలో ఆగ్రహావేశం వ్యక్తమైంది. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని జస్టిస్ గవాయి జిందాబాద్‘, దళితులపై దాడులు ఆపాలి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. సి.జె.ఐ. బిఆర్. గవాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం, చట్ట వ్యవస్థ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ .. బిఆర్. గవాయి దేశ అత్యున్నత న్యాయస్థానానికి చెందిన రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తి. ఆయనపై దాడి జరగడం అంటే న్యాయవ్యవస్థ, సామాజిక సమానత్వం మీద దాడి చేసినట్లే. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద మచ్చ అని పేర్కొన్నారు. నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు బి.ఆర్. గవాయికి సంఘీభావం వ్యక్తం చేస్తూ, ఆయనకు పూర్తి భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# జూబ్లీహిల్ బరిలో ఉంటా

- బిజెపిని కోరిన మాధవీలత



**హైదరాబాద్, అక్టోబర్8 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల అవ్వడంతో రాష్ట్ర రాజధానిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రముఖ రాజకీయ పార్టీలు నేతలు జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలో ఎవరిని బరిలోకి దించాలా అని చర్చలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ నేత మాధవీలత జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలు సంబంధించి రంగంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు. ఇందుకోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డా. లక్ష్మణ్ ను కలిసినాట్లు ఆమె తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని బీజేపీ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నానని.. ఈ ఉప ఎన్నికలు పార్టీకి చాలా ముఖ్యమైనవని అన్నారు. ప్రజలకు బీజేపీ పట్ల నమ్మకం, ప్రేమ, అభిమానం విపరీతంగా ఉందని మాధవీలత తెలిపారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనల వల్ల నష్టం జరిగిందని.. ఇప్పుడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. అధిష్ఠానం పరిశీలిస్తున్న అభ్యర్థుల జాబితాలో తన పేరూ ఉందని తెలిసింది. అవకాశం ఇస్తే ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా.. అవకాశం రాకపోయినా, ఒక పోలింగ్ బూత్ బాధ్యతలు ఇచ్చినా సంతోషంగా స్వీకరిస్తాను. గెలుపు కోసం కృషి చేస్తాను. ఢిల్లీ, వారణాసి, ఝార్ఖండ్, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు కోసం పనిచేశానని తెలిపారు. తన రాజకీయ ప్రయాణం బీజేపీ పెద్దల ఆశీర్వాదం, అభిమానంతోనే కొనసాగుతోందని మాధవీ లత పేర్కొన్నారు. గత 18 నెలలుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నానని ఆమె అన్నారు.

## కాలిఫోర్నియాలో దీపవాళి సెలవు

- ప్రకటన చేసిన గవర్నర్

**శానిఫ్రాన్సిస్కో, అక్టోబర్8 (జనంసాక్షి) :** భారత్‌లో జరిగే అతిముఖ్యమైన పండగల్లో దీపావళికి ప్రత్యేకత ఉంది. దీపావళి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ దీన్ని ఘనంగా నిర్వహిస్తారు. తాజాగా కాలిఫోర్నియా ఈ పండగను అధికారిక సెలవు రోజుగా ప్రకటించింది. కాలిఫోర్నియా గవర్నర్ న్యూసమ్ ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండగను అమెరికాలో సెలవు రోజుగా ప్రకటించాలని ప్రతిపాదిస్తూ గతంలో ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాన్ని కాలిఫోర్నియా స్టేట్ అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీ సభ్యుడు ఆష్ కల్రా ప్రవేశపెట్టిన బిల్లుపై తాను సంతకం చేశానని న్యూసమ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై గతంలో కల్రా మాట్లాడుతూ.. కాలిఫోర్నియాలో అత్యధికంగా భారతీయ అమెరికన్లు ఉన్నారు. ఈ పండుగ రోజును అధికారికంగా సెలవుగా ప్రకటిస్తే అది లక్షలాది మంది కాలిఫోర్నియా ప్రజల్లో సంతోషాలు నింపుతుంది. సద్భావన, శాంతి, ఉమ్మడి భావన అనే సందేశాలతో సమాజాన్ని ఈ పండగ ఒకచోట చేర్చుతుంది’ అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పెన్సిల్వేనియా, న్యూ యార్క్‌లు ఇప్పటికే దీపావళికి అధికారికంగా ఇలాంటి గుర్తిం పును ఇచ్చాయి. తాజాగా భారతీయ పర్వదినానికి ఈ రకమైన గుర్తింపు ఇచ్చిన మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. ఈ నిర్ణయంతో ఇక్కడి ఎన్నారైలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైకోర్టులో ప్రభుత్వం బలమైన వాదనలు

- కేసు ఖచ్చితంగా గెలుస్తామని మహేశ్ గౌడ్ ధీమా



**హైదరాబాద్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ నేటికి వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ పక్రియ కొనసాగుతుందన్నారు. గురువారం ఉదయం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దాదాపు 90 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కుల సర్వే జరిగిందని, బీసీల నోటి ముద్దను భాజపా లాగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీల బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# బెట్టింగ్ యాప్స్‌లో లక్షల్లో అప్ప

- ఇంట్లోనే దొంగతనం చేసి..చివరకు తల్లి హత్య
- పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసిన నిజం




**లక్నో, అక్టోబర్8 (జనంసాక్షి) :** బెట్టింగ్ యాప్స ఉసురు తీస్తున్నాయి. వీటి మాయలో పడ్డ యువత.. నిండా మునిగి.. అప్పులపాలై ఎవరికి వారే ఉసురు తీసుకుంటున్నారు. మరికొందరు డబ్బు కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. చివరికి సొంత వాళ్లను కూడా చంపేందుకు వెనకాడడం లేదు. అలాంటి ఘటనే యూపీలో జరిగింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసగా మారిన కొడుకు.. డబ్బు కోసం కన్నతల్లినే కడతేర్చాడు. మరో వ్యక్తి ఓయో రూమ్‌లో సూసైడ్ చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమింగ్‌కు వ్యవసనపరుడైన 20 ఏళ్ల యువకుడు కన్నతల్లిని చంపేశాడు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 3న జరిగింది. మూడు రోజుల తర్వాత దర్యాప్తు చేసిన ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు సొంత కుమారుడే తల్లిని హత్య చేశాడని తేల్చారు. అయితే ఈ హత్యకు బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌లకు బానిసైన యువకుడు ఏకంగా ఏడాది కాలంలో దాదాపు 50 లక్షల రూపాయలు పొగొట్టుకున్నాడు. ఈ నగదును పలు లోన్ యాప్‌లతో పాటు ఇతరుల వద్ద అప్పులు చేసి మరీ ఆడాడని పోలీసు విచారణలో తేలింది. లోన్ యాప్ వేధింపులతో భయాందోళనకు గురైన యువకుడు.. ఇటీవల ఇంట్లో బంగారం ఆభరణాలను చోరీ చేశాడు. ఆ సమయంలో దొంగతనాన్ని తన తల్లి చూసిందని.. విషయాన్ని తండ్రికి చెప్పితే పరిస్థితి దారుణంగా ఉంటుందనే అనుమానంతో తల్లిని చంపేశాడు. ఆ తర్వాత పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఇంట్లోకి దొంగలు వచ్చారని, అమ్మను చంపేశారని డ్రామా ఆడాడు. తనను కూడా చంపేస్తారని దాక్కున్నానని నటించాడు. దొంగలు ఇంట్లో ఉన్న బంగారం , నదును ఎత్తుకెళ్లారని అందరినీ నమ్మించాడు. కానీ ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు.. అతని తల్లి మృతిపై దర్యాప్తు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో యువకుడిని అరెస్టు చేశారు. అయితే ఈ సంఘటన హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది.

## ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం హామీ

- దీపావళి వరకు బంద్ వాయిదా వేసిన విద్యాసంస్థలు

**హైదరాబాద్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రభుత్వం ఇచ్చిన హామీతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసుకుంది. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సమాఖ్య ప్రతినిధులు కలసి తమ సమస్యలను వివరించారు. అనంతరం వారు సమావేశమై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వం దీపావళి లోపల రూ.300 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 13వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మెను, కళాశాలల బంద్ కార్యక్రమాన్ని అక్టోబర్ 23వ తేదీ వరకు (దీపావళి మరుసటి రోజు వరకు) వాయిదా వేయాలని నిర్ణయించారు. అయితే, దీపావళి నాటికి బకాయిలు విడుదల కాకపోతే.. అక్టోబర్ 23న మళ్లీ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటా మని సమాఖ్య స్పష్టం చేసింది. ఇక, దసరా ముందు విడుదల చేసిన రూ.200 కోట్ల బకాయిల్లో సుమారు 70 మైనారిటీ, జనరల్ కళాశాలలకు ఒక్క రూపాయి కూడా అందలేదని సమాఖ్య పేర్కొంది. ప్రభుత్వం వెంటనే నిధుల విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బస్ ఛార్జీల పెంపునకు నిరసన

- నేడు బిఆర్ఎస్ చలో బస్ భవన్

**హైదరాబాద్, అక్టోబర్ 8 (జనంసాక్షి) :** నగరంలో బస్ ఛార్జీల పెంపును నిరసిస్తూ..ఛలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం బస్ భవన్ దగ్గర బీఆర్ఎస్ నేతలు నిరసన చేపట్టనున్నారు. సిటీలో ఆర్టీసీ ఛార్జీల పెంపును ఖండిస్తూ.. బీఆర్ఎస్ ఆందోళనకు దిగనుంది. ఈ నేపథ్యంలో మెహిదీపట్నం నుంచి బస్ భవన్ వరకు ఆర్టీసీ బస్సులో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఇతర నేతలు ప్రయాణం చేయనున్నారు. బస్ భవన్‌కు చేరుకుని ఆర్టీసీ ఎండీకి ఛార్జీల పెంపుపై మెమోరాండం ఇవ్వనున్నారు. ఈ మేరకు బస్ భవన్ ముందు ధర్నా చేపట్టి సిటీ బస్సుల్లో పెంచిన ఛార్జీలు తగ్గించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచిన విషయం తెలిసిందే. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీలు పెంచింది. ఈ మేరకు మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేస్తోంది. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో పెంచిన బస్సు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీ ఛలో బస్ భవన్‌కు పిలుపునిచ్చింది.

# 12న పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

- ఐదు జిల్లాలను ఎంపిక చేసిన కేంద్రం



**హైదరాబాద్, అక్టోబం 8 (జనంసాక్షి) :** ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు అయింది. మన దేశంలో 2011లో చివరి కేసు నమోదు అయింది. గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదు అవుతున్నాయని కేంద్ర వైద్యారోగ్య శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి రాకపోకలు జరుగుతున్న దేశంలోని పలు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ 5 జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

## స్టాక్ మార్కెట్లో నష్టాలతో యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, అక్టోబర్8 (జనంసాక్షి) :** బెట్టింగ్ యాప్‌లతోపాటు స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి తీవ్ర నష్టాల్ని చవిచూసిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఓయో రూమ్ అద్దెకు తీసుకొని సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ లో జరిగింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జై జవాన్ కాలనీకి చెందిన మన్నె నరేందర్ తండ్రి చనిపోగా.. తల్లి జగదాంబతో కలిసి జీవిస్తున్నాడు. నరేందర్ గతంలో ఓ షాపింగ్ మాల్‌లో సేల్స్‌మెన్‌గా పని చేశాడు. స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. షేర్ మార్కెట్ పరుగులు తీసినంతకాలం లాభాలు ఆర్జించాడు. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. మరోవైపు బెట్టింగ్ యాప్స్‌లో కూడా పెట్టుబడి పెట్టాడు. లాభాలు ఎక్కువగా వస్తాయని నమ్మాడు. కానీ తీవ్ర నష్టాలు వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఈసీఎల్ కమలానగర్ లోని ఆర్ స్క్వేర్ ఓయో రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## దగ్గుమందు తయారీ సంస్థపై ఉదాసీనత

- తమిళనాడు తీరుపై కేంద్రం ఆగ్రహం

**న్యూఢిల్లీ, అక్టోబర్8 (జనంసాక్షి) :** దగ్గు మందు వివాదం నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో చాలా మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారు చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు స్పందించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందించుకునే సమయం కాదని.. జవాబుదారీతనం అవసరమని ఆరోగ్య శాఖ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. కేంద్రం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. తమిళనాడు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. డీసీజీఐ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయలేదని తమిళనాడు ప్రభుత్వాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రశ్నించినట్లు సమాచారం.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370